

# అన్నమాచార్యులు

భారతీయ సాహిత్య నిర్మాతలు

# అన్నమాచార్యులు

ఇంగ్లీషు మూలం - తెలుగు అనువాదం

అడపా రామకృష్ణ రావు

సాహిత్య అకాడెమీ

# అనుక్రమణిక


| | | |
|---|---|---|
| | ముఖబంధం | 9 |
| 1. | ఆధ్యాత్మిక భూమిక | 11 |
| 2. | సార్థక జీవితం | 31 |
| 3. | పూజాప్రసూనాలు | 55 |
| 4. | మహితోపహారం | 76 |
| | జ్ఞాపికలు | 96 |
| | ఉపయుక్త పుస్తక సూచిక | 103 |

# ముఖబంధం

అద్వితీయుడై, అనంతవిశ్వంలోని అశేషజీవులకు ఏకమాత్ర శర ణ్యుడై, "అలోకంబగు పెంజీకటి కావల" ఏకాకృతితో వెలిగే పర మాత్మని ప్రాభవాన్ని కీర్తిస్తూ రమణీయమైన గీతాలు రచించి, శ్రవణ మధురంగా గానంచేసే ధన్యజీవులు అరుదుగా ఆవిర్భవిస్తూ ఉంటారు. అటువంటి వాగ్గేయకారుల శ్రేణికి చెందినవాడు తాళ్ళపాక అన్నమాచా ర్యులు ఆ మహనీయులు భక్తిపారవశ్యంలో ఆలపించే కృతులవల్ల ఒక వంక సాహిత్యం సుసంపన్న మవుతుంది; మరొక వంక పరమాత్మని పొందటానికి జీవుడు సాగించే అన్వేషణలో తటస్థించే ఆవేదన, ఆనందం వంటి అనుభూతుల స్వరూపం కూడా మనకు కొంత అర్థమవుతుంది.

భగవద్వైభవాన్ని వర్ణిస్తూ అన్నమాచార్యులు తెలుగుభాషలో వేన వేల కీర్తనలు రచించాడు ఆయన దైవాన్ని విశ్వవ్యాప్తుడు, శ్రీమహావిష్ణు స్వరూపుడు, భువనమోహనమూర్తి అయిన శ్రీవేంకటేశ్వరస్వామి రూపంలో దర్శించాడు. ఆ ప్రభువు కూడా ఆయనను తన ఆస్థాన కవీంద్రునిగా సంభావించి, ఆయన నిత్యం రసవన్మధుర కీర్తనలు విరచించి తనకు వినిపించే ముహూర్తం కోసం అపేక్షగా ఎదురుచూసేవాడట.

క్రీస్తు శకం 15వ శతాబ్దంలో, అన్నమాచార్యుల జీవితకాలంలో, ఆయన కీర్తనలు ఆంధ్రదేశంలో బహుళవ్యాప్తిలో ఉండేవి కాని తెలియ రాని ఏ కారణం వల్లనో క్రమంగా ప్రచారం కొరవడి, కొంతకాలానికి పూర్తిగా మరుగున పడిపోవటం జరిగింది గత శతాబ్దంలో పండితులు తిరిగి వాటి ఉనికిని గుర్తించారు. ఈ శతాబ్దంలో పరిష్కరించి ప్రక టిస్తూ ఉన్నారు. ఇప్పటికి 30 ఏళ్ళ పైబడి సాహిత్యవేత్తలూ, సంగీత విద్వాంసులూ చేస్తున్న అవిరళకృషి వల్ల ఈనాడు తెలుగువారు అన్న మాచార్యుల కవితా సౌందర్యాన్ని గ్రహించగలుగుతున్నారు కాని ఇతర

ప్రాంతాలవారికి ఆ పరమభాగవతుని అనన్య భక్తిగరిమ, మహోజ్జ్వల భావన, ఉక్తి వైచిత్రి, తాత్త్విక చింతనలో ఆయన అందుకొన్న సమున్నత శిఖరాలు ఇంకా తెలియవలసి ఉన్నది ఆ విధంగా తెలిసిననాడు ఆయన కీర్తనలను అన్య భాషలలోని భక్తకవుల గీతాల సరసను చేర్చి తులనాత్మకాధ్యయనం చేయటం సాధ్యమవుతుంది ఆ లక్ష్యం సాధించటానికే ఈ పుస్తకం రూపొందింది. వేల సంఖ్యలో విస్తరించిన ఆయన భక్తిగీతాలలో కానవచ్చే కవితా శిల్పాన్ని రేఖామాత్రంగా నయినా ప్రప్రథమంగా ప్రపంచంలో పదిమందికి పరిచయం చేయటానికి అనువుగా ఈ పుస్తకాన్ని ఇంగ్లీషు భాషలో రచించే అవకాశం సాహిత్య అకాడమీ వారి సౌజన్యంవల్ల నాకు లభించింది. ఇంగ్లీషు మూలానికి తెలుగు అనువాదాన్ని చేసే అవకాశం కూడా ఇప్పుడు నాకు కలిగింది.

ఇంగ్లీషులో నేను వ్రాసిన పుస్తకాన్ని తెలుగులో నేనే అనువదించటం నాకు అపూర్వమైన అనుభవం. కావటం నా పుస్తకమే అయినా, అనువాదం మాత్రం పూర్తిగా ఇంగ్లీషు మూలాన్ని అనుసరిస్తూనే చేశాను. ఈ అవకాశం, ఆహ్లాదం కలిగించిన అకాడమీ అధికారులకు నా కృతజ్ఞత తెలియజేస్తున్నాను.

ఈ గ్రంథరచనకు నాకు అవసరమైన సాహిత్యాన్ని సమకూర్చటంలోనూ, అప్పుడప్పుడు సందేహనివృత్తి కావించటంలోనూ పలువిధాల సహకరించిన ఆప్తమిత్రులు కొందరున్నారు. ఇక్కడ వారిని గురించి నేను పేరుపేరున ప్రస్తావించటం లేదుగాని, నాపట్ల వారు చూపిన సౌహార్దం మాత్రం నా స్మృతిపథంలో మల్లెపువ్వుల పరిమళం వలె, మంజువీణానిక్వణం వలె ఎప్పటికీ నిలిచి ఉంటుంది.

అడపా రామకృష్ణ రావు

సికిందరాబాద్ - 500 026
15 ఆగస్టు 1990

# 1

# ఆధ్యాత్మిక భూమిక

గాఢమైన ఆధ్యాత్మికానుభూతి అప్పుడప్పుడు కమనీయ భక్తి కవితారూపంలో అభివ్యక్త మవుతుంది. భారతీయ సాహిత్యంలో ఈ సాహిత్య ప్రక్రియకు సమున్నతస్థానం లభించటం ఒక విశేషం భారత దేశంలోనే కాదు, ప్రపంచంలోనే ధార్మిక వాఙ్మయంలో ప్రాచీనతమమైన గ్రంధమని పండితులు పరిగణించే ఋగ్వేదంలోనే ఉషస్సును, మిత్ర, వరుణాది దేవతలను భక్తి తత్పరతతో స్తుతించే గీతాలు కనిపిస్తాయి. క్రమంగా భక్తకవుల దోహదంతో ఈ కవితాశాఖ పల్లవించి, పుష్పించటం ప్రారంభించింది. వివిధ భారతీయ భాషలలో వారు రచించిన రమణీయ గీతాలలో పూర్వరాగంతో ప్రారంభమై, నడుమ విరహవ్యధతో నిండి, చివరకు పునస్సమాగమంలోని ఆనందాతిరేకంతో ముగిసే ఆధ్యాత్మికానుభూతులలోని వివిధ పరిణామాలు వర్ణితమయ్యాయి తమిళంలో ఆళ్వారులు, నాయన్మారులు రచించిన పాశురాలు, సంస్కృతంలో జయదేవుని అష్టపదులు, మైధిలీ భాషలో విద్యాపతి, వంగభాషలో చండీదాసు రచించిన పదావళి, హిందీలో సూరదాస్, మీరాబాయి గీతాలు, గుజరాతిలో నరసింహ మెహతా గేయాలు, మరాఠీలో నామదేవ్, తుకారామ్ అభంగాలు, కన్నడభాషలో పురందరదాసు, కనకదాసు రచించిన గీతాలు ఈ సాహిత్య ప్రక్రియకు కొన్ని ఉదాహరణాలు. అవి అటు భక్తి పారవశ్యానికీ, ఇటు కవితాశిల్పానికీ పండితుల మన్నన లందుకొన్నవి

తెలుగులో ఈ విధంగా దైవాన్ని తమ వాక్ప్రసూనాలతో అర్చించిన

వాగ్గేయకారులలో అన్నమాచార్యులు, క్షేత్రయ్య, భద్రాచల రామదాసు, త్యాగరాజు ముఖ్యులు. నేలమీద తిరుగాడే జీవులను క్షణాలలో విహాయస వీధులలో విహరింపజేయగల శక్తి సంగీతానికి సహజంగానే ఉన్నదని వారు గ్రహించారు. సంగీత సాహిత్యాలలో తమకు అప్రయత్నంగా అలవడిన ప్రజ్ఞను ఆత్మోన్నతి కోసమే వినియోగించారు సంగీతంతో చతుర్విధ పురుషార్థాలను సాధించవచ్చునని శార్ఙదేవుడు తన **సంగీత రత్నాకరంలో** వ్రాశాడు. ఐతే భక్త కవులు తమ గానకళను ధర్మ, మోక్ష సాధనకు మాత్రమే ఉపకరణంగా చేసుకొన్నారు

ఆంధ్ర వాగ్గేయకారులలో అన్నమాచార్యులు కాలక్రమంలోనే కాదు, కవితానైపుణ్యంలోనూ, భావనా విస్తృతిలోనూ అగ్రగణ్యుడే తెలుగులో పదకవితా రచనకు మార్గదర్శి ఆయన అధ్యాత్మ కీర్తనలైనా, శృంగార పదాలైనా సమానప్రజ్ఞతో, అసమానప్రజ్ఞతో రచించి, తదనంతర కవులను ప్రభావితం చేశాడు. మువ్వ గోపాలునిపై క్షేత్రయ్య అల్లిన పదాలలో తొణికే సరసశృంగారమూ, రామచంద్రునిపై త్యాగరాజు కూర్చిన కృతులలో విరిసే గాఢభక్తీ అన్నమాచార్యులు తన కీర్తనలలో ఈ రసాలను పోషించిన తీరును మనకు స్ఫురింపజేస్తాయి.

అన్నమయ్య క్రీ శ. 15వ శతాబ్దంలో జీవించాడు. ఆయన జీవితంలో అధికభాగం దక్షిణాపథ మంతటిలో అతి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతిలోనూ, దాని పరిసరాలలోనూ గడిచింది. అక్కడ శ్రీ వేంకటేశ్వరస్వామి వెలసినచోటు ఏడు కొండలమీద ఉండటం వల్ల భక్తులు ఆయనను 'ఏడుకొండలవా'డని, ఇంకా సరళంగా కేవలం 'కొండలరాయ' డని వ్యవహరిస్తారు. స్వామి కోవెల ఉన్న కొండ పేరు వేంకటాచలం కనుక ఆయనను 'వేంకటాచలపతి' అని కూడా సంబోధిస్తారు.

బాల్యంలోనే అన్నమయ్య వేంకటేశ్వరస్వామి దివ్యమంగళ రూప సౌందర్యం తిలకించి పరవశుడై, అవధులు లేని ఆ జగదేకపతి అనుగ్రహానికి పాత్రుడై, కైవల్య ప్రాప్తికి భక్తి ప్రపత్తులే సులభ సాధనాలని చాటే విశిష్టాద్వైత సంప్రదాయాన్ని అవలంబించి వైష్ణవుడయ్యాడు. అందువల్ల ఆళ్వారులు నడచిన బాట ఆయనకు అనుసరణీయ మయింది ఆళ్వారులు తమిళదేశానికి చెందిన పరమ భక్తకవులు, యోగసిద్ధి పొందిన ధన్యజీవులు.

తమిళభాషలో వారు రచించిన పాశురాలలో వ్యక్తమైన భావాలు తరువాత యామునాచార్యులు, రామానుజాచార్యులు వంటి దేశికులు విశిష్టాద్వైత మతతత్త్వాన్ని ప్రతిపాదించటానికి కొంతవరకు ఆధారమైనవి.

ఆళ్వారుల వలెనే అన్నమాచార్యులుకూడా తన జీవితాన్ని విష్ణు పారమ్యాన్ని ప్రబోధించటంలోనూ, విష్ణుమహిమలను కీర్తించటంలోనూ, శరణాగతిమార్గ సౌలభ్యాన్ని ఉద్ఘాటించటంలోనూ గడిపాడు. స్వామికి అనుదినం ఆయన కనీసం ఒక నూతన కీర్తనసైనా నియతంగా అర్పించే వాడట కీర్తనల రూపంలో స్వామికి వాచిక కైంకర్యం చేయటమే తన జీవితపరమావధి అనే విశ్వాసం, తాను నిమిత్తమాత్రుడనని, తనచే ఆడించేదీ, పాడించేది ఆ సకల దేవతాసార్వభౌముడే అనే భావన ఆయన రచించిన ఒక కీర్తనలో సొగసుగా వ్యక్తమయింది.

*దాచుకో, నీ పాదాలకు తగ నే జేసిన పూజ లివి,*
*పూని నీ కీరితి రూపు పుష్పములివి యయ్యా!*

*ఒక్క సంకీర్తనే చాలు ఒద్దికై మమ్ము రక్షింపగ,*
*తక్కినవి భండారాన దాచి ఉండనీ*
*వెక్కసమగు నీ నామము వెల సులభము, ఫల మధికము,*
*దిక్కై నన్నేలితి వింక నవి తీరని నా ధనమయ్యా!*

*నా నాలుకపై నుండి నానాసంకీర్తనలు*
*పూని నాచే నిన్ను పొగడించితివి,*
*వేనామాల వెన్నుడా! వినుతించ నెంతవాడ,*
*కానిమ్మని నా కే పుణ్యము గట్టితి వింతే యయ్యా!*

*ఈమాట గర్వము కాదు, నీ మహిమే కొనియాడితిగాని*
*చేముంచి నా స్వాతంత్ర్యమున చెప్పినవాడను గాను,*
*నేమాన పాడేవాడను, నేరము లెంచకుమీ,*
*శ్రీమాధవ! నే నీ దాసుడ, శ్రీ వేంకటేశుడవయ్యా!*

అన్నమాచార్యులు తన కీర్తనలలో తరచుగా శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యసుందర రూపాన్ని వర్ణిస్తూ ఉంటాడు. విశిష్టాద్వైత మత సిద్ధాంతాలు

వాటిలో పుష్పాలలో పరిమళంవలె అంతటా ఆవరించి ఉంటాయి. కనుక ఆయన భావాలను స్పష్టంగా గ్రహించటానికి, ముందుగా వైష్ణవమతావిర్భావాన్ని గురించి, వేంకటేశ్వరస్వామి అర్చామూర్తిలో గోచరించే కొన్ని సంకేతాల అంతరార్థాన్ని గురించి తెలుసుకోవలసి ఉంటుంది.

దేవుడు ఒక్కడే అని, విద్వాంసులు ఆయనను బహురూపాలలో భావిస్తారని వేదద్రష్టలు ఎన్నడో ఘంటాపథంగా చెప్పారు. ఆ విధంగా దైవాన్ని గురించి ఏర్పడిన బహుభావనలలో నిశ్చయంగా అతి రమ్యమైనది శ్రీ విష్ణుస్వరూపం. విశ్వాన్ని రక్షించటం, పోషించటం ఆయన కర్తవ్యం విశ్వమంతటా వ్యాపించినవాడు గనుక విష్ణువని ("విశతీతి విష్ణుః"), జీవులందరికీ గమ్యమైనవాడు గనుక నారాయణుడని ("నరాణాం నిత్యానాం అయనం ఇతి 'నారాయణ' పదమ్"), సార్థకనామా లేర్పడినవి. ఔదార్యం, సౌహార్దం, కారుణ్యం, వాత్సల్యం, మార్దవం, మాధుర్యం వంటి సమస్త కల్యాణ గుణాలకు నిధియై, సర్వదా ప్రపన్నులను పరిరక్షించటానికి బద్ధకంకణుడై ఆయన విరాజిల్లుతూ ఉంటాడు.

వేదకాలంలో ధ్యానమగ్నులైన ద్రష్టలు తమ మనోవీధిలో ప్రథమంగా విష్ణుస్వరూపాన్ని దర్శించారు. ఆయనను వారు ఉదయభానునిగా భావించి, సూర్యాంతర్వర్తియైన దేవతామూర్తిగా పేర్కొన్నారు. కాని క్రమంగా వారి దృష్టిలో ఆయన రూపం, తేజం విస్తరించి, బ్రాహ్మణాల రచనా కాలానికి ఆయనను దేవతాగణ మంతటికీ అధిదేవుడని పరిగణించటం జరిగింది. "విష్ణువాస స్థానమైన పరమపదాన్ని సూరులు సతతం ఆకాశంపై ఆవరించిన నేత్రంగా దర్శిస్తూ ఉంటా" రనే అర్థంతో ఋగ్వేదంలో ఒక మంత్రం ఉన్నది.[1] సమస్త కర్మకలాపాల ప్రారంభంలో ఆ మంత్రాన్ని పఠిస్తారు. ఆ వేదంలోనే మరొక శ్లోకంలో దీర్ఘతముడు "పరమార్థాన్ని గ్రహించగోరేవారు విష్ణునామం తమకు అట్టి జ్ఞానాన్ని ప్రసాదిస్తుందనే దృఢవిశ్వాసంతో ఒక్కమారైనా ఆ నామాన్ని ఉచ్చరించండి" అని హితబోధ చేస్తాడు.[2] ఋగ్వేదంలో విష్ణుపరంగా ప్రయుక్తమైన 'ఉరుక్రమ', 'త్రివిక్రమ', 'పరమపద' శబ్దాలు నాటికే దేవతాశ్రేణిలో ఆయనకు లభించిన ప్రాముఖ్యాన్ని సూచిస్తున్నవి. ఐతే అప్పుడు విష్ణువును ప్రధానంగా యజ్ఞపతిగా భావించేవారు. ఆయనయే భక్తికి ఏకైక

లక్ష్యమని, భక్తులను అనుగ్రహించటమే తన వ్రతంగా భావించే దయా సముద్రుడనే భావాలు తరువాత వ్యాప్తి చెందినవి.

విశ్వవ్యాపి అని ఋగ్వేదం కీర్తించే విష్ణువు, బ్రాహ్మణాలు ప్రస్తుతించే నారాయణుడు, జనసామాన్యంలో దైవంగా విశేషాదరణ పాత్రుడైన వృష్ణివంశ సంభూతుడు వాసుదేవ కృష్ణుడు — ఈ ముగ్గురి మేళనం నుంచి వైష్ణవమతం ఆవిర్భవించింది విష్ణువే పరదైవమని, భక్తితో ఆయనను ఆరాధించటమే మానవజీవిత పరమావధి అని ఆ మతం ప్రతిపాదిస్తుంది. ఆ జగదేకప్రభువు ఆవాసం వైకుంఠం. ఆయన దేవేరి శ్రీదేవి (లక్ష్మి). అనుగ్రహం ఆయన ప్రధానలక్షణం. అశేష లోకాల సృష్టి స్థితి లయాలు ఆయన లీల అధర్మ వినాశం, ధర్మ సంస్థాపనం ఆయన విధులు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేయటం కోసం అప్పుడప్పుడు ఆయన భౌతికరూపం ధరించి భూలోకంలో సంచరిస్తాడు. ఆ రూపాన్ని 'అవతారం' అంటారు.

విష్ణువు ఐదు రూపాలలో అభివ్యక్తమౌతాడని, అవతారం వాటిలో ఒకటి అని వైష్ణవమతం బోధిస్తుంది. ఈ ఐదు రూపాలలో మొదటిది పరవాసుదేవరూపం అది మానవుల ఊహకు అతీతమైనది. సృష్టి స్థితి సంహార కార్యసాధనకు ఏర్పడినది వ్యూహరూపం ధరాధామంపై ప్రాకృత దేహంతో దిగివచ్చే రూపాన్ని 'విభవం' అంటారు. ఇక 'అంతర్యామి' రూపంలో ఆయన జీవుల హృదయాంతర్వర్తియై వారి భావాలను పరిభ్రమింపజేస్తూ ఉంటాడు. ఇంక చివరది అర్చారూపం. దేవాలయాలలోనూ, భక్తుల నివాసాలలోనూ విగ్రహరూపంలో ఉంటూ వారి పూజలను అందుకొంటూ ఉంటాడు.

శ్రీ మహావిష్ణువు అభివ్యక్తమయ్యే ఈ ఐదు రూపాలలో భక్తులకు అత్యధికంగా ఆహ్లాదం సంఘటించేది ఆలయాలలో వెలసిన అర్చారూపమే. ఎందుచేతనంటే, వారు ఆలయంలో ప్రతిమారూపంలో ఉన్న స్వామి సౌందర్యాతిశయాన్ని నేత్రపర్వంగా తిలకించటానికీ, ఆయన దివ్యసాన్నిధ్యాన్ని ఇప్పుడే, ఇక్కడే తనివితీర అనుభవించటానికీ అందువల్ల అవకాశం కలుగుతుంది గనుక. అందుచేతనే ఎందరో భక్తకవులు తమ ఇష్టదేవత దివ్యమంగళ విగ్రహాన్ని ప్రతిజన్మలోనూ సందర్శించే భాగ్యమే

తమకు నిశ్చయంగా లభ్యమయ్యే పక్షంలో, మానవ జన్మకు సహజమైన క్లేశాలను సునాయాసంగానే భరిస్తాము కాని, మరొక లోకంలో - స్వర్గంలోనైనా - శాశ్వతనివాసం తాము కాంక్షించబోమని తమ గీతా లలో అర్చామూర్తులపట్ల తమ గాఢానురక్తిని వ్యక్తం చేశారు.

శాస్త్ర విహితమైన అర్చనాదులకు భక్తులు దైవప్రతిమలను గాని, సంకేతరూపమైన వస్తువులనుగాని ఉపయోగిస్తారు. సాలగ్రామ శిలను విష్ణుమూర్తికి సంకేతంగా పరిగణిస్తారు. ఆగమ శాస్త్రానుసారం ప్రతిష్ఠిం చిన విగ్రహం స్వామిస్వరూపంగా నిలిచి ఏకాగ్రత సాధించటానికి కూడా తోడ్పడుతుంది [3] రూపరహిత దైవంపై మనస్సు నిలవటం కష్టం గనుక, ప్రతిమలు యధార్థ రూపాలు కాకపోయినా ధ్యానానికి తోడ్ప డతాయి గనుక, వివేకవంతులు తమ ఆధ్యాత్మిక సాధనలో వాటిని ఆలంబంగా చేసుకొంటారని **విష్ణు సంహిత** అనే గ్రంథంలో ఉన్నది. కాని శ్రీవైష్ణవం అనే పేరుతో వ్యవహారంలో ఉన్న విశిష్టాద్వైత మతాన్ని అనుసరించేవారు మాత్రం స్వామి ప్రతిమ కేవలం ఏకాగ్రతను సాధిం చటానికి నిలిపే ఉపకరణం కాదని, ఆ ప్రతిమా రూపంలోనే ఆయన తన దివ్యశక్తులతో విరాజిల్లుతూ ఉంటాడని, విగ్రహం సాక్షాత్తు దైవ స్వరూపమే అని విశ్వసిస్తారు ఆయన గుణాలలో 'సౌలభ్యం' ఒకటి భక్తులు సులభంగా ఆశ్రయించటానికి అనువుగా ఆయన అర్చారూపం ధరించి ఆలయాలలో ఉంటాడని వారు భావిస్తారు [4]

విష్ణుమూర్తిని, ఆయన అవతారాలలో అధికంగా జనులకు ప్రీతి పాత్రమైన రామ, కృష్ణాది మూర్తులను అర్చించటానికి నిర్మితమైన దేవాలయాలు భారతదేశంలో అన్ని ప్రాంతాలలోనూ ఉన్నవి వాటిలో 108 ఆలయాలు శ్రీవైష్ణవులకు ముఖ్యమైనవి. వాటిని వారు దివ్య దేశాలని అంటారు. వాటిలో మూడు క్షేత్రాలు — రంగనాథస్వామి ఆలయం ఉన్న శ్రీరంగం, వరదరాజస్వామి వెలసిన కాంచీపురం (కంచి), వేంకటేశ్వరస్వామి నివాసమైన తిరుపతి — అన్నిటిలో అతిముఖ్యమైనవని శ్రీవైష్ణవులు భావిస్తారు ఈ మూడూ దక్షిణ దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షే త్రాలు కావటమే కాదు, విశిష్టాద్వైత మత ప్రచారానికి ప్రధానకేంద్రాలుగా కూడా రూపొందినవి. ఈ ఆలయాలలోనూ, మరికొన్నిటిలోనూ వెలసిన

ప్రతిమలు మనుష్యులు ప్రతిష్ఠించినవి కావని, అవి స్వయంవ్యక్తమూర్తులని వైష్ణవులు విశ్వసిస్తారు ఈ మూడు మూర్తులు విష్ణుపరమైన మూడు భావనలను వ్యక్తీకరిస్తున్నవని వారంటారు. ఐదు పడగల ఆదిశేషునిపై యోగనిద్రాముద్రాభిరాముడైన రంగనాధుడు వైకుంఠంలోని విష్ణుమూర్తి; కంచి వరదరాజస్వామి అష్టాక్షరీమంత్రానికి లక్ష్యమైన నారాయణుడు, ఇక వేంకటేశ్వరస్వామి భగవద్గీతలోని చరమ శ్లోకం ద్వారా ప్రపత్తి మార్గాన్ని బోధించిన పరాత్పరుడు, అని వారు భావిస్తారు.[5]

ఆగమశాస్త్రానుసారం ఆలయంలో ప్రతిష్ఠించే విష్ణుప్రతిమను స్థానక భంగిమలో నిలబడి ఉన్నట్లు కాని, ఆసన భంగిమలో కూర్చొని ఉన్నట్లు కాని, శయన భంగిమలో పవళించి ఉన్నట్లు కాని మలచవలసి ఉంటుంది. వేంకటేశ్వరస్వామి స్థానక భంగిమలో కమనీయ పద్మ పీఠంపై కనుల పండుగ చేస్తూ నిలిచి ఉన్నాడు తలపై రత్నఖచితమైన స్వర్ణకిరీటం. ఆపాదమస్తకం అతి ప్రశస్తమైన ఆభరణాలు. కర్ణాలకు వలయాకృతిలో కనకభూషణాలు. కరచరణాలకు కంకణాలు భుజాలకు నాగాభరణాలు. లలాటఫలకంపై కర్పూరతిలకం ఆ తిలకం నడుమ సన్నటి కస్తూరి రేఖ విరిసిన పద్మ దళాల వంటి నయనాలు మీదికీ, క్రిందికీ కాక ఎదుట నిలబడి నమస్కరించే భక్తులపై నిలిచి, సమదృష్టిలో ఉన్నవి. ఆ కరుణార్ద్ర దృక్కులు, పెదవులపై విరిసిన దరహాసం ఆ జగన్మోహన మూర్తి అలౌకిక సౌందర్యాన్ని అతిశయింపజేస్తున్నవి.

ఆయన వక్షస్థలం శ్రీదేవికి నివాసం కనుక ఆయనను శ్రీనివాసు డంటారు. పై కెత్తిన రెండు హస్తాలలో ఆయన శంఖచక్రాలను ధరించి ఉన్నాడు క్రింది కుడిచేయి వరదముద్రతో తన పాదాలనే చూపుతూ ఉన్నది ఎడమ చేయి మోకాలిపైన కట్యవలంబితముద్రతో విరాజిల్లుతూ ఉన్నది. ఈ ముద్రల అంతరార్థం గ్రహించటం అవసరం

వేంకటేశ్వరస్వామి "జనతాభిమతాధికదానరతు" డని, అంటే, అడిగిన మేరకంటె అధికంగా వరాలు ప్రసాదించే దైవమని, భక్తులు విశ్వసిస్తారు. ఆయన కుడిచేయి వరదముద్రతో ఈ గుణాన్ని సూచిస్తు న్నది. అరచేయి పూర్తిగా తెరచి ఉన్నది. అంటే ఏ విధమైన అడ్డూ, అవధీ లేకుండా ఆ చేతినుంచి వరాలు ధారగా జారతాయని ఆ హస్తం

సూచిస్తున్నది. పైగా ఆ చేయి స్వామి శ్రీపాదాలను చూపుతున్నది **భగవద్గీత** చివర "మా మేకం శరణం వ్రజ" అని కృష్ణుడు చేసిన బోధను ఆ హస్తం సంకేతరూపంలో వ్యక్తం చేస్తున్నది ఆ బంగారు పాదాలను ఆశ్రయించిన వారికి సమస్తపాపాలు తొలగి, చివరకు మోక్షం కూడా లభిస్తుందని ఆ ముద్ర సూచిస్తున్నది ఇక ఎడమచేయి మోకాలికి కొంచెం పైన, కట్యవలంబితముద్రలో ఉండి, ఆ మహా ప్రభువును నమ్ముకొన్న వారికి ప్రాపంచిక సమస్యలు మోకాలిలోతు వరకే తటస్థించవచ్చును గాని అవి వారిని ముంచవని, ఏ సమస్య ఎదురైనా వెంటనే వారికి స్వామి రక్షణ లభించి తీరుతుందని సూచిస్తున్నది.

వేంకటాద్రి శిఖరంపై స్వామి ఆవిర్భావాన్ని గురించి **వరాహ పురాణం, బ్రహ్మాండపురాణం, భవిష్యోత్తరపురాణం** వంటి సంస్కృత గ్రంథాలలో అనేక గాథలు కనిపిస్తాయి ఐతే ఈ పురాణాల కర్తలను గురించి కాని, రచనాకాలాన్ని గురించి కాని మనకు నిశ్చయంగా ఏమీ తెలియదు. కాగా స్వామిని గురించి ఆ పురాణాలలో కానవచ్చే కథలలో కల్పన ఏదో, యథార్థం ఏదో నిర్ణయించటం అసాధ్యం. ఆ దేవాలయా నికి సంబంధించి, పరిశీలనకు నిలిచే గ్రంథస్థమైన ఆధారాలలో మొట్ట మొదటిది పరంపరనార్ వ్రాసిన **శిరప్పాయిరమ్** అనే తమిళపుస్తకంలో కనిపిస్తుంది. క్రీస్తు పూర్వం 5వ శతాబ్దానికి చెందినదని విమర్శకులు భావించే **తొల్కాప్పియమ్** అనే తమిళవ్యాకరణానికి ప్రశంసారూపకమైన ఆ పుస్తకంలో ప్రథమంగా 'వేంగడం' కొండను గురించి - అంటే, వేంకటాచలాన్ని గురించి — ప్రస్తావన కనిపిస్తుంది. ఐతే దానిలో ఆ కొండ పేరు ప్రసక్తమయింది కాని, స్వామిని గురించి ఏమీ ప్రస్తావన లేదు. క్రీస్తు శకం 2వ శతాబ్దానికి చెందిన సంగం కవి మామూలనార్ వ్రాసిన **అహనానూరు** అనే కావ్యంలో కూడా వేంగడం కొండ పేరు కనిపిస్తుంది కాని, వేంకటేశ్వరస్వామి ప్రసక్తి లేదు. ఆ కొండమీద వైభవంగా ఉత్సవాలు జరుగుతాయనీ, ఉత్సవాలు చేయించిన గృహస్థులకు పుష్కలంగా సిరిసంపదలు లభిస్తాయనీ మాత్రం ఉన్నది ఆ శతాబ్దా నికే చెందిన ఇలంగో అడిగళ్ రచించిన **శిలప్పదికారం** అనే ఇతిహాస కావ్యంలో మాత్రం వేంగడం కొండ పేరుతోపాటు ఆ కొండ మీద

వెలసిన దైవం శంఖచక్రాలను ధరించిన శ్యామవర్ణుడైన శ్రీ మహావిష్ణు వని కూడా స్పష్టంగా ప్రకటిత మయింది. ఐతే వేంకటాచలక్షేత్ర ప్రశస్తిని, ఆ పర్వతం పవిత్రతను, స్వామి వైభవాన్ని రమణీయగీతాలలో ధారాళంగా వర్ణించటం జరిగింది మాత్రం ప్రఖ్యాత భక్తకవులు ఆళ్వారులు రంగంమీదికి ప్రవేశించిన తరువాతనే అని నిశ్చయంగా చెప్పవచ్చును.

'ఆళ్వార్' శబ్దానికి స్థూలంగా 'మునిగినవాడు' అని అర్థం. ఇక్కడ 'అవధులు లేని గంభీరమూర్తి[6] అయిన దైవంలో సదా మగ్నుడైన మహాభక్తుడు' అని అన్వయం చేసుకోవాలి. క్రీస్తు శకం 6 - 9 శతాబ్దాల మధ్య తమిళదేశంలో వసించిన 12 మంది విష్ణుభక్తులకు 'ఆళ్వారులు' అనే పేరు రూఢమయింది. అందుకే తెలుగులో వారిని 'పన్నిద్దరాళ్వారు'లని వ్యవహరిస్తారు. వారందరూ భక్తకవులే. వారిలో అధిక సంఖ్యాకులు నిరంతరం ఒక విష్ణ్వాలయంనుంచి మరొక విష్ణ్వాలయానికి యాత్ర చేస్తూ, భక్తి పారవశ్యంలో 'పాశురములు' అనే కీర్తనలను అల్లి, శ్రావ్యంగా గానం చేస్తూ, అడుగు మోపిన నేలపై విష్ణుభక్తి వియద్గంగా స్రవంతిని ప్రవహింపజేస్తూ, హృదయాన్ని కదిలించే మధురగీతికా మాలికలతో సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూ కాలం గడిపారు. తన్మయతలో వారు సంచరిస్తున్నప్పుడు వారికి జగమంతటా విష్ణులీలావిలాసమే కనిపించటం వల్ల, అప్రయత్నంగా అమృత మధుర కవితలను ఆలపించారు ఆలయంలో స్వామి దివ్య మంగళ విగ్రహం కనిపించినా, ఆకాశవీధిలో నీలమేఘం కానవచ్చినా, సాగరతరంగాలలో నిబిడ నీలిమ గోచరించినా, వారి మనోవీధిలో ఆ నీలమేఘశ్యాముడే సాక్షాత్కరించేవాడు. అందుకే వారు ఆయన లీలామాధురిని వర్ణిస్తూ నాలుగువేల పాశురాలు రచించారంటే ఆశ్చర్యపడవలసినదేమీ లేదు. శ్రీవైష్ణవాచార్య పరంపరలో ఆద్యుడైన నాథముని 10వ శతాబ్దంలో ఆ కవితలన్నిటినీ నాలాయిరం ('నాలుగు వేలు'), దివ్యప్రబంధం అనే పేర గ్రంథరూపంలో సంకలనం కావించాడు. వేదాలలోని ఋక్కులతోపాటు ఆళ్వారుల పాశురాలను కూడా ఆనాటినుంచి నేటివరకు దక్షిణదేశంలోని ప్రముఖ విష్ణ్వాలయాలలో అవిచ్ఛిన్నంగా నిత్యం గానం చేయటం నియతంగా సాగుతూ ఉన్నది.

శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఆళ్వారుల స్థానం అత్యున్నతమైనది కావటం వల్ల తమ గీతాలలో వారు కీర్తించిన 108 క్షేత్రాలను వైష్ణవులు దివ్యదేశాలుగా పరిగణిస్తారు. తమిళంలో వాటిని పాడల్ పెట్ర పడి-గళ్ ('పాటలు అందుకొన్న ప్రదేశాలు') అని వ్యవహరిస్తారు. వాటిలో రెండు — వైకుంఠం, క్షీరసాగరం — దివ్యసీమలకు చెందినవి మిగిలిన క్షేత్రాలన్నీ భూలోకంలో ఉన్నవే. వీటిలో తిరుపతి ప్రస్తావన తరచుగా వస్తుంది. ఆళ్వారులలో అధిక సంఖ్యాకులు స్వయంగా ఆ క్షేత్రాన్ని సందర్శించటం, వారిలో పదిమంది శ్రీ వేంకటేశ్వరుని వైభవాన్ని తమ పాశురాలలో కీర్తించటం అందుకు కారణాలు.

అన్నమాచార్యులకు ఆళ్వారుల భక్తిగీతాలతో సన్నిహిత పరిచయం ఉన్నదని భావించటానికి మనకు రెండు కారణాలు కనిపిస్తున్నవి. మొద టిది, ఆయన కూడా ఆళ్వారుల కోవకే చెందిన వైష్ణవభక్తకవి కావటం ఆయన కూడా నిరంతర విష్ణుచింతా మహాసాగర మగ్నుడైన 'ఆళ్వారు'. తాత్త్వికచింతనతో చేరిన భక్తి పారవశ్యాన్ని వారివలెనే అనుభవించిన పరమ భాగవతుడు. తానుకూడా వేలకొలది భక్తిగీతాలు వ్రాసినవాడు కనుక ఆ బాటలో అప్పటికే పయనించిన పూర్వకవుల రచనలతో ఆయనకు పరి చయం ఉండటం సహజం రెండవది, విశిష్టాద్వైతమతాన్ని ప్రబోధించిన ఆచార్యులలో ప్రథమగణ్యుడైన రామానుజాచార్యులు "దైవం ఉన్నాడని నిరూపించటానికి ముఖ్యాధారం దైవంలో మగ్నమై ఉండటమే"[7] అని భావించి, ఆళ్వారుల ఆలాపాలకు వేదవాక్కులతో సమాన ప్రాధాన్యం ఇచ్చాడు. చిన్ననాటనే శ్రీవైష్ణవమతాన్ని అవలంబించిన అన్నమాచా ర్యులు కొన్ని ఏండ్ల పాటు విశిష్టాద్వైతతత్త్వాన్ని అధ్యయనం చేశాడు ఆ తత్త్వానికి ఆళ్వారులు దివ్యప్రబంధంలో వ్యక్తం చేసిన భావాలుకూడా ఒక ఆధారమే. ఆ గ్రంథం నాలుగు వేదాల సారమని శ్రీవైష్ణవుల విశ్వాసం. అందుకే దానిని వారు 'ద్రావిడ వేదం' అనీ, 'పంచమా గమం' అనీ అంటారు. అన్నమాచార్యుల మనుమడు ఆయనను "పంచ మాగమ సార్వభౌముడు" అని పేర్కొనటం ఈ సందర్భంలో మనం గమనించవలసి ఉంటుంది.

కనుక చిరకాలంగా వస్తున్న ఈ వైష్ణవభక్తిగీత సంప్రదాయాన్ని

మనం గ్రహించటానికీ, ఆ భక్తకవుల ఊహలను, భావనను అర్థం చేసు కోవటానికీ ఆళ్వారులు తిరుపతి కొండను గురించి, వేంకటేశ్వరస్వామి మహిమను గురించి వ్రాసిన పాశురాలను కొన్నిటినైనా పరిశీలించటం అవసరం

దేవుని కొలది భక్తులు. ఆయన లక్షణాలే వారికి కూడా అలవడటం సహజం. ఉదారత, సమృద్ధి విష్ణుభక్తులకు సహజంగానే సంప్రాప్తిస్తాయి. అందువల్ల దివ్యప్రబంధంలో తిరుపతి క్షేత్రాన్ని, వేంకటేశ్వరస్వామి వైభవాన్ని వర్ణించే పాశురాలు 197 ఉన్నట్లు విద్వాంసులు గుర్తిం చారు ఆ కొండ మహత్వాన్ని చాటుతూ, కొన్ని పాశురాలు కొండమీది మనోహర ప్రకృతి దృశ్యాలను వర్ణిస్తాయి

శ్రీ వేంకటేశ్వరస్వామి పాలకడలిలో పాముపాన్పుపై పవళించిన శ్రీ మహావిష్ణువని చాటిచెప్పి, పాపులకు, పరమయోగులకు సమంగా అందుబాటులో ఉండటం కోసం ఆయన అర్చామూర్తియై భువిమీద తన ఆవాసం ఏర్పరచుకోవటంలో వ్యక్తమయ్యే సౌలభ్యగుణాన్ని కీర్తిస్తాయి ఈ కీర్తనలలో పునరావృతమయ్యే మరొక ఇతివృత్తం మధురభక్తి స్వామిని నాయకునిగా భావించి, ఆయనతో శృంగారం నెరపుతున్నట్లు కొన్ని కీర్తనలు వర్ణిస్తాయి ఆళ్వారులలో ఏకైకమహిళ అయిన ఆండాళ్ పాశురాలలోనేగాక నమ్మాళ్వార్ వంటి ఇతరుల రచనలలో కూడా ఈ మధురభక్తి అక్కడక్కడ కనిపిస్తుంది

చెఱకుపాలు గడ్డకట్టి చక్కెర అయినట్లే, అవధులు లేని శ్రీనివా సుని కారుణ్యం ఘనీభవించి వేంకటాద్రిగా రూపొందినదని ఒక సొగసైన భావన ఉన్నది [8] యాత్రికుల పాపాలను భస్మం చేయగల శక్తి ఆ పర్వతానికి ఉన్నదని చిరకాలంగా భక్తులు విశ్వసిస్తున్నారు ఆళ్వారుల రచనలలో వేంకటాచలానికి ఉన్న ఈ పాపనిర్మూలనపటిమను ప్రస్తుతించే కీర్తనలు కొన్ని కనిపిస్తాయి.

ఉదాహరణానికి ఆళ్వారులలో ఆద్యుడైన పొయిగై ఆళ్వారు రచిం చిన ఒక పాశురాన్ని గమనించవచ్చును.

సిరిసంపదలు కాంక్షించేవారు,
ఆత్మానుభూతిని అపేక్షించేవారు,
సుందరతులసీదామాలతో
శోభించే దేవుడే శరణ్యుడని
ఆ మహాప్రభువునే ఆశ్రయించేవారు,
ఈ ముప్పూరి పాప జ్వాలలను
శమింపజేసే వేంగడమే
కోరి నిత్యసూరులు
దివినుంచి దిగి ఆశ్రయించే ధామం

ఈ పాశురంలో మూడు విభిన్న ఫలాలను అర్థించే వ్యక్తులను గురించి ప్రస్తావన ఉన్నది. మొదటి వ్యక్తి బద్ధజీవి అతనికి ఈ లోకమే సమస్తం. అతడు అపేక్షించేది ప్రాపంచికమైన ఐశ్వర్యం రెండవ వ్యక్తికి ఇహాన్ని మించినది మరేదో ఉన్నదని, దానిని పొందాలని, ఆకాంక్ష ఉన్నది గాని, అది కేవలం బుద్ధికి మాత్రమే పరిమితమైనది. ఆత్మానుభూతి పొందాలనే సంకల్పమే గాని, దైవాన్ని అనుభవించి ఆనందించాలనే అభిలాష అతనిలో కనిపించదు ఇక మూడవ వ్యక్తి భక్తుడు అర్చన వేళ తులసీహారాలతో నేత్రపర్వంగా దర్శనమిచ్చే శ్రీమహావిష్ణువే ఏకైక శరణ్యుడని గ్రహించిన విజ్ఞుడు. అర్థిజనుల అభీష్టాలను ప్రసాదించటానికి కొండమీద కల్పవృక్షంవలె ఆ దేవదేవుడు నిలిచి ఉన్నాడు. వారు ఆయనను చేరటానికి వీలుగా ముందు వారి పాపాలను భస్మీపటలం చేయటానికి సిద్ధంగా ఉన్నది వేంకటాచలం

ఆ పవిత్ర పర్వతాన్ని మనసార స్మరిస్తేనే చాలు, పరమపదంలో నిత్యనివాసభాగ్యం ప్రాప్తిస్తుందని ఉద్ఘాటించాడు తిరుమళిశై ఆళ్వారు

'కొండ' ప్రసక్తి ఎన్నడు వచ్చినా,
వేంకటాద్రినే నేను కీర్తించాను
పరమపదంలో నాకు
నివాసస్థానం నిశ్చిత మయింది
నా భక్తి వలలో శ్రీకాంతుడు

చిక్కుకొన్నాడు
ఆయన పాదాల నడుమ
నేను పట్టుబడ్డాను.

హృదయాన్ని కదిలించే మరొక మధురగీతంలో చిరకాలంగా తనకు తిరుపతిక్షేత్రం దర్శించవలెనని గాఢాభిలాష ఉన్నదని, ఆ శుభదినం సంప్రాప్తించేవరకు ఇసుకలో ఆ కొండ ఆకృతిని గీచి, దానిని చూస్తూ సంతృప్తి పడుతున్నానని తిరుమళిశై ఆళ్వారు తన ఆర్తిని వ్యక్తం చేశాడు

పదకమల సేవాభాగ్యం ప్రసాదించుమని
వేంకటపతిని వేడుకొంటున్నాను
వర్ష పాతంతో పొంగి
మణి మాణిక్యాలతో
జారి పడే జలపాతాలతోనూ,
ఆ జలధారలకు వెరచి
పరుగెత్తుతూ కొండచిలువకు
పట్టుబడే మత్తగజంతోనూ,
మనోహరంగా గోచరించే
గిరిని చేరవలెనని
ఆరటేస్తున్నాను.
ఇసుకలో ఆ కొండ
ఆకారం గీచి,
దాని వంక
చూస్తూ ఉన్నాను

కులశేఖరాళ్వారు కూడా వేంకటాచల ప్రశస్తిని కీర్తిస్తూ కొన్ని గీతాలు వ్రాశాడు చేత పాంచజన్యం ధరించిన పరమపురుషుని ఉనికి వల్ల పునీతమైన ఆ పర్వతాగ్రంపై పక్షిగానో, జలచరంగానో, పాదగానో, చెట్టుగానో, మెట్టుగానో ఉండగలిగితే తన జన్మ ధన్య మవుతుందనే భావం ఆయన ఆ పాశురాలలో వ్యక్తం చేశాడు

త్రైలోక్య వాల్లభ్యం
వాంఛించను నేను
స్వర్గ లోకంలో ఊర్వశి
పరిష్వంగ సుఖం కూడా
కాంక్షించను [9]
ప్రవాళాధరంతో
స్వామి నిలిచిన
వేంకటగిరి శిఖరంపై
ఏదో ఒక పదార్థంగా
ఉండవలెనని మాత్రమే
అభిలషిస్తాను

అన్యత్ర దుర్లభుడైన ఆదిదేవుడు వేంకటాద్రి శిఖరంపై అర్చా మూర్తిగా జగన్మోహనాకారంతో వేంకటేశ్వరస్వామియై వెలసి, సమస్త జనులు సేవించటానికి వీలిచ్చే ఈ సౌలభ్యమే ఆ కొండ ప్రసక్తి రాగానే ఆళ్వారులు అంత తన్మయత చెందటానికి కారణం విశిష్టాద్వైత మతానుసారం భగవంతునికి 'పరత్వం' (సర్వంసహాధికారం), 'సౌలభ్యం' (సులభంగా అందరికీ లభించే వీలు) అని రెండు ప్రత్యేకలక్షణా లున్నవి[10] ఈ లక్షణాలను వివరించటానికి చక్కని ఉదాహరణం ఒకటి ఉన్నది అది రామానుజాచార్యులు చూపిన పోలిక అని అంటారు ఒక ఏనుగు ఉన్నది కుంటివా డున్నాడు ఏనుగును ఎక్కటానికి కుంటివానికి అనుమతి లభించినా, అతడు దానిని అధిరోహించలేడు ఆ విధంగానే భవబంధంలో చిక్కుకొన్న నికృష్ట జీవి కూడా ఆ పరాత్పరుని సమీపించలేడు. ఐతే ఏనుగు తన కాళ్ళను వంచి నేలమీద కూర్చుంటే, కుంటివాడు దానిని ఎక్కగలడు ఆ విధంగానే ఆ దేవదేవుడు కూడా అవతారరూపంలోనో, అర్చామూర్తిగానో ఈ ధరాధామం మీదికి దిగివస్తే, ఆర్తితో చేర వచ్చే అతిసామాన్య జీవులకు కూడా ఆయన సులభంగా లభిస్తాడు. ఈ రెండు రూపాలలోనూ అవతారం కంటె అర్చామూర్తినే భక్తులు విశేషంగా అపేక్షిస్తారు ఎందుకంటే, అవతారం కేవలం పరిమితకాలంలో ఏదో ప్రత్యేక ప్రయోజనాన్ని సాధించటానికి దివినుంచి భూమికి దిగి

రావటం జరుగుతుంది. వచ్చిన పని పూర్తికాగానే అవతార పరిసమాప్తి అవుతుంది. అర్చావిగ్రహం విషయంలో ఆ విధంగా కాదు కలకాలం భక్తజనుల కనుల యెదుట కనిపిస్తూ ఉండటం వల్ల ఆ రూపం వారికి అత్యంతం ఆదరణీయ మవుతుంది. ఈ భావాన్ని పొయిగై ఆళ్వారు ఒక పాశురంలో వ్యక్తం చేశాడు.

*సాగరతరంగ సదృశ*
*శ్యామవర్ణుడైన ప్రభువు*
*పరిరక్షించినది భూమిని;*
*లేవనెత్తినది కొండను;*
*సంహరించినది భయ*
*కంపితుడైన కంసుని;*
*పవళించినది పాలకడలిపై,*
*నిలకడగా నిలిచినది*
*వేంకటగిరి మీదనే*

నీట మునిగిన భూమిని రక్షించటానికి ఆయన వరాహమూర్తియై వచ్చాడు కృష్ణుడై గోవర్ధనగిరిని కేల నెత్తాడు. కంసుని సంహరించాడు. కాని ఆ అద్భుత కార్యాలను ఆయన ఆ అవతారాలు ధరించి వచ్చిన ప్పుడు జీవించి ఉన్న జనులు మాత్రమే చూడగలిగారు.

నమ్మాళ్వారు కూడా వేంకటేశ్వరస్వామిని కృష్ణ, వామనరూపాలు ధరించి వచ్చిన విష్ణువుగా స్తుతించాడు. ఆయన వెలసిన వేంకటాద్రి యాత్రికుల క్లేశాలను హరించగలదని ఉద్ఘాటించాడు.

వేంకటాద్రిని చేరగానే
క్లేశాలన్నీ తొలగిపోతాయి.
దివినుంచి దిగి వచ్చి
దేవాధిదేవుడు
ఆ కొండమీద నిలిచి ఉన్నాడు.
ఒకనాడు కొండను కేల నెత్తి
కుంభవృష్టి నుంచి గోవులను,

గోపకులను రక్షించినవాడు
తన అడుగులతో
మూడు లోకాలను కొలిచిన ప్రభువు

ఒక సందర్భంలో లక్ష్మీదేవి ఆగ్రహంతో తన నాథుని విడనాడి భూలోకానికి వచ్చినదనీ, ప్రియావియోగం సహించలేక విష్ణువు కూడా వైకుంఠం వదలి భూమిమీదికి దిగివచ్చి, వేంకటాద్రిపై వసిస్తున్నాడనీ ఒక గాధ పురాణాలలో ఉన్నది. ఆ ప్రభువు వైకుంఠంలో కంటె వేంకటాద్రి మీదనే సులభంగా లభ్యుడవుతాడు గనుక నిరంతరం వైకుంఠంలో స్వామి సాన్నిధ్య భాగ్యం అనుభవించే నిత్యసూరులు కూడా అక్కడినుంచి వచ్చి వేంకటాద్రి మీదనే ఆయనను అర్చిస్తూ ఉంటారని ఆళ్వారులు పదేపదే వర్ణిస్తారు

నమ్మాళ్వారు తన పాశురంలో వేంకటేశ్వరస్వామిని దివ్యకళలతో శోభిల్లుతూ గోవర్ధనగిరిని తన చిటికెనవ్రేలిపై నిలబెట్టి, గోకులంలోని గోగోపకులను పరిరక్షించి, అబోధోపహతుడైన ఇంద్రునికి జ్ఞానోదయం కావించిన కృష్ణునిగా భావించాడు. ఐతే కృష్ణుడు కేవలం అనితర సాధ్యమైన దివ్యలీలలను ప్రదర్శించిన తేజోమయమూర్తి మాత్రమే కాదు, ఆడుకోవటానికి తనకు ఆకాశంలో ప్రకాశించే చందమామ కావాలని ముద్దుగా కోరే చిన్ని శిశువు కూడా అమాయకురాలైన కృష్ణుని పెంపుడు తల్లి యశోదతో తాదాత్మ్యం చెంది, వాత్సల్యం ఒలికిస్తూ ఆ మనోహరదృశ్యాన్ని వర్ణిస్తాడు పెరియాళ్వారు.

నలుదెసల చల్లని కాంతిని
వెదజల్లుతూ,
వలయాకృతితో వెలిగే
జాబిల్లీ!
నా ముద్దు బాలుని ముఖానికి
నీ బింబం సాటి రాదు
వేంకటగిరిపై వసించే
ఆ ముద్దు బిడ్డడు

*చేర రమ్మని నిన్ను*
*చేతితో సైగ చేస్తున్నాడు*
*చేయి నొప్పి పెట్ట నీయక*
*శీఘ్రంగా చేరువకు రా!*

జడలో మల్లెమొగ్గల దండ అలంకరించాలని ఆరటించే తల్లి యశోదకు అందక పరుగులు వేసే కొంటె బాలుడైన కృష్ణునిగా వేంకటేశ్వర స్వామిని పెరియాళ్వారు ఊహించాడు. ఆ పరమభక్తుని పెంపుడుకూతురు ఆండాళ్ మాత్రం స్వామిని తన దివ్యప్రేమికునిగా భావించి రససమంచితమైన మధుర గీతాలలో తన ప్రణయాన్ని, విరహాన్ని వ్యక్తం చేసింది. చిర ప్రసిద్ధ సంప్రదాయాన్ని అనుసరిస్తూ, కృష్ణుని దేహకాంతిని తలపింప జేసే నీలమేఘాన్ని తన ప్రణయసందేశం పంపటానికి దూతగా ఎంచుకొంటుంది.

*నీలాకాశంలో చాందినీ వలె*
*నిలిచిన మేఘమా!*
*నిన్ను పోలిన నా ప్రాణవిభుడు*
*నీవెంట ఇచ్చటికి వచ్చాడా?*
*నిర్మ లాంబు పూర్ణ*
*నిర్ఝరులు ప్రవహించే*
*వేంకటాద్రిపై నెలకొన్న*
*ఆ ప్రభువు వచ్చాడా?*
*నా స్తనాంశుకం తడియునట్లు*
*కన్నీరు కార్పించటం*
*ప్రతాప లక్షణమని*
*భావిస్తున్నాడా?*

జీవబ్రహ్మైక్య సంధానాన్ని వధూవరుల కలయికగా చిత్రిస్తూ, జీవాత్మను వధువుగా, పరమాత్మని వరునిగా సాంకేతికంగా వర్ణించే నిగూఢ తాత్త్విక సంప్రదాయం ప్రపంచంలో పలు మతాలలో కానవస్తుంది. ఆళ్వారులు కూడా ప్రభువుపై తమ గాఢానురక్తిని వ్యక్తం చెయ్యటానికి కొన్ని

గీతాలలో ఈ సంకేతాన్ని ప్రయోగించారు. ఇట్టి తాత్త్విక కవితలో వధూవరుల సంయోగం ఒక సంకేతంగా ప్రయుక్తమైనా, ఆ అనుబంధం భౌతికమైన కామగంధం లేని అలౌకిక శృంగారం ఈ సంబంధంలో మొదట సంశ్లేషంవల్ల కలిగే ఆనందం, తరువాత విశ్లేషంవల్ల కలిగే వేదన వ్యక్తమవుతాయి సంశ్లేష విశ్లేషాలను పర్యాయక్రమంలో అను భవించిన మీదటనే యోగానుభూతి సిద్ధిస్తుంది పరమాత్ముని స్పర్శతో కూడిన సంశ్లేషంలో ఆత్మ క్షణంపాటు యోగానందాన్ని చవిచూస్తుంది. విశ్లేషంలో ప్రణయ వైఫల్యభావంతో యాతన అనుభవిస్తుంది. సంశ్లే షంలో యుగం క్షణంగా కుదించుకొంటుంది విశ్లేషంలో క్షణం యుగంగా సాగుతుంది. యోగులు ఎక్కువగా విశ్లేషదశనే వర్ణిస్తూ ఉంటారు. ఎందుకంటే, ఆ దశలో వారికి నిరంతర దివ్యప్రియ స్మరణా వకాశం లభిస్తుంది. ఈ లక్షణం ఆండాళ్ ప్రణయగీతాలలో విస్తరించి కనిపిస్తుంది

ఐతే, ఆళ్వారుల పాశురాలలో ప్రధానంగా ప్రస్తావితమైనది మాత్రం సకల జీవులను సులభంగా తరింపజేసే శరణాగతి మార్గ వైశిష్ట్యమే. ఈ భావం నమ్మాళ్వారు వ్రాసిన ఒక గీతంలో రమణీయంగా వ్యక్తమయింది.

క్షణవియోగమైన సైపలేక
కమలాలయ శ్రీలక్ష్మి
నిత్యం నీ వక్షంపై
నివసిస్తుంది.
ప్రభూ!
అనదృశవైభవోపేతుడవై
త్రిలోకాలను పాలించే
భువనైక నాథా!
నా స్వామీ!
వేల్పులు, మునులు
వేంకటగిరి శిఖరంపై
నిన్ను దర్శించవలెనని
అభిలషిస్తారు.

వేరు దిక్కు లేని నేను
నీచరణాలను ఆశ్రయించాను

తన్మయస్థితిలో ఆళ్వారులు ఆలపించిన మధురగీతాలలోని మహోజ్జ్వల భావనతోనూ, ఆ పాశురాలలో అభివ్యక్తమైన తాత్త్విక చింతనకు వైష్ణవ విద్వాంసులు చేసిన సువిస్తృత వ్యాఖ్యానాలతోనూ అన్నమయ్యకు పరిచయం ఉన్నది. ఎందుచేతనంటే, ఆయన దివ్యప్రబంధం శ్రద్ధగా అధ్యయనం చేశాడు. జీవితంలో అధికభాగం గడిపిన తిరుపతిలో స్వామి ఆలయంలో నిత్యం జరిగే పాశురాల గానాన్ని ఆనందంతో ఆలకించాడు

నిజానికి అన్నమాచార్యులు వేంకటేశ్వరస్వామికి ఆస్థానకవీంద్రుడు నిత్యం ప్రభువును ఒక నూతనగీతంతో కీర్తించటం తనకు దైవదత్తమైన కర్తవ్యంగా, మహాభాగ్యంగా భావించినవాడు నిత్యం నూతనపదాలు వినిపించే సమయం కోసం కవితోపాటు స్వామి కూడా ఔత్సుక్యంతో ఎదురుచూసే వాడట అన్నమయ్య అనన్యాశ్రయం లేని ప్రపన్నుడు. ప్రభువు ప్రపన్నపారిజాతం. ఇద్దరి నడుమ నెలకొన్న గాఢానుబంధాన్ని అన్నమాచార్యులు ఒక కీర్తనలో సొగసుగా వ్యక్తం చేశాడు

నే నొక్కడ లేకుండితే నీ కృపకు పాత్ర మేది?
పూని నావల్లనే కీర్తి పొందేవు నీవు!

అతిమూఢులలోన నగ్రేసరుడ నేను;
ప్రతి లేని ఘనగర్వ పర్వతమను;
తతి పంచేంద్రియముల ధనవంతుడను నేను;
వెతకి నావంటివాని విడువగ జెల్లునా?

మహిలో సంసారపు సామ్రాజ్య మేలేవాడ నేను;
ఇహమున కర్మపహి కెక్కితి నేను,
బహు యోనికూపసంపద దేలేవాడ నేను;
వహించుక నావంటి వాని దే నోపేనా?

భావించి నావంటి నీచు బట్టి కాచినప్పుడుగా
ఏవంక నీకీర్తి కడు నెంతురు భువి;
నావల్ల నీకు పుణ్యము, నీవల్ల నే బ్రదుకుదు,
శ్రీ వేంకటేశుడ! ఇంత చేరె సుమ్మీ మేలు.

భాగవతపురాణంలో ప్రస్తావితమైన నవవిధభక్తులలో సఖ్యం ఒకటి. ఈ కీర్తన నడచిన తీరును, దీనిలో వ్యక్తమైన భావాలను పరిశీలిస్తే, అన్నమాచార్యులు స్వామిని తమ స్నేహితునిగా భావించి, ఆయనతో చనువుగా వ్యవహరించే భక్తకోటికి చెందినవాడని స్పష్ట మవుతుంది.

# 2

# సార్థక జీవితం

సాధారణంగా సామాన్యజనులు మహాభక్తుల జీవితాలను గురించి ప్రస్తావించటం తటస్థించినప్పుడు వారు వాస్తవికాంశాలకు కొన్ని కల్పనా కథలను జోడించి, సహజ సన్నివేశాలను కూడా అలౌకికాద్భుత ఘటన లుగా చిత్రించటం జరుగుతుంది అందుకే వారు ప్రచారం చేసే కథలు కొన్ని సందర్భాలలో హేతుబద్ధంగా ఉండవు ఐతే సత్యాన్ని మేధతోనే కాదు, హృదయంతో కూడా గ్రహించటం సాధ్యమే హృదయానికి స్ఫురించే హేతువులు హేతువాదులకు రుచించకపోవచ్చును అభిమానులు ప్రదర్శించే అపరీక్షితమైన ప్రగాఢ భక్తివల్లనే మహాత్ములలో మాహాత్మ్యం ఉన్నట్లు కనిపిస్తుందనే వాదం సరియైనది కాదు నిరంతర యోగనిష్ఠ లైన భాగవతుల ప్రకృతియే అటువంటి అలౌకిక ఘటనలు సంభవించటా నికి కారణం ఎందుకంటే, మహాభక్తుడు సామాన్య మానవుడు కాడు. ఆయనలో నిలువున దైవశక్తి నిండి ఉంటుంది అందువల్లనే ఆయన ఆపన్నులను దయాదృష్టితో చూస్తే, వెంటనే వారి క్లేశాలు తొలగిపో వచ్చును ఆర్తితో ఆక్రందనం చేస్తే, 'వెంజీకటి కావల' ఏకాకృతితో వెలిగే పరాత్పరుడు వెంటనే మారుపలుకవచ్చును కనుక పరమభక్తుల జీవితాలను గురించి ప్రస్తావించేటప్పుడు, మనం సాధారణంగా అసంభవ మని భావించే ఘటనలు కూడా సంభవం కావచ్చునని అంగీకరించటానికి కొంతమేరకు సంసిద్ధం కావలసి ఉంటుంది.

అందుచేతనే అన్నమాచార్యుల జీవితవిశేషాలను తెలిపే మొదటి

గ్రంథం అన్నమాచార్య చరిత్రములో అద్భుతసంఘటనల ప్రసక్తి ఉన్నందుకు మనం ఆశ్చర్యపడ నక్కరలేదు. అది ద్విపద కావ్యం దానిని ఆయన మనుమడు, 'చిన్నన్న' అనే వ్యవహారనామంతో ప్రసిద్ధుడైన చిన తిరువేంగళనాథుడు, రచించాడు. చారిత్రకగ్రంథంగా దానికి చాలా ప్రాముఖ్య మున్నది ఎందుచేతనంటే, తన తాతగారి జీవితవృత్తాంతాన్ని గూర్చిన వివరాలను చిన్నన్న తన కుటుంబంలోని పెద్దలవల్ల విని వ్రాశాడు. ఆ భాగవతశిఖామణిని స్వయంగా చూసిన వారు ఇంకా జీవించి ఉండగానే ఆ కావ్యం వెలువడింది. దానిలో వర్ణితమైన అంశాల ప్రామాణ్యాన్ని వారెవ్వరూ శంకించలేదు

తిరుపతికి సమీపంలోనే ఉన్న తాళ్ళపాక గ్రామంలో అన్నమయ్య 15వ శతాబ్దపు మొదటి పాదంలో — 1408 మే 22 నాడు కావచ్చును — నందవరీక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు ఆ వంశస్థులకు తాళ్ళపాక గ్రామంతో చాలాకాలంగా ఉన్న సంబంధంవల్లనే వారికి ఆ ఇంటిపేరు వచ్చి ఉంటుంది ఆ గ్రామంలో శైవసంప్రదాయానికి చెందిన నవనాథసిద్ధులు పరుసవేది విద్యను సాధించినట్లు జనులలో ఒక కథ వ్యాప్తిలో ఉన్నది

అన్నమాచార్యుల తల్లిదండ్రులు లక్కమాంబ, నారాయణసూరి శివకేశవుల మధ్య అభేదం పాటించే స్మార్త సంప్రదాయానికి చెందిన వారు. ఐనా వారు విశేషించి విష్ణుభక్తులైనట్లు తోస్తుంది. 'లక్ష్మి', 'నారాయణ' అనే వారి పేరులే వారి పెద్దలు కూడా విష్ణుభక్తిపరులని భావించటానికి అవకాశం ఇస్తున్నవి తాళ్ళపాక గ్రామంలో చెన్నకేశవ స్వామి పేర స్థానికంగా ప్రసిద్ధుడైన కృష్ణుని ఆలయం ప్రాచీనమైనది ఉన్నది. కొన్ని తరాలుగా ఆ కుటుంబానికి ఆ ఆలయంతో సన్నిహిత సంబంధం ఉండటం అందుకు కారణం కావచ్చును

పుత్రసంతానం కోరి ఆ పుణ్యదంపతులు వేంకటాచలయాత్ర చేయగా, వారికి కొండమీద ఒక విచిత్రమైన అనుభవం కలిగినదట ఆలయం ఆవరణలో వారికి స్వామి తన పంచాయుధాలలో ఒకటైన నందక ఖడ్గాన్ని[11] ప్రసాదించినట్లు వారు కలగన్నారట. తరువాత వారికి పుత్రుడు జన్మించి వాంఛాఫలసిద్ధి కలిగింది.

స్వప్నంలో ఆ దంపతులకు నందకం కనిపించినట్లు చెప్పే కథ వైష్ణవుల సాంప్రదాయిక విశ్వాసానికి అనుగుణంగానే ఉన్నది భాగవతులు విష్ణుమూర్తి పరివారం, లేదా ఆయన ఆభరణాలు, ఆయుధాలవంటి వస్తువుల అంశంతో జన్మిస్తారని వారి విశ్వాసం. పెరియాళ్వారు — విష్ణుచిత్తుడు — గరుడుని అంశంతో జన్మించాడని వారు భావిస్తారు పాంచజన్యాంశంతో పొయిగై ఆళ్వారు, నందకాంశంతోనే పేయ్ ఆళ్వారు జన్మించారు. మరొక విశేష మేమంటే, అన్నమాచార్యులుకూడా నమ్మాళ్వారువలెనే వైశాఖమాసంలో విశాఖానక్షత్రంలో జన్మించాడు. ఇద్దరికీ 16 ఏండ్ల ప్రాయంలోనే స్వామి అనుగ్రహం వల్ల దివ్యజ్ఞానం లభించింది.

తల్లిదండ్రులు తమ కుమారునికి "అన్నమయ్య" అని పేరు పెట్టారు అది విష్ణునామ మని ("జలజోదరునకు నామమై"), ఆయనకు ఆ పేరు పెట్టారని, చిన్నన్న తన కావ్యంలో స్పష్టంగా తెలిపాడు. "అన్నం బ్రహ్మేతి వ్యజానాత్" అనే వేదవాక్యాన్ని అనుసరించి అన్నం బ్రహ్మానికి పేరు గనుక బాలునికి ఆ పేరు పెట్టారని కొందరు పండితులు భావించారు కాని అంతకంటె సరళమైన వివరణం ఇవ్వటానికి వీలున్నది. మహాభారతంలో అనుశాసనపర్వంలో ఉన్న శ్రీవిష్ణు సహస్రనామస్తోత్రంలో విష్ణునామాలలో 'అన్నం' అనే నామం కూడా ఉన్నది ఆ స్తోత్రాన్ని విష్ణ్వాలయాలలో అర్చనకాలంలో అనుదినం పఠిస్తూ ఉంటారు. అంతేకాదు, దేశమంతటా భక్తిపరులు ఐహిక, పారమార్థిక శుభాలను ప్రసాదించే శక్తిమంతమైన మహామంత్రమనే దృఢ విశ్వాసంతో దానిని ప్రతిదినం శ్రద్ధాభక్తులతో అనుసంధిస్తూ ఉంటారు. 'అన్నం' విష్ణునామం కనుక కుమారునికి తల్లిదండ్రులు ఆ పేరు పెట్టి ఉండవచ్చును.

ఆ స్తోత్రానికి శంకరాచార్యులు వ్రాసిన భాష్యంలో ఆయన విష్ణువు భోజనమూ, భోక్తా కూడా కావటం వల్ల ఆయనకు 'అన్నం' అని పేరు ఏర్పడినదని, జ్ఞానులకు ఆయన జ్ఞానరూపమైన ఆహారం అవుతాడని, ప్రళయకాలంలో సమస్త లోకాలను భక్షిస్తాడని వ్యాఖ్యానించాడు. ఈ స్తోత్రానికే విశిష్టాద్వైత మతానుసారం భగవద్గుణ దర్పణమ్ అనే పేర

పరాశరభట్టరు రచించిన భాష్యంలో ఆయన విష్ణుదేవుని గుణాలలో ఒకటి 'మాధుర్య' మని, స్వామి తన భక్తులు ఆస్వాదించే మాధుర్య గుణసంపన్నుడని, కనుక ఆయనకు 'అన్నం' అనే పేరు వచ్చిందని వివరించాడు. ఇక మాధ్వ సంప్రదాయానికి చెందిన సత్యసంధతీర్థయతి కూడా శంకరులు ప్రస్తావించిన "అద్యతేఽత్తిచ" అనే శ్రుతివాక్యాన్నే ప్రమాణంగా చూపుతూ, ఆయనయే భోజనం, భోక్త కనుక 'అన్నం' అనే నామం ఆయనకు వర్తిస్తుందని అన్నాడు ఈ వ్యాఖ్యానాల వల్ల విష్ణువు అటు జ్ఞానులకూ, ఇటు భక్తులకూ ఆహార రూపంలో ఉండి పోషణ చేస్తున్నాడు గనుక ఆయనకు 'అన్నం' అనే అన్వర్థనామం ఏర్పడినదని గ్రహించవలసి ఉంటుంది

బాల్యంలో అన్నమయ్య కుశాగ్రబుద్ధియై సంస్కృతాంధ్రాలను శ్రద్ధగా అధ్యయనం చేసినట్లు ఆయన కీర్తనలలోని సాహిత్యం సాక్ష్య మిస్తున్నది. ఆయన చిన్ననాట తరచుగా చెన్నకేశవస్వామి ఆలయానికి వెళ్ళి స్వామి సాన్నిధ్యంలో పాటలు పాడుతూ, నాట్యం చేసేవాడట ఆ ప్రాయంలోనే ఆయన

"ఆడిన మాటెల్ల నమృత కావ్యముగ,
పాడిన పాటెల్ల వరమగానముగ"

రూపొంది శ్రోతలను పరవశం చేసేదట.

ఎనిమిది ఏండ్ల లేతవయస్సులోనే అన్నమయ్యకు ప్రాపంచిక జీవితంపై విరక్తి కలిగినదట. అతిసామాన్యమైన ఒక సంఘటనవల్ల ఆయనకు లౌకిక బంధాలపై విముఖత కలిగింది. వెంటనే, బ్రతుకుపై విసిగి వేసారిన దీనుల కందరికీ ఏకమాత్రశరణ్యుడైన ఆ పరమకారుణికుడు శ్రీమహావిష్ణువుపై దృష్టి నిలిచింది.

చిన్నతనంలో ఆయన వదినెగారి పోరు కొంత అనుభవించవలసి వచ్చినట్లు కనిపిస్తుంది. అన్నమయ్య ఎక్కువగా పాటలు పాడటంలోనే కాలం గడుపుతూ, ఇంటిపనులేవీ పట్టించుకోకపోవటం అందుకు కారణం కావచ్చును. ఒకనాడు తల్లి దండ్రులు, అన్న, వదినె, అందరూ అన్నమయ్యను పిలిచి, పశువులకు పచ్చిగడ్డి కోసి తెమ్మని ఆదేశించారు.

కొడవలి చేతబట్టి ఆయన పచ్చిక బీడు దగ్గరకు వెళ్ళాడు. గడ్డి కోస్తూ ఉండగా ప్రమాదవశాత్తు చిటికెనవ్రేలికి గాయమై రక్తం కారటం ప్రారంభమయింది. వెంటనే ఆయనకు కోపమూ, విరక్తీ కలిగాయి. ఆ గాయాన్ని ఏదోవిధంగా సహించవచ్చును కాని, తన వదినె సూటిపోటు మాటలతో చేసే గాయం మాత్రం సహించరానిదని, అప్పటి తన బాధకు తన పెద్దలే కారణమని, కనుక వారిని వదిలి, ఇల్లు విడిచి వెళ్ళిపోవాలని నిర్ణయించుకొన్నాడు.

అదే సమయంలో వేంకటాచలం తరలి వెళ్ళుతున్న యాత్రికుల బృందం ఒకటి ఆయనకు కనిపించింది. అందరూ శ్రీనివాసుని నిరవధిక కారుణ్యశీలాన్ని కీర్తిస్తూ, సొగసుగా మృదంగ తాళాలు జతగూర్చి గానం చేస్తూ, పాటకు అనుగుణంగా చిందులు వేస్తూ, నడుమ నడుమ బిగ్గరగా "గోవిందా!", "హరీ!" అని స్వామిని సంబోధిస్తూ ఆనందంగా సాగిపోతున్నారు. ఆ సుందరదృశ్యం బాలుని ఆకర్షించింది. ఏది తన గమ్యమో వెంటనే అర్థమయింది తాను కూడా వారితో కలిసి తిరుపతి వెళ్ళాడు.

ఆ కాలంలో వేంకటేశ్వరస్వామి ఆలయం చేరటానికి యాత్రికులు విధిగా కాలిబాటనే ఏడుకొండలూ ఎక్కవలసి వచ్చేది. ఒకనాడు తెల్లవారకముందే ఆ యాత్రికులు కొండ ఎక్కటం మొదలుపెట్టారు అన్నమయ్య చిన్నవాడు. ఎనిమిది ఏండ్ల వాడు. ప్రొద్దుట లేచినప్పటి నుంచీ ఏమీ తినలేదు. కాగా కొంతసేపటికి అలసట కలిగి, మిగిలిన వారివెంట నడువలేక, వెనుకపడ్డాడు. ఒక వంక ఆకలి, మరొక వంక అలసట. తట్టుకోలేక దారిలో ఒక కొండరాతిమీద పండుకొని నిద్రపోయాడు. అప్పుడు ఒక పండు ముత్తైదువ రూపంలో పద్మావతీదేవి బాలునికి దర్శనమిచ్చి, ఆప్యాయంగా పలుకరించినదని చిన్నన్న తన కావ్యంలో వర్ణించాడు.

ఆ తల్లి పిలువగానే అన్నమయ్య కళ్ళు విచ్చి చూశాడు, కాని తనకేమీ కనిపించలేదు. కంటిచూపు పోయిందని దీనంగా మొరపెట్టుకొన్నాడు. అప్పుడా జగన్మాత ఆ పర్వతం "లాలిత సకల సాలగ్రామమయ" మనీ, దానిని చెప్పుల కాళ్ళతో తాకటం అపరాధమనీ, చెప్పులు

విడిచివేస్తే తిరిగి చూపు వస్తుందనీ చెప్పింది అమ్మవారు చెప్పినట్లే అన్నమయ్య చెప్పులు విడిచివేయగానే అతనికి తిరిగి చూపు వచ్చింది అప్పుడా కారుణ్యమయి బాలునికి స్వామి ప్రసాదాలతో ఆకలి తీర్చి, కొండమీద స్వామి ఆలయం చేరే దారి చూపి, అదృశ్యమయింది.

అన్నమయ్య తనకు కలిగిన అనుభూతికి ఆశ్చర్యపడి, ఆనంద పారవశ్యంలో అప్పటికప్పుడు ఆశువుగా **శ్రీ వేంకటేశ్వర శతకం** రచించాడు స్వామిని సంబోధిస్తూ వ్రాసిన శతకమే అయినా, ప్రధానంగా అమ్మవారి అనుగ్రహాన్ని ప్రస్తుతించే కావ్య మది

చిన్నన్న విపులంగా వర్ణించిన ఈ సంఘటన శ్రీదేవి (లక్ష్మి) నిస్సహాయులైన జీవులకూ, సర్వశక్తి సంపన్నుడైన స్వామికీ నడుమ మధ్యవర్తిగా వ్యవహరిస్తుందని చాటే విశిష్టాద్వైత సంప్రదాయానికి అనుగుణంగా ఉన్నది అమ్మవారు వాత్సల్యమయి గనుక స్వామితో అనునయవాక్యాలు పలికి, పతిత జీవులను ఆయన క్షమించి, అనుగ్రహించేటట్లు చేస్తుంది. స్వామి క్షమను సంవర్ధిల్ల జేసి, జీవులపట్ల ఆయన ప్రసన్నుడయ్యేటట్లు చేసే అమ్మవారి ఈ కారుణ్యగుణాన్ని యామునాచార్యులు ప్రథమంగా తన **చతుశ్శ్లోకీ** స్తోత్రంలో వర్ణించాడు ఆ గుణమే తరువాత రామానుజాచార్యులు రచించిన **శరణాగతి** గద్యంలో అతిరమణీయంగా అభివ్యక్త మయింది అటు తరువాత వెలువడిన శ్రీవత్సాంకమిశ్ర రచన **శ్రీస్తవం**లోనూ, పరాశరభట్టరు వ్రాసిన **శ్రీగుణరత్న కోశం**లోనూ, వేదాంత దేశికుల **శ్రీస్తుతి**లోనూ అసహాయులైన బిడ్డలపట్ల అవధులు లేని అమ్మవారి కారుణ్యగుణం విస్తృతంగా వర్ణితమయింది జీవులను రక్షించటంలో శ్రీదేవి పాత్ర ఇంత ముఖ్యమైనది కావటం వల్లనే విశిష్టాద్వైత మతానికి శ్రీవైష్ణవమతం అనే పేరు ఏర్పడింది. పైగా జీవులకు స్వామిని పొందే మార్గం ఉపదేశించే గురుపరంపరలో అమ్మవారు ప్రముఖస్థానం ఆక్రమిస్తుందని కూడా వైష్ణవులు భావిస్తారు.

మరొక సంగతి కూడా ఉన్నది శ్రీదేవి వికసిత పద్మంపై ఆసీనురాలై సదా విష్ణువక్షస్థలంపై వసిస్తున్నట్లు వర్ణిస్తారు. ఆమె విష్ణుహృదయ నివాసిని అని ఆ వర్ణన సాంకేతికంగా సూచిస్తుంది. స్వామి హృదయాన్ని మెత్తబరచి, అపరాధులైన జీవుల పట్ల ఆయన

దయాదృష్టితో వ్యవహరించేటట్లు చేయటానికే అమ్మవారు ఆ విధంగా విష్ణుమూర్తి హృదయంలో స్థిరంగా నివసిస్తుంది. వేంకటేశ్వరస్వామి అర్ధాంగి పద్మావతి (పద్మం తాల్చిన దేవి) స్వయంగా లక్ష్మీ దేవి అవతారమే దక్షిణదేశంలో అమ్మవారిని "అలర్ మేల్ మంగై" (పుష్పంపై ఆసీనురాలైన తరుణి) అనే తమిళనామంతో వ్యవహరించటం కనిపిస్తుంది.

అమ్మవారు స్వయంగా తన దివ్యహస్తాలతో అందించిన ఆహారం భుజించిన తరువాత అన్నమయ్య మిగిలిన కొండమెట్లను సునాయాసంగా ఎక్కి, వేంకటాద్రి శిఖరం చేరుకొన్నాడు. పవిత్ర జలాలతో నిండిన స్వామి పుష్కరిణిలో స్నానం చేసి, చేరువనే ఉన్న తీర్థాలను సేవించాడు. తరువాత ఆలయంలోనికి వెళ్ళి సౌందర్య సారసర్వస్వమైన స్వామివారి దివ్యమంగళ విగ్రహాన్ని నేత్రపర్వంగా దర్శించాడు అప్పుడు తనకు కలిగిన అనుభూతిని ఆయన ఆశువుగా ఒక కీర్తనలో వర్ణించాడు.

*కంటి నఖిలాండకర్త నధికుని గంటి,*
*కంటి నఘములు వీడుకొంటి, నిజమూర్తి గంటి*

*మహనీయ ఘనఫణామణుల శైలము గంటి,*
*బహువిభవముల మంటపములు గంటి,*
*సహజనవరత్న కాంచనవేదికల గంటి,*
*రహి వహించిన గోపురము లవె గంటి.*

*పావనంబైన పాపవినాశనము గంటి,*
*కైవసంబగు గగనగంగ గంటి,*
*దైవికపు పుణ్యతీర్థములెల్ల పొడగంటి,*
*కోవిదులు కొనియాడు కోనేరు గంటి.*

*వరమ యోగీంద్రులకు భావగోచరమైన*
*సరిలేని పాదాంబుజముల గంటి,*
*తిరమైన గిరి చూపు దివ్యహస్తము గంటి,*
*తిరువేంకటాచలాధిపు చూడగంటి.*

వేంకటేశ్వరస్వామి దివ్యసుందర రూపదర్శనంవల్ల తనకు కలిగే

ఆనందాన్ని అన్నమాచార్యులు తరువాత ఎన్నో కీర్తనలలో వర్ణించాడు స్వామిని "చాల నేరిచి పెద్ద లిచ్చిన నిధాన" మనీ, "గారవించి దప్పి తీర్చు కాలమేఘ" మనీ, "చెడనీక బ్రతికించు సిద్ధమంత్ర" మనీ, "చేవ దేర కాచినట్టి చింతామణి" అనీ, "రోగా లడచి రక్షించే దివ్యౌషధ" మనీ ప్రస్తుతించాడు. ఐతే ప్రప్రథమంగా స్వామి దర్శనం చేసినప్పుడు వ్రాసిన ఈ కీర్తనలోనే ఆ ప్రభువు నిశ్చలంగా గిరిపై నిలిచి తన దివ్యహస్తంతో తన పాదాలనే చూపటంలో ప్రకటితమయ్యే శరణాగతి సంకేతాన్ని గురించి ప్రస్తావించటం గమనించదగిన విశేషం.

ఆ మొదటి యాత్రలో అన్నమయ్య కొండపై ఉండగా కొన్ని అద్భుత సంఘటనలు జరిగినవి ఆయన కొండ చేరిన రెండవరోజు ఏకాదశీపర్వదినం కావటం తటస్థించింది. ఆయన కోనేటిలో స్నానమాడి, తడి బట్టలు గాలిలో ఆరుతూ ఉండగా, స్వామిపై ఒక శతకం రచించాడట. తరువాత ఆలయం చేరేసరికి తలుపులు మూసివేశారు. వెంటనే అన్నమయ్య తాను రచించిన శతకం పఠించటం ప్రారంభించాడు. తలుపులు అప్రయత్నంగానే తెరుచుకోవటంతో[12] ఆయన ఆలయంలోనికి వెళ్ళటానికి వీలయింది శతకపఠనం ముగియగానే ఆమోదసూచనగా స్వామి కంఠసీమనుంచి ముత్యాలహారం క్రిందికి జారిందట ఈ దృశ్యం చూసిన వైఖానసార్చకులు బాలుని ప్రగాఢ భక్తికి ఆశ్చర్యచకితులయ్యారట

ఆ సంఘటన జరిగిన కొన్నాళ్ళకు ఘనవిష్ణువు అనే వైష్ణవయతికి స్వామి కలలో కనిపించి తన భక్తుడు, తాళ్ళపాక అన్నమయ్య అనే బాలుడు, నల్లని చాయ గలవాడు, కొండమీద ఉంటున్నాడనీ, అతనికి పంచసంస్కారాలు[13] చేసి, వైష్ణవమతంలో చేర్చుకోవలసినదనీ ఆదేశించాడు. ఆ మాట విని అన్నమయ్య పరమానంద భరితుడయ్యాడు. ఘనవిష్ణుయతివల్ల ముద్రాధారణం వంటి సంస్కారాలు పొంది వైష్ణవుడయ్యాడు. జన్మతః ఆయన స్మార్తుడు. వారి వంశంలో వైష్ణవం స్వీకరించిన మొదటి వ్యక్తి. ఆ విధంగా వైష్ణవుడు కావటంవల్ల నాటినుంచి "అన్నమయ్య" "అన్నమాచార్యు"లయ్యాడు.

ఆయన ఆలయపరిసరాలలో స్వామిని కీర్తిస్తూ శ్రవణమధురంగా

గానం చేస్తూ,

"ఎండ గాని, నీడ గాని, ఏమైన గాని,
కొండల రాయడే మా కులదైవము"

అని చాటిచెప్పే శ్రీవైష్ణవ మతసిద్ధాంతాలను అధ్యయనం చేస్తూ, సంతోషంగా కాలం గడుపుతున్నాడు. అంతలో కొడుకుపై బెంగ పెట్టుకొన్న తల్లి లక్కమాంబ అతనిని వెతుకుతూ వేంకటాచలం చేరు కొన్నది. కొడుకును చూసి పరమానందం పొందింది. ఇక మీదట తమ ఇంటిలో అతని ఆధ్యాత్మిక సాధనకు ఏవిధమైన ఆటంకం కలుగకుండా చూస్తామని వాగ్దానం చేసి, కొడుకును తిరిగి ఇంటికి తీసుకొని వెళ్ళింది.

ఇల్లు చేరిన తరువాత అన్నమాచార్యులు ఎనిమిది ఏండ్ల పాటు గాఢమైన సాధన చేసి ఉంటాడు ఎందుచేతనంటే ఆయనకు 16 ఏండ్ల ప్రాయంలో వేంకటేశ్వరస్వామి ప్రత్యక్షమైనట్లు కొండమీద స్వామి ఆలయం ఆవరణలోనే లభించిన ఒక తామ్రశాసనం వల్ల తెలుస్తున్నది ఆ విధంగా స్వామి సాక్షాత్కరించిన నాటినుంచి అన్నమాచార్యులు నిత్యం స్వామిపై ఒక కీర్తననైనా రచించి సమర్పించాలని నియమం ఏర్పరచుకొన్నాడనీ, జీవితాంతం ఆ దీక్ష పాటించాడనీ ఆ శాసనం వల్లనే తెలియవస్తున్నది

ఈ సందర్భంలో ఒక విషయం మనం గమనించవలసి ఉంటుంది అన్నమయ్యకు బాల్యం నుంచే పాటలు అల్లే అభ్యాసం ఉండేదని చిన్నన్న రచించిన కావ్యంవల్ల తెలుస్తున్నది. ఎనిమిది ఏండ్ల వయస్సులోనే మొదటిసారి ఆలయంలో స్వామిని దర్శించినప్పుడు ఆయన "కంటి నఖిలాండకర్త, నధికుని గంటి" అనే కీర్తన వ్రాశాడని కూడా అన్న మాచార్య చరిత్రములో చిన్నన్న తెలిపాడు. కనుక 16వ ఏట స్వామి సాక్షాత్కరించటం వల్ల అన్నమయ్య భక్తి మరింత గాఢమై, నాటి నుంచి స్వామికి నిత్యం ఒక నూతనకీర్తననైనా రచించి, సమర్పించాలనే నియ మాన్ని ఆయన ఏర్పరచుకొన్నాడని మనం గ్రహించవలసి ఉంటుంది.

ఈ సంఘటన జరిగిన తరువాత అన్నమాచార్యులు తల్లి దండ్రుల ఇచ్ఛ ననుసరించి తిరుమలమ్మ, అక్కలమ్మ అనే ఇద్దరు కన్యలను వివాహం

చేసుకొని గృహస్థు డయ్యాడు. తిరుమలమ్మకు తిమ్మక్క అనే పేరు కూడా ప్రచారంలో ఉన్నది. ఆమె స్వయంగా కవయిత్రి. **సుభద్రాకల్యాణము** అనే పద్యకావ్యం రచించి తెలుగు సాహిత్యంలోని ప్రసిద్ధ కవయిత్రులలో ప్రథమస్థానం గడించుకొన్నది ఆమె పుత్రుడు నరసింగన్న కూడా కవిగా పేరు పొందినవాడట. ఐతే ఈ నరసింగన్న ఎవరో ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. అక్కలమ్మ కుమారుడు పెదతిరుమలాచార్యులు కూడా వాసి కెక్కిన కవియే అన్ని విధాల ఆయన తండ్రికి తగిన తనయుడు. తండ్రి వలెనే స్వామిని ప్రస్తుతిస్తూ భక్తి రసాత్మకమైన కీర్త నలు రచించి, శ్రావ్యంగా గానం చేసేవాడు అన్నమాచార్యుల మనుమలు కూడా కవులై సాహిత్యాన్ని సంపన్నం చేశారు. ఆ విధంగా ఆ వంశ స్థులు 150 ఏండ్లపాటు ఎన్నో సాహిత్యశాఖలలో గ్రంథాలు రచించారు. స్వామికి నిత్యం ఒక నూతనకీర్తనను సమర్పించాలనే నియమాన్ని తండ్రి తరువాత పెదతిరుమలాచార్యులు పాటించాడు.

వివాహమై కొంతకాలం గడిచిన తరువాత తాను స్వీకరించిన విశిష్టాద్వైత మత తత్త్వాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలనే సంక ల్పంతో అన్నమాచార్యులు నాటి ఆచార్యులలో ప్రసిద్ధుడైన ఆదివణ్ శఠగోపయతిని ఆశ్రయించాడు ఆ యతి అహోబల నృసింహక్షేత్రంలో ఒక మఠాన్ని స్థాపించాడు. అన్నమయ్య తన కుటుంబంతో తరలి వెళ్ళి అహోబలంలో కొన్ని ఏండ్ల పాటు గురుముఖతః తమ మతగ్రంథాలను — ముఖ్యంగా ఆళ్వారులు రచించిన దివ్యప్రబంధము అనే పదకవితాసం కలనాన్ని, వాల్మీకి రామాయణాన్ని — శ్రద్ధగా అధ్యయనం చేశాడు శ్రీవైష్ణవులు రామాయణాన్ని శరణాగతిశాస్త్రంగా పరిగణిస్తారు. అహో బలంలో నివసిస్తూ అన్నమాచార్యులు

*"అంతరంగమున తాను హరి దలచిన చాలు,*
*అంతటి మీది పను లాతడే యెఱుగు"*

అని చాటే ప్రపత్తిమార్గ విశిష్టతను చక్కగా అర్థం చేసుకొన్నాడు.

అది చిత్రమైన సంబంధం. ఒక వంక భక్తుని నిస్స్పృహోయత. మరొక వంక పరమాత్ముని నిరవధికానుగ్రహం. నిరాశకు ఏమాత్రం తావు లేని

బంధ మది. ఈ మార్గంలోని సౌలభ్యాన్ని విశదీకరిస్తూ అన్నమాచార్యులు అసంఖ్యాకంగా కీర్తనలు రచించాడు. సర్వకాల సర్వావస్థలలోనూ ఆ జగదేకపతి వేంకటపతి తనకు రక్షకుడై తన పాలిట నిలిచి ఉన్నాడనే స్థిరవిశ్వాసం ఒక కీర్తనలో సొగసుగా వ్యక్త మయింది

*దీనుడ నేను, దేవుడవు నీవు,*
*నీ నిజమహిమే నెరవుదు గాక.*

*మతి జనన మెఱుగ, మరణం బెఱుగను,*
*ఇతవుగ నిక నిను నెఱిగేనా?*
*క్షితి బుట్టించిన శ్రీపతివి నీవే*
*తతి నాపై దయ దలతువు గాక.*

*తలచ పావమని, తలచ పుణ్యమని,*
*తలవున ఇక నిను దలచేనా?*
*అలరిన నాలో అంతర్యామివి,*
*కలుష మెడయ నను గాతువు గాక*

*తడవ నా హేయము, తడవ నా మలినము,*
*తడయక నీమేలు తడవేనా?*
*విడువలేని శ్రీ వేంకటవిభుడవు,*
*కడ దాక నిక గాతువు గాక.*

స్వామికి అనుదినం ఒక నవ్యగీతాన్ని అర్పించవలెననే నియమాన్ని అన్నమయ్య శ్రద్ధగా పాటించేవాడు. ఎప్పుడైనా ప్రయాణాలలో మార్గ మధ్యంలో ఇతర దేవతామూర్తుల ఆలయాలను దర్శించటం తటస్థించి ఆయన వారిని స్తుతిస్తూ వ్రాసిన గీతాలలో కూడా చివరి చరణంలో వారికి స్వామితో అభేదం కల్పించి విధిగా స్వామి పేరు ప్రస్తావించే వాడు. ఆ విధంగా 'వేంకటేశ్వర' నామం అన్నమాచార్యుల కీర్తనలలో ముద్రగా మనకు సర్వత్ర కనిపిస్తుంది.

పరమాత్మను చేరటానికి జీవాత్మ చేసే ప్రయత్నాన్ని శ్రీకృష్ణునితో రాధాదేవి, ఆమె సహచారిణులైన వ్రజగోపికలు నెరపిన ప్రణయ

కలాపంగా చిత్రిస్తూ శృంగారగీతసాహిత్యం భాగవత పురాణం నాటి నుంచి దేశంలో వ్యాప్తిలో ఉన్నది ఆ మార్గంలోనే అన్నమాచార్యులు అతిరమ్యంగా రచించిన శృంగారకీర్తనలు ఈ దశకు చెందినవి కావచ్చును అయితే వాటితోపాటే ఆయన జీవితం క్షణభంగురమని, హరిభక్తియే చక్కని రాజమార్గమని, శరణాగతియే కర్తవ్యమని చాటుతూ అధ్యాత్మకీర్తనలను కూడా విరివిగా రచించాడు.

ఆ గీతాలలోని భక్తితత్పరత, అనితర సాధ్యమైన అద్భుతభావన, పదలాలిత్యం, వీటితోపాటు ఆయన గాత్రమాధుర్యం విన్న వారందరినీ విశేషంగా ఆకర్షించటం వల్ల ఆ పాటలకు అందరూ పరవశులయ్యే వారట. ఆయనకు లభించిన ప్రజాదరణను వర్ణిస్తూ చిన్నన్న

"విన్నవారెల్ల నువ్విళ్ళూరి యొక్క
ప్రన్న వీనులు నిండు పండువుల్ సేయ,
తుంబురుడో, నారదుడో, కాక యీవి
ధంబున తిరుగు గంధర్వుడో, కాక
మనుజుడో యీ యన్నమయ్య"

అని సర్వజనులు సంతసించారని వర్ణించాడు.

తాళ్ళపాక దగ్గర ఉన్న టంగుటూరు అధిపతి అయిన సాళ్వనరసింగరాయలు పలువురి నోట అన్నమాచార్యుల భక్తి గరిమను గురించి విని, ఆయన దగ్గరకు వెళ్ళి, టంగుటూరు వచ్చి తన అతిథిగా ఉండవలసిందని సగౌరవంగా ఆహ్వానించాడు. వైష్ణవుని లక్షణాలలో వినయం ఒకటి గనుక, అతని వర్తనకు సంతుష్టుడై అన్నమయ్య అతని కోరిక ననుసరించి కొంతకాలం టంగుటూరిలో అతని ఆతిథ్యం స్వీకరించాడు.

నరసింగరాయలకు అప్పటినుంచి అభ్యుదయపరంపర సంప్రాప్తించ సాగింది. క్రమంగా అధికారం విస్తరించి, విజయనగర సామ్రాజ్యంలోని పెనుగొండ దుర్గాధిపతి అయ్యాడు. తన అభివృద్ధికి అన్నమాచార్యుల ఆశీస్సులే కారణమని భావించి, ఆయనను పెనుగొండకు ఆహ్వానించాడు. అతని ఇచ్ఛ ప్రకారమే అన్నమయ్య కొంతకాలం పెనుగొండలో నివసించాడు. అక్కడ ఆయన అప్పుడప్పుడు నరసింగరాయల సభలో తన

కీర్తనలను వినిపించి సభాసదులను ఆనందింపజేసేవాడు.

ఒకనాడు నరసింగరాయలు ఏదైనా శృంగారకీర్తనను వినిపించ వలసినదని అన్నమాచార్యులను అర్థించాడు. ఆయన ఒక కీర్తన పాడి వినిపించాడు. రాత్రివేళ స్వామితో శృంగారం నెరపిన నాయిక వేకువ వేళ శయ్యామందిరం నుంచి వెలుపలికి రాగానే ఆమెను చూస్తూ చెలి కత్తెలు పరిహాసం చేయటం ఆ పాటలోని ఇతివృత్తం.

ఏమొకో చిగురుటధరమున ఎడనెడ కస్తురి నిండెను,
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా?

కలికి చకోరాక్షికి కడకన్నులు కెంపై తోచిన
చెలువం బిప్పు డిదేమో చింతింపరె చెలులు,
నలువున ప్రాణేశ్వరుపై నాటిన యా కొనచూపులు
నిలువున పెరుకగ నంటిన నెత్తురు కాదుగదా?

పడతి చనుగవ మెఱుగులు పైపై పయ్యెద వెలుపల
కడు మించిన విధమేమో కనుగొనరె చెలులు,
ఉడుగని వేడుకతో విభు డొత్తిన నఖశశిరేఖలు
వెడలగ వేసవి కాలపు వెన్నెల కాదుగదా?

ముద్దియ చెక్కుల కెలకుల ముత్యపు జల్లుల చేర్పుల
ఒద్దిక లాగు లివేమో ఊహించరె చెలులు,
గద్దరి తిరువేంకటపతి కామిని వదనాంబుజమున
అద్దిన సురతపు చెమటల అందము కాదుగదా?

ప్రేమౌత్సుక్యంలో ముద్దులవల్ల పెదవికి కాటుపడటం, నిద్ర కొరత వల్ల కనుగొనలు ఎరుపెక్కటం, స్తనాలపై నఖక్షతాలు, రతిక్రీడవల్ల అలసటతో ముఖంపై చెమట బిందువులు కనిపించటం భారతీయ శృంగారకవితలో సర్వసామాన్య సన్నివేశాలే. కాని ఆ సుపరిచిత లక్షణాలకు అన్నమయ్య కల్పించిన కారణాలు మాత్రం నిశ్చయంగా ఆయన అనన్యభావనా వైశి ష్ట్యానికి నిదర్శనాలు.

అపాత మధురమైన ఆ శృంగారకీర్తన రసమధురిమకు స్పందించి,

నరసింగరాయలు తిరిగి తిరిగి ఆ పాటను పాడించి, "ఇది కవిత్వం" అని ప్రశంసించాడు ఆనందాతిరేకంలో తన స్థానాన్ని విస్మరించి, తనపై కూడా అటువంటి పాట ఒకటి రచించవలసినదని ఆకవివరేణ్యుని కోరాడు రాయలకు సాహిత్యంపైన ఉన్న ప్రీతి కొంతవరకు ఇందుకు కారణం కావచ్చును; కాని ఐశ్వర్యం, అధికారం అధికం కావటంవల్ల వివేకం నశించి, ఇది తగును, తగదు అనే విచక్షణజ్ఞానం పోయి, తన కవితాప్రావీణ్యాన్ని శ్రీవిష్ణు చరణారవిందాలకు అర్పితం చేసిన ఒక భాగ వత శిఖామణిని తనవంటి క్షుద్రమానవునిపై పాట వ్రాయవలసినదని అడిగేటంతటి అల్పత్వానికి దిగజార్చినవి

రాజుమాట అన్నమయ్యకు బాధ కలిగించింది స్పష్టంగా

*"హరి ముకుందుని గొనియాడు నా జిహ్వ*
*నిను గొనియాడంగ నేరదెంతైన"*

అని సమాధాన మిచ్చాడు.[14] ఈ సంఘటన నిండు సభలో జరిగింది తన పోషణలో ఉంటున్న విద్వాంసుడు తన పరిజనం సమక్షంలోనే తన మాట కాదన్నాడని, ఇది తనకు తీరని అవమానమని ఆగ్రహించి, కవికి సంకెళ్ళు వేసి మొగసాలలో బంధించి ఉంచండని నరసింగరాయలు భటులను ఆజ్ఞాపించాడు. భటులు విధిలేక తమ ప్రభువు ఆజ్ఞ పాలించారు

ఆ స్థితిలో అన్నమయ్య మనస్సు సహజంగానే ప్రణతార్తిహరుడైన హరి మీద లగ్నమయింది. అన్ని ఆపదలనుంచి రక్షించగల శక్తి హరి నామానికి మాత్రమే ఉన్నదనే అచంచల విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ అప్రయత్నంగానే ఆయన నోటినుండి ఒక కీర్తన వెలువడింది.

ఆకటి వేళల, అలపైన వేళలను
తేకువ హరినామమే, దిక్కు మరి లేదు.

కొఱమాలి యున్న వేళ, కులము చెడిన వేళ,
చెఱ వడి యొరుల చేజిక్కిన వేళ,
నొఱపైన హరినామ మొక్కటే గతి గాక,
మఱచి తప్పిననైన మఱి లేదు తెఱగు

ఆపద వచ్చిన వేళ, యాఁబడి బడిన వేళ,
పాపవు వేళల, భయవడిన వేళ,
ఓపినంత హరినామ మొక్కటే గతి గాక,
మాపు దాక పొరలిన మఱి లేదు తెఱఁగు.

సంకెల బెట్టిన వేళ, చంప బిలిచిన వేళ,
అంకిలిగా అప్పులవా రాగిన వేళ,
వేంకటేశు నామమే విడిపింప గతి గాక,
మంకు బుద్ధి బొరలిన మఱి లేదు తెఱఁగు.

అన్నమాచార్యుల నోటినుండి ఆ పాట వెలువడిన వెంటనే ఆయన సంకెళ్ళు విడిపోయినవి. ఈ అద్భుతదృశ్యాన్ని చూసిన రాజభటులు వెంటనే వెళ్ళి నరసింగరాయలతో చెప్పారు. కాని అహంకారం, అధికార దర్పం ఉడుగని ఆ రాజు భటుల మాటలు నమ్మలేదు. లంచానికి ఆశపడి ఆ కథను వారే కల్పించారని భావించాడు.

ఏమి జరిగిందో స్వయంగా తానే పరిశీలించాలనే ఉద్దేశంతో మొగ సాలకు వెళ్ళాడు అన్నమయ్యకు తిరిగి సంకెళ్ళు వేయించి, "ఏదీ, పాట పాడి సంకెళ్ళు విడిపించుకో, చూతాము" అని అపహాస్యం ఆడాడు. రాజు అజ్ఞానానికి అన్నమాచార్యులు నవ్వి, హరినామమహిమను చాటిచెప్పే ఆ పాటను తిరిగి పాడాడు వెంటనే మదాంధుడైన ఆ రాజు ఎదు టనే ఆ భాగవతశిఖామణి సంకెళ్ళు విడిపోయినవి. అప్పుడు ఆ మహా భక్తుని మహిమను గుర్తించి, రాజు ఆయన పాదాలమీద పడి, క్షమాభిక్ష వేడాడు. ఆయన రాజును క్షమించాడు గాని, ఇక మీదట విష్ణుభక్తులను హింసించవద్దనీ, కృతయుగంలో ధ్యానం వల్ల, త్రేతాయుగంలో క్రతువు వల్ల, ద్వాపరయుగంలో అర్చన వల్ల లభించే సమస్తశుభాలు కలియుగంలో హరికీర్తనం వల్లనే లభిస్తాయని, కనుక సతతం హరిని కీర్తించే సత్పురుషు లను శ్రద్ధా భక్తులతో సమాదరించదగునని అతనికి హితబోధ చేశాడు.

అటువంటి లౌకిక వ్యాపారపరాయణుల మధ్య జీవించటం తనకు తగదని, తిరుపతి చేరి శ్రీనివాసుని సన్నిధిలో ప్రశాంతంగా జీవించటం శ్రేయస్కరమని అన్నమాచార్యులు నిర్ణయించుకొన్నాడు ఇక్కడ ఒక

సంగతి మనం గమనించవలసి ఉంటుంది ఈ సాళ్వ నరసింహ రాయలే తరువాత విజయనగర సామ్రాజ్యానికి అధిపతి అయ్యాడు ఆ విధంగా అధికారం, ఐశ్వర్యం కలిగిన రాజులతోనూ, చక్రవర్తుల తోనూ సన్నిహితంగా సంచరించే సందర్భాలు తమకు తటస్థించినా, అన్నమాచార్యులు కాని, ఆయన వంశస్థులు మరెవ్వరు కాని నరస్తుతి చేస్తూ ఎన్నడూ కావ్యాలు వ్రాయలేదు అడగకుండానే ఆ కవీశ్వ రులకు కానుకలు, కట్నాలు, సన్మానాలు లభించాయి ఐతే కలిమి, లేమి, రాజపూజ్యత, అవమానం, ఎప్పుడు ఏది ప్రాప్తించినా చలించక, స్వామి శ్రీపాదాలే తమ ప్రశస్తసంపద అని, ఆచరణకమలాలే తమ పెద్ద లిచ్చిపోయిన నిధినిక్షేపాలని భావిస్తూ వారు జీవితయాత్ర సాగించారు. యామునాచార్యుల జీవితంలో ఒక ఇంపైన సంఘటన ఉన్నది. పెద్దలు తనకు వదలిపోయిన నిక్షేపాన్ని స్వాధీనం చేసుకోవటానికి తరలి వెళ్ళిన ఆ పరమభక్తుడు శ్రీరంగంలో శేషతల్పంపై పవళించి ఉన్న రంగనాథ స్వామి పదద్వయమే ఆ నిక్షేపమని గ్రహించి ఆనందపరవశు డవుతాడు. అన్నమాచార్యులు కూడా శ్రీమహావిష్ణువే జగదేకపతి అని, ఆయనకు కైంకర్యం చేస్తూ ఉండటమే తన జీవితానికి పరమావధి అని విశ్వసిం చిన వాడు ఆ లక్ష్యాన్ని మరచి కేవలం మనుష్యుల సేవలోనే జీవితం గడపటం అవివేకమని ఒక గీతంలో ఆయన చాటిచెప్పాడు.

మనుజుడై పుట్టి, మనుజుని సేవించి,
అనుదినమును దుఃఖ మందనేల?

చుట్టెడు కడుపుకై చొరని చోట్లు చొచ్చి,
పట్టెడు కూటికై బ్రతిమాలి,
పుట్టిన చోటికే పొరలి మనసు పెట్టి,
వట్టి లంపటము వదలనేరడు గాన.

అందరిలో పుట్టి, అందరిలో చేరి,
అందరి రూపము లటు తానై,
అందమైన శ్రీ వేంకటాద్రీశు సేవించి,
అందరాని పద మందె నటు గాన.

జీవితంలో ఎప్పుడో ఇంకొక ఆపదను కూడా అన్నమాచార్యులు ఎదుర్కొనవలసి వచ్చినట్లు ఆయన వ్రాసిన ఒక కీర్తనవల్ల తెలుస్తున్నది. ఆయన నిత్యం అర్చించే విగ్రహాలు ఒకనాడు కనిపించలేదు[15] ఏమి జరిగిందో, ఎప్పుడు, ఎక్కడ, ఏ పరిస్థితులలో ఆ విగ్రహాలు పోయినవో, ఎవరైనా బుద్ధి పూర్వకంగా చేసిన అపచారమో, యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనో ఆ కీర్తననుబట్టి మనం నిర్ణయించలేము కాని విగ్రహాలు కనిపించకపోవటం వల్ల ఆయన ఆర్తితో ఆ గీతం ఆలపించాడు తాను స్వామిని పూజించవలసిన వేళ సమీపిస్తున్నదనీ, వెంటనే స్వామిని తనకు తిరిగి చేర్చవలసినదనీ దీనంగా ఆంజనేయుని, గరుడుని, ప్రహ్లాదుని, అర్జునుని, ఆదిశేషుని, కార్తవీర్యార్జునుని వేడుకొన్నాడు

*ఇందిరారమణు దెచ్చి యియ్యరో మా కిటువలె,*
*పొంది యీతని పూజింప పొద్దాయ నిపుడు*

*ధారుణి మైరావణు దండించి రాము దెచ్చి*
*నేరుపున మించిన అంజనీతనయా!*
*ఘోరనాగపాశముల గొట్టివేసి యీతని*
*కారుణ్య మందిన ఖగరాజ! గరుడా!*

*నానాదేవతలకు నరసింహు కంబములో*
*పొని వట్టి చూపినట్టి ప్రహ్లాదుడా!*
*మానవుడై కృష్ణ మహిమల విశ్వరూపు*
*పూని బండి నుంచుకొన్న పోటబంటు! అర్జునా!*

*శ్రీ వల్లభునకు నశేష కైంకర్యముల*
*శ్రీ వేంకటాద్రివైన శేషమూరితీ!*
*కైవసమైన యట్టి కార్తవీర్యార్జునుడా! ఈ*
*దేవుని నీవేళ యిట్టె తెచ్చి మాకు నియ్యరే!*

వాల్మీకి రామాయణంలో లేని ఒక కథ ననుసరించి, రావణుని బంధువైన మహిరావణుడు రామలక్ష్మణులను ఎత్తుకొనిపోయి పాతాళంలో బంధించగా, హనుమంతుడు అతనిని సంహరించి వారిని బంధవిముక్తులను కావించాడు. లంకలో జరిగిన భీషణసంగ్రామంలో ఇంద్రజిత్తు

చేత రామలక్ష్మణులు నాగపాశబద్ధులైనప్పుడు గరుత్మంతుడు వచ్చి వారి పాశాలు విడిపించాడు. ప్రహ్లాదుడు శ్రీమహావిష్ణువును ఒక స్తంభంలో నరసింహాకృతితో ఆవిర్భవింపజేశాడు. కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడు స్వామి విశ్వరూపాన్ని దర్శించగలిగాడు. ఆదిశేషుడు స్వామికి అహర్నిశలు సేవ చేస్తూ, అతి సన్నిహితంగా వర్తించే ఆంతరంగిక దాసుడు ఇక, ఏవైనా వస్తువులు పోయినా, ఎవరైనా దొంగిలించినా, కార్తవీర్యార్జునుని స్మరించవలెనని **మంత్ర రత్నాకరం** అనే గ్రంథంలో ఉన్నది అందుకే అన్నమాచార్యులు వీరందరినీ పేరుపేరున పిలిచి, తనకు స్వామిని తిరిగి తెచ్చి ఇవ్వవలసినదని ప్రార్థించాడు.

దేవతార్చన విగ్రహాలు ఆయనకు ఏ విధంగా తిరిగి లభించాయో మనకు నిశ్చయంగా తెలియదు. ఐతే ఆ సంఘటనను గురించి ఇప్పుడు వ్యాప్తిలో ఉన్న కథలు మాత్రం పరిశోధనలో ప్రాథమికసూత్రాలను కూడా పాటించని కొందరు వ్యక్తులు చారిత్రకాధారాలపట్ల లక్ష్యం లేక, తమ ఊహాబలంతో చేసిన కల్పనలే కాని సత్యం కాదు. అన్నమాచార్యులు అర్చించిన దేవతావిగ్రహాలు ఇప్పుడు తిరుపతి సమీపంలోని శ్రీనివాస మంగాపురంలో కల్యాణ వేంకటేశ్వరాలయంలో ఉన్నట్లు తెలుస్తున్నది

మానవజన్మ ఎత్తిన తరువాత కష్టాలూ, క్లేశాలూ ఎంతటి వారికైనా తప్పవు — వారు పాపాత్ములైనా, పరమభాగవతులైనా ప్రపంచంలో వివిధదేశాల మహాభక్తుల జీవితచరిత్రలు చదివితే, వారందరూ ఎన్నో కడగండ్ల పాలైనట్లు స్పష్ట మవుతుంది దైవసాక్షాత్కారం వల్ల పొందే పరమానందానుభూతికి పూర్వం దుర్భరమైన మనోవ్యథను అనుభవించవలసి వస్తుంది. గాఢాంధకారంలో చిక్కుపడి దిక్కు తెలియని స్థితిలో వ్యథ చెందిన తరువాతనే జ్ఞానసూర్యోదయ దర్శనం కలుగుతుంది ఐతే కష్టాలు బద్ధజీవులలో తీవ్రమైన అసంతృప్తిని రేకెత్తించి, వారిని నాస్తికులుగానో, అజ్ఞేయవాదులుగానో మార్చివేస్తాయి భక్తుల విషయంలో అందుకు భిన్నంగా జరుగుతుంది. ఆర్తి వారి భక్తిని ఇనుమడింపజేసి, వారి ఆధ్యాత్మిక వికాసానికి దోహదం చేసి, వారిని దైవానికి సన్నిహితం చేస్తుంది. వారు అన్నమాచార్యులవలె సత్కవులు కూడా అయితే, చీకట్ల మధ్య కాంతి రేఖలు చూపుతూ, దైవానుగ్రహం

పట్ల అచంచల విశ్వాసాన్ని ప్రకటిస్తూ, కమనీయగీతాలతో సాహిత్యాన్ని సంపన్నం చేయటానికి కూడా ఆ అప్రియఘటనలే కారణమవుతాయి.

అన్నమాచార్యులు పెనుగొండ నుంచి తిరుపతి చేరి, అక్కడ వేంకటాద్రిపై కొంతకాలం నివసించాడు అక్కడ ఉండగానే **శృంగార మంజరి** అనే కావ్యం రచించాడు ఒక బాలికకు స్వామిపై అంకురించిన అనురాగం సఫలం కావటం దాని ఇతివృత్తం. నిత్యం నూతనకీర్తనను రచించి స్వామికి సమర్పించవలెననే వ్రతం నిర్విఘ్నంగా కొనసాగుతూ ఉన్నది. స్వామి కోవెలలో అత్యంత వైభవోపేతంగా జరిగే నిత్యసేవలను, ఉత్సవాలను, ఊరేగింపులను తనివితీర వర్ణిస్తూ ఆయన అసంఖ్యాక కీర్తనలను రచించాడు ఆ పరమపవిత్ర క్షేత్రంలో జరిగే పూజాపురస్కారాలతో పాటు, కొండలు కాన వచ్చినప్పుడు కలిగే ఆనందం, ఆలయంలో స్వామి జగన్మోహనరూపాన్ని దర్శించినప్పుడు కలిగే ఆహ్లాదం రమ్యాతిరమ్యంగా వ్యక్తం చేశాడు.

అన్నమయ్య స్వామిని దర్శించటానికి ఎన్నిసారులు ఏడుకొండ లెక్కాడో తెలియదు అటువంటి సందర్భాలలో ఆయనకు ఆ పర్వతశిఖరాలు పాము పడగలవలె ఉన్నట్లు తోచింది. నిజానికి వేంకటాచలక్షేత్రమాహాత్మ్యాన్ని ఉగ్గడించే పురాణాలు ఆ పర్వతశ్రేణి స్వామి వైకుంఠంనుంచి భూలోకానికి వేంచేసి, ఇక్కడ తన దివ్యలీలలను ప్రదర్శిస్తూ నిలకడగా ఉండటానికి వీలుగా క్రీడా పర్వతరూపంలో ఉన్న ఆదిశేషుడే అని వర్ణించాయి. ఒక కీర్తనలో అన్నమాచార్యులు వేంకటాద్రి ప్రాశస్త్యాన్ని, స్వామి ఆలయవైభవాన్ని స్మరణీయంగా వ్యక్తం చేశాడు

అదివో అల్లదివో హరి వాసము,
పదివేల శేషుల పడగల మయము.

అదె వేంకటాచల మఖిలోన్నతము;
అదివో బ్రహ్మాదుల కపురూపము;
అదివో నిత్యనివాస మఖిల మునులకు,
నదె చూడు, డదె మ్రొక్కు, డానందమయము.

చెంగట నల్లదివో శేషాచలము,
నింగి నున్న దేవతల నిజవాసము;
ముంగిట నల్లదివో మూల నున్న ధనము,
బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము

కైవల్యపదము వేంకటనగ మదివో,
శ్రీవేంకట పతికి సిరు లయినది,
భావింప సకలసంపదల రూప మదివో,
పావనముల కెల్ల పావనము.

భవబంధాల నుంచి విడివడి మోక్షం పొందటానికి శ్రీకృష్ణుడు అర్జునునికి భగవద్గీతలో అనేకమార్గాలు బోధించి, చివరకు అన్నిటికంటె సులభమైన మార్గాన్ని

"సర్వ ధర్మాన్ పరిత్యజ్య, మా మేకం శరణం వ్రజ,
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి, మా శుచః"

అనే చరమశ్లోకంలో ఉపదేశించాడని, కనుక స్వామి పాదాలను ఆశ్రయించటమే జీవులకు ఏకమాత్ర కర్తవ్యమని విశిష్టాద్వైత మతస్థులు విశ్వసిస్తారు. అందుకే తమకు ఏకైకాశ్రయమైన స్వామి పాదాలను అత్యంత శ్రద్ధాభక్తులతో ఆరాధిస్తారు. స్వామి శ్రీచరణాల ప్రశస్తిని కీర్తిస్తూ అన్నమయ్య ఎన్నో పదాలు రచించాడు. ఒక కీర్తనలో వివిధావతారాలలో ఆ పాదారవిందాలకు సంబంధించిన గాథలను ప్రస్తావించాడు.

బ్రహ్మ కడిగిన పాదము,
బ్రహ్మము తానె నీ పాదము.

చెలగి వసుధ కొలిచిన పాదము,
బలి తల మోపిన పాదము,
తలకక గగనము తన్నిన పాదము,
బలరిపు గాచిన పాదము.

కామిని పాపము కడిగిన పాదము,
పాము తల నిడిన పాదము,

ప్రేమతో శ్రీసతి పిసికేటి పాదము,
పామిడి తురగపు పాదము

పరమయోగులకు పరిపరివిధముల
వర మొసగెడి నీ పాదము,
తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమపదము నీ పాదము

శ్రీ మహావిష్ణువు వామనుడై వసుధను కొలిచాడు. బలి గర్వ మణచి, బలరిపుడైన ఇంద్రునికి తిరిగి స్వర్గాధిపత్యం లభింపజేశాడు. రాముడై తన పాదస్పర్శ మాత్రంతో అహల్యకు పాపవిమోచనం కావించాడు కృష్ణుడై కాళీయ ఫణిఫణాగ్రముల నర్తించాడు. కల్కిగా అశ్వారూఢుడై దుష్టసంహారం చేస్తూ సంచరిస్తాడు.

వార్ధక్యంలో అన్నమయ్య ప్రశాంతంగా జీవితయాత్ర సాగించినట్లు కనిపిస్తున్నది అటు తాళ్ళపాక, ఇటు తిరుపతి, ఎక్కువగా ఈ రెండు చోట్లనే కాలక్షేపం చేస్తూ, బ్రహ్మోత్సవాల సమయంలో మాత్రం తప్పనిసరిగా వేంకటాద్రి చేరి, స్వామిసన్నిధిలో ఉండేవాడట. ఆయన ప్రగాఢభక్తిని, కవితా మాధురిని చూసి హర్షించిన అభిమానులు ఆయనకు భూములను, ధనకనకవస్తువాహనాలను విరివిగా దానంగా ఇచ్చే వారు వాటివల్ల లభించిన ఆదాయంలో అధికభాగం స్వామికి సేవలు జరిపించటానికీ, ప్రసాదాలు సమర్పించటానికీ ఆయన ధారాళంగా విని యోగించినట్లు తెలుస్తున్నది.

ఆయన మనుమడు, రేవణూరి వేంకటాచార్యులు, రచించిన **శ్రీపాదరేణు మాహాత్మ్యము, శకుంతలా పరిణయము** అనే కావ్యాలవల్ల అన్నమాచార్యులు తాను కన్యాదాతగా వర్తించి, అలర్ మేల్ మంగాదేవితో వేంకటేశ్వరస్వామికి కల్యాణోత్సవం చేయించినట్లు తెలుస్తున్నది. వెనుక ఎన్నడో పెరియాళ్వారు — విష్ణుచిత్తుడు — తన పెంపుడు కూతురు గోదాదేవిని రంగనాథస్వామికి ఇచ్చి వివాహం జరపటం వల్ల ఆయనకు వైష్ణవులలో "సాక్షాత్తు స్వామికి మామగారు" — "శ్వశుర మమర వంద్యం రంగనాథస్య సాక్షాత్" — అనే ప్రఖ్యాతి కలిగింది. వేంక

టేశ్వరస్వామికి సంబంధించి సమకాలికులలో అన్నమాచార్యులకు కూడా అటువంటి మాన్యత లభించినట్లు కనిపిస్తుంది.

నిరంతరం దైవచింతనలోనే మగ్నుడై పలువిధాల స్వామికి కైంకర్యం చేస్తూ ఉండటంవల్ల అన్నమాచార్యులకు కొన్ని దివ్యశక్తులు అలవడినవి. ప్రసన్నుడై దీవించినా, కోపగించి శపించినా, ఆయన ఆడినమాట జరిగి తీరేదట. పెదతిరుమలాచార్యులు, చినతిరువేంగళనాథుడు (చిన్నన్న), వీరిద్దరూ తమ కావ్యాలలో ఒక జీడిమామిడి చెట్టును గురించిన ఉదంతం పేర్కొన్నారు. అన్నమాచార్యులు ఒకనాడు పండ్లతో నిండి ఉన్న ఒక జీడిమామిడి చెట్టును చూసి, కంటికి ఇంపుగా కళకళ లాడు తున్న ఆ పండ్ల వన్నెకు ముచ్చటపడి, వాటిని కోసి స్వామికి నైవేద్యం పెట్టాడట తరువాత తాను ప్రసాదంగా వాటిని తిని, అవి పుల్లగా ఉన్నవని గుర్తించి, అటువంటి పండ్లను స్వామికి అర్పించినందుకు బాధ పడ్డాడు. వెంటనే ఆయన "ఇకనుంచి ఈ చెట్టుకు తియ్యని పండ్లే కాయాలి" అని అన్నాడు. ఆయన సంకల్పానుసారం నాటినుంచి ఆ చెట్టుకు తియ్యని పండ్లే కాచేవట.

మరొకప్పుడు ఒక పేద బ్రాహ్మణుడు పెండ్లి చేసుకోవటానికి తనకు తగినంత ద్రవ్యం సమకూరేటట్లు ఆశీర్వదించవలసినదని అన్న మాచార్యులను అర్థించాడట. ఆయన "అట్లే కాని"మ్మని దీవించాడు తరువాత కొన్నిక్షణాలకే ఆ దారినే పోతున్న ఒక రాజు ఆ బ్రాహ్మ ణునికి కావలసిన ధనం దానంగా ఇచ్చాడట. ఆనోట, ఈనోట ఈ కథలు ప్రజలలో వ్యాపించటం వల్ల, తమ కష్టాలను తొలగించి, శుభాలు కలిగేటట్లు ఆశీర్వదించవలసినదని అర్థించే జనులు అనుదినం ఆయన దగ్గరకు రావటం ఆరంభమయిందట.

అన్నమాచార్యుల వార్థక్యదశలో కర్ణాటక దేశానికి చెందిన సుప్ర సిద్ధ భక్తకవి పురందరదాసు ఆయనను దర్శించినట్లు చిన్నన్న కావ్యంవల్ల తెలుస్తున్నది. ఐతే వారు కలుసుకొన్నది తిరుపతిలోనో, హంపి-విజ యనగరంలోనో, వివరంగా తెలియదు. కాని విష్ణుభక్తాగ్రేసరులైన ఆ ఇద్దరు పదకర్తలు పరస్పరం కలుసుకో గలిగినందుకు పరమానందం చెంది, ఉభయుల కీర్తనలను గురించి ముచ్చటించుకొన్నారట వారు కలుసు

కొన్నప్పుడు పురందరదాసు చాలా చిన్నవాడై ఉంటాడు. ఆయన వ్రాసిన "శరణు శరణు సురేంద్రవందిత" అనే కీర్తన అన్నమాచార్యులు రచించిన "శరణు శరణు సురేంద్ర సన్నుత" అనే కీర్తనను పోలి ఉన్నది. అన్నమయ్య కీర్తన దక్షిణదేశంలో భజనకూటములలో విశేషప్రచారం పొందింది ఐతే పురందరదాసు కీర్తనలో అహోబల నరసింహస్వామి ప్రస్తుతి కనిపిస్తుంది. అన్నమాచార్యుల కీర్తన వేంకటేశ్వరస్వామి మహిమను వర్ణిస్తుంది

అన్నమాచార్యులు దీర్ఘాయుష్మంతుడై, స్వామి సన్నిధిలో సంకీర్తనాచార్యుడై, ఆ పదవిని చిరకాలం నిర్వహించి, తృప్తితో కాలం గడిపాడు ఆ సుదీర్ఘ జీవితకాలంలో ఆయన స్వామిపై 32,000 కీర్తనలు రచించినట్లు ఆయన వంశస్థులు వ్రాశారు. ఆయన కొడుకులు, మనుమలు ఆయన అడుగుజాడలలోనే నడుస్తూ, విష్ణుభక్తి పరులై, కావ్యాలను రచించి, కీర్తి ప్రతిష్ఠలు గడించటం ఆయనకు సంతుష్టి కలిగించింది. చినతిరుమలాచార్యులు అనే మనుమనికి ఆయన బ్రహ్మోపదేశం చేసినట్లు గ్రంథస్థమైన ఆధారం లభిస్తున్నది నిత్యం స్వామికి ఒక నూతన కీర్తనను సమర్పించే దీక్షను తన కుమారుడు పెదతిరుమలాచార్యులకు అప్పగించి, అన్నమాచార్యులు తన జీవితం సార్థకమైనదనే సంతృప్తితో 1503 ఫిబ్రవరి 23నాడు పరమపదించినట్లు ఒక తామ్రశాసనం వల్ల మనకు నిశ్చయంగా తెలుస్తున్నది.

నటనలతో, నిరర్థక ఘటనలతో నిండిన మానవజీవితం ఒక నాటకం వంటిదని అన్నమాచార్యులు భావించాడు.[16] శ్రీ విష్ణు నిత్యనివాసమైన పరమపదం చేరటమే జీవితానికి ఏకైకలక్ష్యం అనే అచంచల విశ్వాసంతో ఆయన జీవించాడు ఆ విశ్వాసాన్ని ఆయన ఒక కీర్తనలో స్పష్టంగా వ్యక్తం చేశాడు.

నానాటి బ్రదుకు నాటకము,
కానక కన్నది కైవల్యము

పుట్టుటయు నిజము, పోవుటయు నిజము,
నట్ట నడిమి పని నాటకము;

ఎట్టు నెదుట గలదీ ప్రపంచము,
కట్ట కడపటిది కైవల్యము.

కుడిచే దన్నము, కోక చుట్టెడిది,
నడమంత్రపు పని నాటకము,
ఒడి గట్టుకొనిన ఉభయకర్మములు
గడి దాటినపుడే కైవల్యము

తెగదు పాపము, తీరదు పుణ్యము,
నగి నగి కాలము నాటకము;
ఎగువనె శ్రీ వేంకటేశ్వరు డేలిక,
గగనము మీదిది కైవల్యము

ఈ జగన్నాటకంలో అన్నమాచార్యులు తన పాత్రను అత్యంత నైపుణ్యంతో నిర్వహించి, ఆట ముగియగానే, పూర్తి సంతృప్తితో రంగం మీది నుంచి నిష్క్రమించాడని మనం నిశ్చయంగా భావించవచ్చును

# 3

# పూజాప్రసూనాలు

తమ జీవితాలను శాసించే దివ్యశక్తులను ప్రసన్నం చేసుకోవటానికి మానవులు చేసిన ప్రార్థనలలో అత్యంత ప్రాచీనమైనవి ఋగ్వేదంలోని స్తోత్రాలే అని అభిజ్ఞు లంటారు. తన్మయస్థితిలో వారు ఆశువుగా ఉచ్ఛ రించిన పలుకులవి. ఆ ఋక్కులను రాగయుక్తంగా గానం చేస్తే దేవత లకు మరింత ప్రీతి కలుగుతుందని భావించి, వారు వాటికి స్వరకల్పన చేయటంతో సామవేదం అవతరించింది. దాని నుండి బ్రహ్మ కళాత్మక మైన సంగీత శాస్త్రాన్ని రూపొందించాడని భరతముని నాట్యశాస్త్రంలో వ్రాశాడు. మానవ సమాజంలో నాగరకతా రేఖలు పొడసూపిన తొలినాళ్ళ నుండి సంగీతానికి భక్తిని ఉద్దీపింపజేసే శక్తి కలదని జనులు గుర్తించారు. కృష్ణుడు భగవద్గీతలో "వేదానాం సామవేదోఽస్మి"[17] అని, అంటే, వేదాలలో సామవేదం తానని, ప్రకటించటంకూడా సంగీతప్రాధాన్యాన్ని నిరూపిస్తున్నది.

అందువల్ల భాగవతపురాణంలో[18] ప్రహ్లాదచరిత్ర ఘట్టంలో ప్రస్తా వనకు వచ్చిన నవవిధ భక్తులలో విష్ణుకీర్తనం కూడా ఒకటి కావటం సహజమే. నిజానికి భక్తిమార్గ విశిష్టతను చాటిచెప్పటానికే ఏర్పడిన ఆ ఉద్గ్రంథం "కలియుగం దోషాలతో కూడినదైనా, దానికి ఒక సుగుణం ఉన్నది, ఈ యుగంలో మనుష్యులు కేవలం శ్రీకృష్ణుని మహాత్మ్యాన్ని కీర్తించటంచేతనే పరమపదం పొందగలరు" అని ఉద్ఘాటిస్తున్నది.[19] భక్తి ఒక ఉద్యమంగా సాగి, భాగవతసంప్రదాయం రూపొందటంవల్ల హరి

కీర్తనం దేశంలో దశదిశల వ్యాపించింది. దక్షిణదేశంలోని విష్ణుమందిరా లలో ఆళ్వారుల తమిళ పాశురాలు నిత్యం పఠించే సంప్రదాయం ఏర్పడటం వల్ల ఆ ప్రాంతానికి చెందిన ఇతర భాషలలో కూడా కవులు అటువంటి కీర్తనలు రచించటానికి ప్రేరణ కలిగినట్లు కనిపిస్తున్నది. ఉదాహరణా నికి, కర్ణాటకదేశంలో శ్రీరంగపట్టణంలోని విష్ణ్వాలయంలో ఆళ్వారుల పాశురాలను వినటంవల్లనే భక్తకవి శ్రీపాదరాయలు కన్నడభాషలో అటువంటి కీర్తనలు రచించినట్లు తెలుస్తున్నది ఆళ్వారుల పాశురాల తోనూ, శ్రీపాదరాయల గీతాలతోనూ పరిచయం ఉన్న అన్నమయ్య తెలుగుభాషలో ప్రథమ వాగ్గేయకారు డయ్యాడు

పాటకు వాక్కును, గేయాన్ని సమకూర్చగలవాడు 'వాగ్గేయకారు' డని శార్ఙదేవుడు **సంగీత రత్నాకరంలో** నిర్వచించాడు అతడు కవిగా పాటలోని మాటలను కూర్చి, సంగీతశాస్త్రవేత్తగా ఆ మాటలకు స్వర కల్పన కూడా చేస్తాడన్నమాట అందుకే అతనిని 'ఉభయకారు'డని కూడా అంటారు. తెలుగులో 'బయకారుడు' అనేమాట దీనినుంచి ఏర్ప డినదే అన్నమాచార్యులు వేలసంఖ్యలో కీర్తనలు వ్రాయటమే కాదు, కీర్తనల స్వరూపాన్ని వివరిస్తూ సంస్కృతంలో **సంకీర్తన లక్షణమ్** అనే శాస్త్రగ్రంథాన్ని కూడా రచించాడు. ఆ విధంగా కీర్తనలకు లక్ష్యాన్ని, లక్షణాన్ని తానే ప్రసాదించి, తరువాత ఎన్నో తరాల గేయకర్తలకు ఆయన మార్గదర్శకు డయ్యాడు.

అన్నమాచార్యులు 32,000 కీర్తనలు రచించినట్లు చిన్నన్న తన కావ్యంలో స్పష్టంగా వ్రాశాడు. ఆ సంఖ్య స్థూలదృష్టికి అతిశయోక్తిగా కనిపిస్తుంది కాని, ఆ మాట సత్యదూరమని సందేహించ నక్కరలేదు. ఎందుచేతనంటే, పెదతిరుమలాచార్యుల నాటి ఒక తామ్రశాసనంవల్ల 16 ఏండ్ల ప్రాయంలో అన్నమయ్యకు ఇష్టదైవం వేంకటేశ్వరస్వామి ప్రత్యక్షమైనాడనీ, నాటినుంచి ఆయన స్వామికి నిత్యం ఒక నూతన కీర్తనమైనా అర్పించాలనే నియమం ఏర్పరచుకొన్నాడనీ తెలుస్తున్నది. ఆ సంఘటన జరిగిన తరువాత ఆయన దాదాపు 80 ఏండ్లు జీవించాడు. తిరుపతి కొండమీది స్వామి ఆలయం అనేక పూజలకు, సేవలకు, ఉత్సవాలకు, ఊరేగింపులకు ప్రసిద్ధి చెందిన క్షేత్రం. పండుగనాళ్లలో

ద్వారాలకు శుభసూచకంగా మామిడి ఆకు తోరణాలు కట్టుకోవటం తెలుగువారి ఆచారం. తిరుపతి క్షేత్రానికి "నిత్యకల్యాణం, పచ్చ తోరణం" అనే ప్రఖ్యాతి ఆ ఆలయంలో జరిగే నిత్యోత్సవాలవల్లనే వచ్చింది. అన్నమాచార్యులు తిరుపతి కొండమీద ఉండటం తట స్థించినప్పుడు, ఆలయంలో స్వామికి జరిగే వివిధ సేవలలో ఆయన పాల్గొనేవాడు. వాటిని రసవంతంగా వర్ణిస్తూ ఆయన అనేక కీర్తనలు వ్రాశాడు. ఏటా బ్రహ్మోత్సవాలు జరిగేటప్పుడు విధిగా ఆయన కొండ మీదికి చేరి, ఆ ఉత్సవాలలో పాల్గొనేవాడని చిన్నన్న వ్రాశాడు. ఆ ఉత్సవాల సందర్భంగా వివిధవాహనాలపై జరిగే ఊరేగింపులను వివ రంగా వర్ణిస్తూ ఆయన వ్రాసిన కీర్తనలు అనేకం ఉన్నవి. అంతేకాదు, అప్పుడప్పుడు అహోబలం, హంపి-విజయనగరం వంటి ఇతర ప్రాంతాలకు వెళ్ళటం తటస్థించినప్పుడు, దారిలో ఉన్న విష్ణ్వాలయాలలో ప్రతిష్ఠితు లైన దేవతలను స్తుతిస్తూ ఆయన ఎన్నో కీర్తనలు వ్రాశాడు. వాటిలో చివరమాత్రం ఆ దేవతలకు వేంకటేశ్వరస్వామితో తాదాత్మ్యం కల్పిస్తూ స్వామినే సంబోధిస్తూ ముగించే వాడు. ఈ అంశాలన్నీ గమనిస్తే, స్వామి ఆస్థానంలో సంకీర్తనాచార్యుడైన ఆ పరమభాగవతుడు తన సుదీర్ఘ జీవితకాలంలో అప్పుడప్పుడు రోజుకు ఒకటి కంటె ఎక్కువగానే కీర్తనలు రచించి ఉంటాడని భావించటానికి అభ్యంతరం ఉండకూడదు.

ఆయన కుమారుడు పెదతిరుమలాచార్యులు స్వయంగా పదకర్త. తన తండ్రిగారు వ్రాసిన కీర్తనల విలువను చక్కగా గ్రహించినవాడు. కనుక ఆ అమూల్యకీర్తనలను రాగిరేకులపై చెక్కించి, కొండమీద స్వామి ఆలయ ప్రాకారంలోనే "సంకీర్తన భండాగారం" అనే అరలో భద్ర పరిచాడు. అక్కడ దొరికిన శాసనాలవల్ల ఆయన ఆ రాగిరేకుల రక్షణకు, ప్రత్యేక సందర్భాలలో ఆలయంలో ఆ కీర్తనల గానానికి, తగిన నిధులనుకూడా సమకూర్చినట్లు తెలుస్తున్నది.

తాళపత్రాలపై వ్రాసిన కావ్యాలు శిథిలమైపోయే ప్రమాదం ఉన్నది గనుక, వాటిని భద్రపరచటానికి రాగిరేకులమీద చెక్కించే ఆచారం తెలుగు సాహిత్యానికి సంబంధించినంతవరకు తాళ్ళపాక కవుల రచనలకు మాత్రమే పరిమితమయింది. యావద్భారతదేశంలో కూడా ఇది అరు

దైన వ్యవహారమే ప్రాచీనకాలంలో కొన్ని బౌద్ధమతగ్రంథాలను, వేదాలకు సాయనాచార్యులు రచించిన భాష్యాన్ని మాత్రం ఈ విధంగా తామ్రపత్రాలపై చెక్కించినట్లు[20] తెలుస్తున్నది అది అధికవ్యయ ప్రయాసలతో కూడిన పని పెదతిరుమలాచార్యులకు విజయనగర సామ్రాజ్యాధిపతి అచ్యుత దేవరాయల అండదండలు ఉండటం వల్ల, కావలసిన ధనం చేకూరి, ఈ ప్రయత్నం సాధ్యమయింది.

అన్నమాచార్యుల కీర్తనలకు రెండు శతాబ్దాలపాటు విశేషప్రజాదరణం లభించినట్లు భావించటానికి ఆధారాలున్నవి. అప్పుడు వాటిని తిరుపతిలో స్వామి దేవాలయంలో గానం చేస్తూ ఉండేవారు. అంతే కాదు, దక్షిణదేశంలో పుదుక్కోట వంటి దూరప్రదేశాలలో కూడా భజనకూటములలో ఆ కీర్తనలను పాడేవారని తెలుస్తున్నది కాని మనకు నేడు తెలియరాని ఏ కారణంవల్లనో అవి క్రమంగా వాడుకలో లేకుండా, మరుగున పడిపోయినవి. చివరకు ఆ కీర్తనలు రచించిన కవి పేరు కూడా ప్రజలు మరచిపోయే స్థితి వచ్చింది ఆంధ్రదేశంలో ఆనాటి పండితులు వ్యావహారికభాషలో ఉన్న పాటలు తాము గుర్తించదగినవి కావని చిన్నచూపు చూడటంకూడా అందుకు ఒక కారణం కావచ్చును.

కొండమీద అన్నమాచార్యుల కీర్తనలు చెక్కిన రాగిరేకులు ఒక అరలో ఉన్న సంగతికూడా కొంతకాలం ప్రజలు మరచిపోయారు. దాదాపు 300 ఏండ్ల తరువాత, 19వ శతాబ్దంలో, మనదేశంలో ఉద్యోగం చేసిన ఒక బ్రిటిష్ ప్రభుత్వాధికారి వ్రాతలో వాటి ప్రస్తావన మనకు కనిపిస్తుంది. తెలుగుభాషకు ఇంగ్లీషులో ఒక వ్యాకరణ గ్రంథం రచించి, దానిని మదరాసునుంచి 1816లో అచ్చువేయిస్తూ, ఏ. డి. కాంబెల్ ఆ పుస్తక పీఠికలో, "పవిత్రమైన తిరుపతి కొండమీద ఉన్న ఆలయంలో ఒక బ్రాహ్మణ కుటుంబం వారి భక్తిశ్రద్ధలవల్ల కొన్ని వేల రాగిరేకులమీద ఎన్నో పద్యకావ్యాలు భద్రపరచబడి ఉన్నవని విని, వాటిని పరిశీలించటానికి నేను ఈ దేశస్థుడిని ఒకరిని అక్కడికి పంపాను. ఒక్క వ్యాకరణ గ్రంథం తప్ప — దానికి ఒక నకలుప్రతిని వ్రాయించటం జరిగింది — మిగిలినవన్నీ ఆ దైవాన్ని స్తుతిస్తూ వ్రాసిన అసంఖ్యాక కీర్తనలని తెలిసింది" అని వ్రాశాడు.[21]

తరువాత నూరేండ్లకు తిరుమల-తిరుపతి దేవస్థానములవారు ఆ రాగిరేకులను స్వాధీనం చేసుకొని, ఆ పాటలకు నకళ్ళు వ్రాయించి, సమర్థులైన పండితులతో పరిష్కరింపజేసి సంపుటాలలో ప్రకటించటం ప్రారంభించారు. మధ్యమధ్య కొన్ని అంకెలున్న రాగిరేకులు లభించటంలేదని, అన్నమాచార్యుల కీర్తనలలో ప్రస్తుతం ఉన్నవి 14,358 మాత్రమే[22] అని, అంటే, ఆయన కీర్తనలలో సగానికి పైగా పోయినవని, విద్వాంసులు గుర్తించారు. 19వ శతాబ్దంలో వాటి జాడ తెలిసిన తరువాత ఆ రేకులు ఒక సంస్థ నుంచి మరొక సంస్థకు అప్పగించే సందర్భంలో ఏ దశలోనో సగానికి పైగా కీర్తనలున్న రేకులు పోయినవని ఊహించవలసి ఉంటుంది.

అన్నమాచార్యుల కీర్తనలు స్థూలంగా శృంగారకీర్తనలు, అధ్యాత్మ కీర్తనలు అని రెండు వర్గాలకు చెందినవి. "సంకీర్తన" అనే పదం రాగిరేకులన్నిటిమీద కనిపిస్తున్నది గనుక, పేరు ఏదైనా, ఆ కీర్తనలన్నిటికీ భక్తియే మూలాధారమని స్పష్టమవుతున్నది "కీర్తన", "సంకీర్తన" అనే మాటలు దైవాన్ని గాని, ఋషులను గాని, భక్తులను గాని స్తుతించే గీతాలకే వర్తిస్తాయి. కీర్తనలు సాహిత్య ప్రధానమైనవి కావటం వల్ల, వాటిలో సంగీతం సరళంగా ఉంటుంది. ఎందుకంటే, ఈ కీర్తనలలో నాదం కంటె భావం ప్రధానం. ఐతే వీటిలో భావాల పరిధి అతి విస్తృతమైనది. దైవంపట్ల ప్రగాఢమైన భక్తి మాత్రమే కాదు, మనుష్యులు సాధించే లౌకిక ఘనకార్యాల నిరర్థకత, వ్యర్థమవుతున్న కాలగతి, శరణాగతి ఆవశ్యకత వంటి ప్రబోధాత్మకమైన ఇతివృత్తాలు వీటిలో కనిపిస్తాయి.

పరమాత్మతో అనుసంధానానికి జీవాత్మ చూపే ఔత్సుక్యాన్ని బృందావనంలో కృష్ణునితో వ్రజభామినులు సాగించిన ప్రేమలీలా రూపంలో భాగవత పురాణం చిత్రించిన నాటినుంచి భారతీయ సాహిత్యంలో ఆధ్యాత్మిక శృంగారం రూపొందింది. గోవులను పాలించేవాడు కనుక కృష్ణుడు "గోపాలు" డంటారు. అంటే ఇక్కడ పరమాత్ముని‌లో లీనం కావటానికి తపించే జీవులను గోవులుగా సాంకేతికంగా వర్ణించటం జరిగినదన్నమాట. "కర్షతీతి కృష్ణః" - సమస్త జీవులను ఆకర్షించేవాడు కృష్ణుడు. గోవులు, గోపికలు జీవులకు ప్రతీకలే. గోపికలలో ప్రధానస్థానం రాధాదేవికి లభిం

చింది. భాగవతంలో ఆమె పేరు కనిపించదు. కాని గోపికలతో కృష్ణుడు సాగించిన ప్రేమకలాప వర్ణనలో ఉన్న కొన్ని సూచనలను బట్టి వారిలో ఒక గోపిక కృష్ణునికి ప్రియతమసఖి అని తెలుస్తుంది.

భాగవతపురాణంలోని రాసపంచాధ్యాయిలో కనిపించే ఈ సూచనలను తమ భావనా బలంతో పెంచి, కవులు రాధాకృష్ణుల ప్రణయలీలలను రమణీయంగా వర్ణిస్తూ అసంఖ్యాకంగా కావ్యాలు రచించారు. వైష్ణవ సంప్రదాయానికి చెందిన ఆలంకారికులు ఆధ్యాత్మిక స్పర్శతో పునీతమైన శృంగారాన్ని "మధుర రసం" అని వ్యవహరిస్తారు. రాధామాధవుల రహః కేళిలో ద్యోతమయ్యేది ఈ మధుర రసమే వారి అనురాగంలోని విశిష్టతను వివరిస్తూ శ్రీ అరవిందుడు, "జీవాత్మ దైవాన్ని పొందటానికి చూపే ఆకాంక్షకు రాధాకృష్ణుల రమ్యప్రణయం ఒక సంకేతం. ప్రకృతి, పురుషుల సంయోగాన్ని ఆ ప్రణయగాథ సూచిస్తుంది. ఆ అలౌకిక సౌందర్యానికి పూర్తిగా వశమై, జగమంతటినీ సమ్మోహింపజేసే మధురవంశీనాదానికి స్పందించి, ఇల్లు, వాకిలి, కర్తవ్యం, బాధ్యత, అన్నీ విస్మరించి, ప్రణయోద్వేగంలో తటస్థమయ్యే పూర్వరాగం, వియోగవ్యథ, ప్రగాఢవాంఛ, పునస్సమాగమం వంటి దశలతో, దైవం పట్ల మానవ హృదయంలో పొంగి పొరలే ప్రేమకు రాధామాధవుల ప్రణయలీల ఒక సంకేతం" అని వ్యాఖ్యానించాడు.[23]

ఇట్టి చిత్రణంలో కామం ప్రేమగా పరిణామం చెందుతుంది. తీవ్రమైన శారీరకవాంఛ ప్రగాఢమైన ఆధ్యాత్మికకాంక్షగా రూపొందుతుంది "దైవం పట్ల జీవుని ప్రేమను ఈ విధంగా సాంకేతికంగా చిత్రించినప్పుడు కామవాంఛను వర్ణించే భాషలో దానిని వ్యక్తం చేయటం జరుగుతుంది. ఎందుచేతనంటే, లౌకిక ప్రణయం జీవాత్మ, పరమాత్మల సంయోగానికి ప్రతీక కనుక," అని సుశీల్ కుమార్ డే[24] వివరించాడు భక్తి, శృంగారం, సౌందర్యానుభూతి — ఈ మూడింటి సమ్మేళనం వల్ల రసబంధురమైన కావ్యాల సృష్టి జరిగి, సాహిత్యం వర్ధిల్లుతుంది.

కావ్యాలలోని రసాలను గురించి చేసిన విపులచర్చలో భారతీయాలంకారికులు కూడా శృంగారరసానికే అగ్రస్థానం ఇచ్చారు. శృంగారపరంగా నాయికా నాయకులను వివిధవర్గాలుగా విభజించారు. మానసికస్థితిని

బట్టి నాట్యశాస్త్రం అష్టవిధ నాయికలను వర్ణించింది. భర్తను పూర్తిగా వశం చేసుకొన్న నాయిక స్వాధీన పతిక; శయ్యను, శయ్యాగృహాన్ని సొగసుగా అలంకరించి, ప్రియుని రాకకై ఎదురుచూసే నాయిక వాసక సజ్జిక; ప్రియుడు వంచన చేసి తన దగ్గరకు రానందున వియోగ వేదనతో తపించే నాయిక విరహోత్కంఠిత; అన్యస్త్రీ దగ్గరకు పోయి బుద్ధి పూర్వకంగా తనను మోసపుచ్చినందుకు కుమిలే నాయిక విప్ర లబ్ధ; పరస్త్రీతో కాలం గడిపి వచ్చిన చిహ్నాలు భర్తలో కనిపించగా ఆగ్రహించిననాయిక ఖండిత; భర్తతో సాగిన వివాదంలో ఏమాత్రం మెత్తబడక, భర్తకు దూరమైన నాయిక కలహాంతరిత; విదేశాలకు వెళ్ళిన భర్త రాకకై తపించే నాయిక ప్రోషితభర్తృక, సంకేతస్థానంలో ప్రియుని చేరటానికి వెళ్ళే నాయిక అభిసారిక.

అన్నమాచార్యులు అలంకారశాస్త్రంలో వర్ణితమైన వివిధ నాయికా లక్షణాలను, జయదేవుని గీతగోవిందం[25] లో చిత్రితమైన రాధా కృష్ణుల ప్రేమకలాపస్వరూపాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన వాడు ఆయన రచించిన శృంగారకీర్తనలలో వివిధావస్థలలో ఉన్న అష్టవిధనాయి కల వర్ణన మనకు కనిపిస్తుంది ఒక్కొక్క నాయికకు అనేక కీర్తనలలో ఉదాహరణాలను చూడవచ్చును. ఆయన సృష్టించిన సాహిత్యం అంత విస్తృతమైనది. అంతేకాదు, ప్రాచీనాలంకారికులు నిర్వచించి, పూర్వ కవులు చిత్రించిన అష్టవిధనాయికలతోపాటు, వారు చేరిన అవధులను దాటి, ఇంకా భిన్నమైన మానసికస్థితులలో ఉన్న నాయికలను కూడా అన్నమయ్య వర్ణించాడు.

ఆయన భావన ఎంత ఉజ్జ్వలమైన దంటే, సాంప్రదాయిక కవి సమయాలను, అలంకారాలను ప్రయోగిస్తున్నప్పుడు కూడా, ఒక పాత్ర శీలాన్ని ఆవిష్కరించటంలో కాని, సన్నివేశాన్ని వర్ణించటంలో కాని, ఆయన నవ్యాతి నవ్యమార్గాలను అనుసరించాడు.

అతివ జవ్వనము రాయలకు వెట్టని కోట,
పతి మదనసుఖరాజ్యభారంబు నిలువ.

కాంత కనుచూపు మేఘంబు లోపలి మెఱుగు,
కాంతుని మనంబు చీకటి వావను;
ఇంతి చక్కని వదన మిందుబింబము, విభుని
వంత కనుదోయి కలువల చొక్కజేయ.

అలివేణి ధమ్మిల్ల మంధకారపు భూమి,
కలికి రమణునకు నేకత మొనగను;
పొలతి బాహువులు పూవుదీగెల కొనలు,
పొలసి ప్రాణేశు వలపుల లతల బెనచ.

పంకజానన రూపు బంగారులో నిగ్గు,
వేంకటేశ్వరు సిరులు వెదజల్లగా;
చిలక చూపుల చెలియ చేత మదనుని చేత,
ఇంకా నతనినె మోహింపజేయగను

ఈ కీర్తనలోని ఉపమానాలు, కవిసమయాలు చిరకాలంగా కావ్యాలలో కనిపిస్తున్నవే. ఉదాహరణానికి, నాయిక ముఖం చంద్రబింబంవలె గుండ్రంగా ఉన్నది చల్లని కాంతితో ప్రకాశిస్తూ, దర్శనీయంగా ఉన్నది. నాయకుని కండ్లు కలువరేకులవలె దీర్ఘంగా, విశాలంగా ఉన్నవి. చంద్రోదయానికీ, కలువ పువ్వులు వికసించటానికీ ఉన్న సంబంధం కూడా సుప్రసిద్ధమైన కవిసమయమే. ఈ సంప్రదాయాన్ని ఆలంబంగా చేసుకొని, కలువరేకుల వంటి స్వామి కనుదోయిని ఇందుబింబం వంటి కాంత వదనం వికసింప జేస్తున్నదని అన్నమయ్య అతిరమ్యంగా వర్ణించాడు. పైగా, భగవంతునికి కూడా అప్పుడప్పుడు దిగులుగా ఉంటుందట అట్టి సందర్భాలలో ఆయన మనస్సును ఆవరించిన చీకట్లు ప్రేయసి కనుచూపులోని కాంతివల్ల తొలగిపోతాయుట! శారీరక వాంఛాచిహ్నాలు అక్కడక్కడ రేఖామాత్రంగా సూచితం కాకపోలేదు, కాని వారు దివ్య దంపతులనే పరమసత్యం మనం క్షణం పాటైనా విస్మరించటానికి అవకాశం కూడా లేదు.

తెలుగులో భక్తిని శృంగారంతో జోడించిన పదకర్తలలో ఆద్యుడు అన్నమాచార్యులే. తరువాత ఆ సాహిత్యప్రక్రియను చేపట్టినవారు

ఆయన కళాకౌశలాన్ని అనుసరించినవారే కాని అతిక్రమించినవారు కారు. అన్నమాచార్యుల సాహిత్య సృష్టి అతివిస్తృతమైనది కావటం వల్ల, దానిలో కనిపించే వైవిధ్యం కూడా అసామాన్య మైనదే. లౌకిక, పారలౌకిక ప్రేమానుబంధాలను ఆయన అతిమనోహరంగా చిత్రించాడు. గాఢమైన వాంఛనుగాని, దుర్భరమైన విరహవేదననుగాని, ప్రేమ సఫల మైనప్పుడు కలిగే ఆనందాతిరేకాన్ని గాని ఆయన కమనీయపదచిత్రాలలో వ్యక్తం చేస్తాడు. అవి ఒక్కొక్కప్పుడు అపూర్వసుందరంగా, సాంప్రదాయిక భావనకు భిన్నంగా ఉంటాయి. ఆయన వ్రాసిన ఒక ఏలపాటలో ఈ లక్షణం స్పష్టంగా కనిపిస్తుంది. మొదట నాయిక అనుభవించిన విరహాన్ని, తరువాత నాయకసమాగమం వల్ల పొందిన ఆనందాన్ని రమ్యమైన పదచిత్రపరంపరతో ఆయన ఆపాటలో అభివ్యక్తం చేశాడు.

*మేడలెక్కి, నిన్ను జూచి,*
*కూడేననే యాసతోడ*
*వాడుదేరి ఉస్సురందురా! వేంకటేశ!*
*యాడ నుంటి విందాకనురా!*

*బొండుమల్లె పానుపుపై*
*నుండి నిన్ను పాడి, పాడి,*
*నిండు జాగరము లుంటిరా! వేంకటేశ!*
*ఎండలాయె వెన్నెలలురా!*

*పిక్కటిల్లు చన్నులపై*
*చొక్కపు నీ ఉంగరము*
*గక్కన నే నద్దుకొందురా! వేంకటేశ!*
*లక్క వలె ముద్ర లంటెరా!*

*దప్పిగొంటివని నీకు*
*కప్పురము పార మిచ్చి,*
*ముప్పిరి నీ విరహానను వేంకటేశ!*
*నిప్పనుచు భ్రమసితిరా!*

నిండ బూచిన మావిపై
గండుగోవిల కూయగా,
నిండిన నీ యెలుగంటాను, వేంకటేశ!
అండకు నిన్ను రమ్మంటిరా!

మిన్నక కేళాకూళిలో
ఉన్న తమ్మివిరులు[26] నీ
కన్ను లంటా చేరబోగాను, వేంకటేశ!
పన్ని మరు నమ్ము లాయెరా!

ఆనిన తుమ్మెదలు నీ
మేనికాంతి బోలునని
పూని చేతబట్టబోగాను, వేంకటేశ!
సూనాస్త్రుని వేగు లాయెరా!

మల్లె పూవు కొన దాకి,
ఝల్లునను పులకించి,
ఉల్లము నీ కొప్పించితిరా! వేంకటేశ!
కల్ల గాదు, మమ్ముగావరా!

జోడు గూడి నీవు, నేను
నాడుకొన్న మాటలెల్లా
గోడ లేని చిత్తరువులై వేంకటేశ!
యాడ నా మతి బాయవురా!

పావురము రెక్కచీటి
నీ వొద్దికి గట్టి యంపి,
దేవరకే మొక్కుకొందురా! వేంకటేశ!
నీ విందు రావలె నంటాను.

ముమ్మాటికి నీ బాసలే
నమ్మి వున్న దాన నేను,

కుమ్మరించరా నీ కరుణ, వేంకటేశ!
చిమ్ము చీకటెల్ల బాయను.

ఉన్నతి శ్రీవేంకటేశ!
మన్నించి కూడితి విదే!
నన్ను నెంత మెచ్చు మెచ్చేవు! వేంకటేశ!
కన్నులు పండువులాయెరా!

ప్రియవియోగం వల్ల దుర్భర విరహవేదన పాలైన నాయిక భారతీయ సాహిత్యంలో సుపరిచిత పాత్రయే అప్పటి ఆమె రూపాన్ని, వర్ణనను పురస్కరించుకొని కొన్ని భావనలు వ్యవహారసిద్ధమైనవి. ఆమె తాపం ఎంత గాఢమైనదంటే, పండు వెన్నెల, మలయమారుతం కూడా ఆమెకు బాధ కలిగిస్తాయి. ఆమె దూషణకు అధికంగా గురి అయ్యేది పుష్పబాణాలతో ఆమెను వేధించే మన్మథుడు. ఏవిధంగా చూసినా ఆమె లౌకికవాంఛలతో కుమిలిపోయే ప్రాకృతజీవిగానే కనిపిస్తుంది గనుక ఆమెను పూజ్యురాలుగా చిత్రించటం కష్టం. కాని అన్నమాచార్యుల వంటి కవిసత్తముడు ఆమెను పాశవికవాంఛల స్థాయినుంచి ఉద్ధరించి, చిరకాలసాధన చేసిన యోగినీలక్షణాలను ఆమెకు ఆపాదించి, ఆమెలో ఆధ్యాత్మిక పరిణతిని ప్రదర్శించగలడు.

ఇది గాక సౌభాగ్య, మిది గాక తపము మఱి,
యిది గాక వైభవం బిక నొకటి గలదా?

అతివ జన్మము సఫలమై పరమయోగివలె
నితర మోహాపేక్ష లిన్నియును విడిచె;
సతి కోరికలు మహాశాంతమై యిదె చూడ
సతత విజ్ఞానవాసన వోలె నుండె.

తరుణి హృదయము కృతార్థత బొంది, విభుమీది
పరవశానంద సంపదకు నిరవాయె;
సరసిజానన మనోజయ మంది, యింతలో
సరి లేక మనసు నిశ్చలభావ మాయె.

శ్రీ వేంకటేశ్వరుని జింతించి, పరతత్త్వ
భావంబు నిజముగా బెట్టి జెలి యాత్మ,
దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు తిరమాయె

విరహిణులు అనుభవించే అవస్థ లేవీ ఈ కీర్తనలో ప్రస్తావితం కాలేదు గనుక ఇది అటువంటి నాయిక వర్ణన అని గుర్తించటం కష్టం అందుకు విరుద్ధంగా ఆమె సదా విభుని ధ్యానిస్తూ ఉండటం వల్ల, ఆధ్యాత్మికసాధన లన్నిటికీ లక్ష్యమైన యోగసిద్ధి పొందినట్లు ఆయన చిత్రించాడు.

నాయిక పూర్తిగా తన్మయస్థితిలో ఉన్నట్లు వర్ణించిన మరొక కీర్తనలో మాత్రం ఆమె విరహిణి అని అన్నమాచార్యులు కంఠోక్తిగా తెలిపాడు.

నిన్ను బాసిన యట్లు నెలతకు వియోగదశ
లెన్నడును దోప విదియేమొ కాని.

నిను దలచి లలితాంగి నీరూప మాత్మలో
గని, నీవు నవి బయలు కౌగిలించినది,
తనర నాకాశతత్త్వము నీ మహత్వమని
వనిత యెవ్వరి చేత వినెనో కాని

నిను బొగడ, నీరూపు కనుదోయి కెదురైన
తనివి తీరక బయలు తగ జూడ దొడగె,
మునుకొన్న సర్వతోముఖుడ వనగా నిన్ను
వెనకకే భావమున వినెనొ కాని

తలపునను, వాక్కునను తలవదలపగ నీవు
కలసి యా కమలాక్షి గొగిలించితివి,
తెలిసితిమి వేంకటాధిపతి నీ విన్నింట
గలవనెడి మాట నిక్కంబులో కాని

ప్రియుని ఎడబాటును అనుభవిస్తున్న నాయిక మానసికస్థితిని వర్ణి

స్తున్నది కనుక దీనిని శృంగారకీర్తనగా వర్గీకరించటం జరిగింది కాని, వాస్తవానికి ఇది ఆధ్యాత్మిక క్రమవికాసగతిలో మహోన్నతస్థితిని చేరుకొన్న భక్తురాలి వర్తనను చిత్రిస్తున్నది. ఇటువంటి పదాలలో శృంగారానికీ, ఆధ్యాత్మిక భావనకూ మధ్య, లౌకికశృంగారానికీ, భక్తి పారవశ్యానికీ మధ్య, ఉండే అంతరాలు అంతర్హితమై పోవటం కనిపిస్తుంది మరొక సంగతి కూడా గమనించవలసి ఉన్నది. నడకలో జానపదగీతాల సరళిలో, పూర్వం తమిళభాషలో ఆళ్వారులవలె, అన్నమాచార్యులు బాలకృష్ణుని చిలిపిచేష్టలను వర్ణిస్తూ వ్రాసిన గీతాలను కూడా రాగిరేకులలో శృంగార సంకీర్తనలుగానే వర్గీకరించారు

ఆయన ఆధ్యాత్మిక సంకీర్తనల పరిధి సహజంగానే అతివిస్తృత మైనది విష్ణు పారమ్యం, శరణాగతి మహత్వం, లౌకిక విజయాల సారహీనత, భక్తిపరుల ధన్యజీవనం, జాతి, మత భేదాలకు అతీతంగా మనుష్యులందరినీ అనుసంధించే స్నేహబంధం వంటి ఇతివృత్తాలు ఆ సంకీర్తనలలో పునరావృతం కావటం మనకు కనిపిస్తుంది స్వామితో కవికి గల సంబంధంలోని వివిధ పరిణామాలుకూడా అద్దంలో వలె ఆపాటలలో మనకు గోచరిస్తాయి. వేంకటేశ్వరస్వామియే విశ్వమంతట వ్యాపించి ఉన్న పరమపురుషుడని అన్నమాచార్యులు గ్రహించాడు. ఆయన తన పాటలలో ఒక క్షణాన స్వామిని స్తుతిస్తాడు మరొకప్పుడు ఆ దివ్య స్వరూపాన్ని తనివి తీర వర్ణిస్తాడు; అప్పుడప్పుడు ఆయనతో కలహిస్తాడు; తిరిగి వెంటనే క్షమాపణ కోరుకొంటాడు; స్వామితో తనకు గల చనువు వల్ల ఒక్కొక్కప్పుడు ఆయనను పరిహసించటానికి కూడా వెనుదీయడు. స్వామితో ఆయనకు అంతటి సాన్నిహిత్యం ఉన్నది. ఆయన స్వామికి శరణాగతుడని స్పష్ట మవుతుంది స్వామిపై ఆయనకు గల అపారమైన అనురాగం కూడా వ్యక్త మవుతుంది. అది కేవలం బాహ్యోపచారాలకు పరిమితమైన భక్తి మాత్రమే కాదు భక్తి పరిణతి చెంది ప్రేమగా రూపొందిన స్థితి. "సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా" అని నారదమహర్షి భక్తికి చేసిన నిర్వచనం ఆ పాటలను విన్నప్పుడు పూర్తిగా మనకు అర్థమవుతుంది.

ఈశ్వరప్రాప్తికి మార్గా లనేకం విశిష్టాద్వైత మతస్థుడు కనుక

అన్నమయ్య శరణాగతియే అత్యంత సులభసాధనమని మాటిమాటికి ప్రకటిస్తాడు. ఆ మార్గంలోని సౌలభ్యం, విశ్వయుక్షమత ఆయన ఎన్నో గీతాలలో ఉద్ఘాటించాడు. ఇతర సాధనాలవల్ల కూడా గమ్యం చేర వచ్చును. కాని దీనిలో అనుభవానికి వచ్చే మాధుర్యం, ఆనందం అన్యత్ర కానరావని ఆయన విశ్వాసం.

మొదలుండ, కొనలకు మోచి నీళ్ళు వోయనేల?

ఎదలో నీ వుండగా నితరము లేల?

నిగమమార్గమున నే నడిచే నంటే,
నిగమము లెల్లను నీ మహిమే;
జగము లోకుల జూచి జరిగెదనంటే
జగములు నీ మాయ జనకములు.

మనసెల్ల నడ్డపెట్టి మట్టున నుండేనంటే,
మనసు కోరికలు నీ మతకాలు;
తనువు నింద్రియములు తగ గెలిచే నంటే
తనువు నింద్రియములు దైవమ! నీ మహిమ

ఇంతలోని పనికిగా నిందునందు జొరనేల?
చెంత నిండు చెరువుండ చెలమలేల?
వంతాన శ్రీవేంకటేశ! వట్టి నీకె శరణంటి,
సంతకూటాల ధర్మపు సంగతి నాకేల?

కరుణావరుణాలయుడైన వేంకటాచలపతి శ్రీచరణాలను ఆశ్రయించిన వివేకవంతుని భాగ్యం కూడా అన్నమాచార్యులకు అభిమానపాత్రమైన ఇతివృత్తమే. భవదావసంతప్తులైన సాటిమానవులకు ఆశాపూర్ణమైన ఈ సందేశం అందించటానికి ఆయన శరణాగతుల సౌభాగ్యాన్ని పలు కీర్తనలలో వర్ణించాడు.

దేవుడు కలవానికి దిగులు, చింతయు లేదు,
శ్రీవిభుడే అన్నిట రక్షించు గనుక.

ఏలిక గల బంటుకు ఏ విచారము లేదు;
వోలి మగడు గ లాలికి ఒప్పమి లేదు;
పోలిమి తండ్రి గల పుత్రుని కంగద లేదు;
మేలుగా పండిన భూమికి కరవు లేదు.

బలము గల రాజుకు భయమేమియు లేదు,
కలిమి గల వాని కక్కర లేదు;
ఇల నాచారవంతుని కే పాపమును లేదు;
తలపు పుణ్యము గల యాతనికి చేటు లేదు.

గురువు గలవానికి కొఱత యేమియు లేదు,
పరము గలవానికి భ్రాంతులు లేవు;
ఇరవై శ్రీవేంకటేశు డిన్నిట మాకు గలడు,
అరయ దాసులము, మా కడ్డాకే లేదు.

అన్నమాచార్యుల భావనాబలం ఆశ్చర్యకరమైనది. చిరపరిచితమైన అతి సామాన్యలౌకిక మూర్తులలో దైవశక్తిని, నిత్యజీవితంలోని సామాన్య కార్యకలాపాలలో ఆధ్యాత్మిక సంకేతాలను చూడగల చైతన్యపూర్ణమైన ప్రతిభ అది ఒక ఉదాహరణం చూస్తే ఈ సంగతి స్పష్ట మవుతుంది చీరలు నేసి, వీధుల వెంట తిరుగుతూ అమ్మే వ్యాపారులను మనం తరచుగా చూస్తూనే ఉంటాము ఒక కీర్తనలో అన్నమయ్య ఏకంగా వేంకటేశ్వరస్వామినే అటువంటి చీరల వ్యాపారిగా చిత్రించాడు. ఐతే ఆ దివ్యవణిజుడు చీరలు నేసే తీరు విలక్షణమైనది. అందుకు ఆయన వాడే ముడిసరుకు కూడా విచిత్రమైనదే.

ఇక్కడ ఒక సంగతి గమనించదగినది. అన్నమాచార్యుల స్వగ్రామం తాళ్ళపాక పరిసరాలలో చిరకాలంగా నేత పనివారు సున్నితమైన నూలు బట్టల నేతకు పేరుపొందినవారు వేంకటేశ్వరస్వామి దేవేరి అలర్ మేల్ మంగతాయారు (పద్మావతీ దేవి) తమ ఇంటి ఆడుపడుచు అని వారు చెప్పుకొంటారు కనుక స్వామి తమ బంధువని వారి విశ్వాసం. తాళ్ళ పాక ప్రాంతంలోని నేత పనివారికి తాళ్ళపాక వంశస్థులు గురువులు తమ గురువులైన తాళ్ళపాక వారికి వారు కట్నాలు, కానుకలు సమర్పిస్తూ

ఉండినట్లు పెదతిరుమలాచార్యుల నాటి నుంచి చారిత్రకాధారాలు లభిస్తున్నవి.

వాడల వాడల వెంట వాడెవో,
నీడ నుండి చీర[27] లమ్మే నేత బేహారి.

పంచభూతము లనెడి పలువన్నె నూలు
చంచలపు గంజి తోడ చరినేసి,
కొంచెపు కండెల నూలి గుణముల నేసి,
మంచి మంచి చీర లమ్మే మారు బేహారి.

మటుమాయముల దన మగువ పసిడి నీరు
చిటిపొటి యలుకల చిలికించగా,
కుటిలంపు చేతలు కుచ్చులుగా గట్టి
పటవాళి చీర లమ్మే బలు బేహారి.

మచ్చిక జీవుల పెద్ద మైల సంతల లోన
వెచ్చపు కర్మధనము విలువచేసి,
పచ్చడాలుగా కుట్టి బలు వేంకటపతి
ఇచ్చ కొలదుల అమ్మే ఇంటి బేహారి

ప్రపంచమే ఒక అంగడి. వస్తువులు కొనేవారు జీవులు ఇక్కడ పలువన్నెల వస్త్రాలను అమ్మేవాడు భగవంతుడు. సౌఖ్యాలు, అనుభవాలు అనే వస్త్రాలను ఆయన అమ్మకానికి ప్రదర్శిస్తాడు ఐతే కొనేవానికి లభించే వస్త్రాల నాణ్యత, వెల అతని పూర్వకర్మ మీద ఆధారపడి ఉంటుంది. పైగా ఇక్కడ క్రయవిక్రయాలు పూర్తిగా ఆ దివ్యవణిజుని ఇచ్ఛ ననుసరించి జరుగుతాయి ఈ విధంగా సామాన్యమైన చీరల బేహారి పాత్రలో జీవులకు గత కర్మలను బట్టి ఫలాన్ని అందించే దైవాన్ని చూడగలిగాడు అన్నమాచార్యులు ఈ సంకేతాన్ని ప్రాతిపదికగా చేసుకొని మానవజన్మకు సంబంధించిన వివిధాంశాలపై ఆయన వెలుగును ప్రసరింపజేశాడు.

కర్మఫలదాతగా లౌకికజీవులకు సుఖదుఃఖాలను సంఘటించటంలో

దైవం పూర్తిగా తాటస్థ్యం వహించి, కేవలం వ్యవహారవేత్తగా వర్తించ వచ్చును, కాని నిజభక్తులతో ఆయన అనుబంధం దానికి కొంత భిన్నంగా ఉంటుంది. చనువుగా ఒక కీర్తనలో అన్నమయ్య భక్తులతో స్వామి సాగించే వ్యవహారాలలో పైచేయి భక్తులదే అని చమత్కరిస్తాడు.

నీవే నేరవు గాని, నిన్ను వండించేము నేము,
దైవమా! నీకంటె నీ దాసులే నేర్పరులు!

వట్టి భక్తి నీమీద వలుకు వేసి నిన్ను
పట్టి తెచ్చి మదిలోన పెట్టుకొంటిమి,
పుట్టెడు తులసి[28] నీ పాదములపై పెట్టి
జట్టికొనిరి మోక్షము, జాణలు నీ దాసులు!

నీవు నిర్మించినవె నీకే సమర్పణ నేసి,
సోవల నీకృప యెల్ల చూరగొంటిమి,
భావిం చొక మ్రొక్కు మ్రొక్కి భారము నీపై వేసిరి,
పావనపు నీ దాసులే వంతపు చతురులు!

చెరువుల నీళ్ళు తెచ్చి చేరెడు నీపై చల్లి,[29]
వరము వడసితిమి వలసినట్టు;
ఇరవై శ్రీవేంకటేశ! ఇటువంటి విద్యలనే
దరి చేరి మించిరి, నీ దాసులే పో ఘనులు!

శ్రీ మహావిష్ణువు అనంత కల్యాణ గుణాలలో ఒకటి 'సౌలభ్యం' అని విశిష్టాద్వైతమతస్థులు భావిస్తారు. ఆ మతప్రవర్తకులలో అగ్రగణ్యు డైన రామానుజాచార్యులు స్వామిని "ఆశ్రితవాత్సల్యైకమహోదధే!"[30] అని సంబోధించాడు శ్లాఘనీయమైన ఈ గుణాన్ని ఒక లోపంగా చూపి, స్వామి అల్ప సంతోషియని, ఆయనలో కనిపించే ఈ లక్షణాన్ని భక్తులు తమకు అనుకూలంగా ఉపయోగించుకొని, అల్పమైన ఆరాధన తోనే అనల్పమైన ఫలాలను పొందగలుగుతున్నారని అన్నమాచార్యులు చమత్కరించాడు. స్వామికి విచక్షణ జ్ఞానం కొంత లోపించినట్లు చేసిన ఈ ఆరోపణయే ఆయనకు తన భక్తులపట్ల గల అపారకారుణ్యం, వారి

యోగక్షేమాలపట్ల గల అమితమైన ఆసక్తి అనే సద్గుణాలను భూషించ టానికి అవకాశం కలిగించింది. వంక లెన్నుతున్నట్లు కనిపిస్తూనే ప్రస్తు తించటం లక్షణమైన "వ్యాజస్తుతి" అనే అర్థాలంకారానికి ఈ కీర్తన చక్కని ఉదాహరణం.

కర్మ సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా చేసుకొని మరొక అపూర్వకీర్త నలో అన్నమాచార్యులు స్వామిని విమర్శిస్తున్నట్లు కనిపిస్తూనే మనసార స్తుతిస్తాడు. కర్మసిద్ధాంతం హిందూధర్మానికి ఆధారశిల వంటిది ఈ జన్మలో ఒక వ్యక్తి అనుభవించే సుఖదుఃఖాలకు గతజన్మలలో అతడు చేసిన పుణ్యపాపాలే కారణమని, జన్మమృత్యుపరంపరకు లోనవుతూ ఆత్మ ఎన్నో దేహాలలో వసిస్తూ ఉండగా, ఆ జీవి చేసిన సుకృతాలు కాలాంతరంలో శుభాన్నీ, దుష్కర్మలు అశుభాన్నీ సంఘటిస్తాయని ఆ సిద్ధాంతం బోధిస్తుంది కవి కర్మసిద్ధాంతాన్ని వేంకటేశ్వరస్వామికే వర్తింప జేసి, గతంలో ఆయన చేసిన పాపకృత్యాల ఫలం ఆయన అనుభవి స్తున్నాడని అంటూనే, పరోక్షంగా ఆయన దివ్యవైభవాన్ని కీర్తిస్తాడు. సంకల్పమాత్రం చేతనే సమస్త లోకాలను సృష్టించే దేవదేవుడు కర్మ సిద్ధాంతానికి అతీతుడని అన్నమయ్యకు తెలియకపోలేదు కాని స్వామితో తనకు గల గాఢానురాగబంధం వల్ల కలిగిన చనువును పురస్కరించు కొని స్వామితో పరిహాసమాడుతూ, ఆయన వైభవ చిహ్నాలనే లోపాలుగా చిత్రిస్తాడు.

సామాన్యమా పూర్వ సంగ్రహంబగు ఫలము,
నేమమున బెనగొనియె నేడు నీ వనక

జగతి ప్రాణులకెల్ల సంసారబంధంబు
తగుల బంధించు దురితంపు కర్మమున,
మగుడ మారుకు మారు మగువ నీ యురముపై
తెగకట్టి రెవ్వరో, దేవుండ వనక.

వనిలేక జీవులను భవసాగరంబులో
మునుగ, లేవగ జేయు మోహదోషమున,

పని పూని జలధిలో పండబెట్టిరి నిన్ను
వెనుకెవ్వరో, మొదలివేలు పనక

ఉండనీయక జీవనోపాయమున మమ్ము
కొండలను, గొబల తతి గొని త్రిప్పు ఫలము,
కొండలను నెలకొన్న కోనేటి పతి[31] వనగ
నుండవలసెను నీకు, నోపలే ననక

సమస్త సంపదలను, సన్మంగళాలను ప్రసాదించే శ్రీదేవి స్వామి వక్షంపై నిత్యం నివసిస్తుంది గనుకనే ఆయనను శ్రీనివాసు డంటారు. అమ్మవారు ఆ విధంగా శ్రీ విష్ణు వక్షస్థల నిత్యవాస రసికయై వర్తించటం ఆయన వైభవానికి ఒక చిహ్నం. క్షీరసాగరంలో శేష తల్పంపై పవళించటం కూడా స్వామి దివ్య భోగానికి ఒక సంకేతం భూలోకంలో వేంకటాద్రి శిఖరంపై వేంచేసి ఉండటం కూడా ఆయన విభవానికి, జీవులపట్ల గల నిరవధిక కారుణ్యానికి లక్ష్యాలే కొండమీది కోనేరు - స్వామి పుష్కరిణి - అతిపవిత్రమైనదని అనాదిగా అన్నమా చార్యులతోపాటు అసంఖ్యాక భక్తకవులు బహుముఖాల ప్రస్తుతించారు ఈ కీర్తనలోని అందమంతా ఆ విధంగా స్వామి అనన్య వైభవానికి నిదర్శనాలైన శుభలక్షణాలనే గతంలో చేసిన పాపకర్మలకు పడిన శిక్షలని కవి చమత్కరించటంలో ఉన్నది. పైగా స్వామికి ఆయన ఎంతటి చనవరి భక్తుడో ఈ కీర్తనను బట్టి మనం గ్రహించవచ్చును

వేదాలు వల్లించేవారి సంఖ్య వేలలో ఉన్నా, హరిని గుర్తించే వారి సంఖ్య అత్యల్పమని, ఆధ్యాత్మిక గ్రంథాలను అధ్యయనం చేసినంత మాత్రాన ఆత్మశాంతిని పొందలేరని ఒక కీర్తనలో అన్నమాచార్యు లన్నాడు. అటువంటి వారు తరించటానికి అనువుగా కలియుగంలో సంకీర్తనం రూపొందినదని, ఈ కీర్తనలే 'పంచమ వేద' మని, 'వేంకటేశ్వర వేద' మని స్పష్టంగా ప్రకటించాడు. తమిళంలో ఆళ్వారులు రచించిన పాశు రాల సంకలనమైన దివ్యప్రబంధం 'పంచమ వేద' మని, 'ద్రావిడ వేద' మని వైష్ణవులు భావిస్తారు ఈ విషయం దృష్టిలో ఉంచుకొంటే, అన్న మాచార్యులు తన కీర్తనలను పంచమవేదంగా ఎందుకు పరిగణించాడో,

ఎంతటి గాఢమైన ఆధ్యాత్మికానుభూతితో ఆ కీర్తనలు రూపొందినవో మనం గ్రహించవచ్చును.

చిన్ననాటనే అన్నమాచార్యులు మానవ జీవిత పరమావధిని గురించి ఒక నిశ్చితాభిప్రాయాన్ని ఏర్పరచుకొని, ప్రాపంచికమైన పటాటోపాలకు, పూాత మెరుగులకు భ్రమయక, తదేక దీక్షతో తన లక్ష్యసాధనలోనే జీవితం గడిపాడు. ఐతే ప్రపంచంలో జనమధ్యంలోనే ఆయన జీవించాడు. నిండు జీవితం జీవించాడు సుఖదుఃఖాలు, మానావమానాలు, అన్నీ అనుభవించాడు కాని ఏ క్షణాననైనా "నానాటి బ్రదుకు నాటకము" అనే సత్యాన్ని ఆయన విస్మరించలేదు లౌకికమైన ఆకర్షణలను సంతలోని తళుకులతోనూ, రాత్రివేళ కురిసే మంచు చినుకులతోనూ పోల్చాడు. అవి క్షణభంగురాలు ప్రశాంత జీవనానికి విష్ణుచరణ సన్నిధిని శరణాగతియే సుగమమార్గమని, క్షేమకరమైన మార్గమని ఆయన విశ్వసించాడు తోడి జీవుల దయనీయస్థితికి ఆయన హృదయం ద్రవించింది. తాను అను భవిస్తున్న సౌభాగ్యాన్ని వారికి కూడా లభింపజేయాలనే ఔత్సుక్యంతో, వారికి మార్గమధ్యంలో మంగళదీపరేఖగా భాసించే మహత్తర సందేశాన్ని వ్యక్తం చేస్తూ, ఆయన అసంఖ్యాక కీర్తనలను రచించాడు

తన సందేశం ప్రభువులకు, ప్రజలకు, పండితులకు, పామరులకు, అందరికీ వినిపించాలని ఆయన సంకల్పించాడు. కనుక తన పదాలను అటు సాంప్రదాయిక రాగాలలోనూ, ఇటు సరళ జానపద ఫణితులలోనూ సర్వజనాదరణీయంగా ఉండేటట్లు రచించాడు. ఒకవంక అతిశయంగా శృంగారాన్ని, మరొక వంక గాఢమైన వైరాగ్యాన్ని తన పాటలలో వర్ణించాడు. ఒకప్పుడు భావగర్భితంగానూ, మరొకప్పుడు విస్పష్ట ప్రబో ధాత్మకంగానూ కీర్తనలు రచిస్తూ,

"పంతమున నాతనిపై భారము వేసిన చాలు,
నింత ఉద్యోగములు గోవిందుడే యెఱుగు,"

అని శరణాగతి తత్త్వాన్ని విసుగు, విరతి లేక వేనోళ్ళ ప్రకటించాడు.

అంతేకాదు, స్వామిని ఆశ్రయించినవారికి ఆయన అనుగ్రహం

ఇహంలో, పరంలో కూడా లభిస్తుందని, అందుకొక సొగసైన కారణం చెప్పాడు శ్రీదేవి, భూదేవి, ఇద్దరూ స్వామి దేవేరులు ఊరేగింపులో, ఊయెల సేవలో స్వామి ఉత్సవమూర్తికి ఇరువైపుల వారు విరాజిల్లుతూ ఉంటారు లక్ష్మీదేవి వైకుంఠంలోనూ, భూదేవి ఈ ప్రపంచంలోనూ భక్తులను కనిపెట్టి, కాపాడుతూ ఉంటారు. కనుక హరిభక్తులకు ఇహంలోనూ, పరంలోనూ శుభప్రాప్తి సునిశ్చితం

*శ్రీకాంత ఒక దెస, భూకాంత ఒకదెస*
*కైకొన నీ కటు గలిగెనట,*
*ఈకడ శ్రీవేంకటేశ! ఇహపరము*
*ఏకమై మాకగు టే మరుదు?*

# 4

# మహితోపహారం

ఏ సాహిత్యంలోనైనా ప్రాథమికదశలో పల్లెపదాల వంటి జానపద వాఙ్మయరీతులు ప్రచారంలో ఉండటం, తరువాత లాక్షణికులు ఆమోదించే సుబద్ధ వృత్తాలలో విరచితమైన కావ్యాలు ఉత్పన్నం కావటం కనిపిస్తుంది. గీతాలు ఆవిర్భవించి, మౌఖికప్రచారం పొందిన తరువాతనే లిఖితరచనలు వెలువడుతాయి. వాటిలో మానవజీవితంలో తటస్థపడే వివిధానుభవాలు, జీవితయాత్రలో జననం నుంచి మరణం వరకు వివిధ ఘట్టాలలో కలిగే సుఖదుఃఖాలు వర్ణితమౌతాయి. ఆ గీతాలు ఒక వ్యక్తి జీవితంలోకాని, యావజ్జాతికి సంబంధించి కాని ప్రాప్తించే ఔన్నత్యపతనాల వంటి పరిణామాలను చిత్రిస్తాయి. యుద్ధభూములు, భీషణ సంగ్రామాలు, జయాపజయాల వల్ల కలిగే ఆహ్లాద విషాదాలు, వ్యక్తి జీవితంలో విషాదరేఖలు వ్యాపింపజేసే దయనీయమైన సంఘటనలు, వివాహం, పుత్రోదయం వంటి ఆనందదాయకమైన సందర్భాలు, ఏవైనా ఇతివృత్తంగా ఉండవచ్చును. దేశభక్తిని ప్రబోధించే వీరరసాత్మక గేయాలు వెలువడవచ్చును. అంటే, నవరసాలను మనం ఆ అనాదృత జానపద వాఙ్మయంలో చూడవచ్చు నన్నమాట.

తెలుగు సాహిత్యంలో కూడా ఈ విధంగానే మొదట దేశికవిత, తరువాత మార్గ కవిత వెలువడటం జరిగింది. ప్రాచీన సంస్కృత కవితా సంప్రదాయాలను పాటిస్తూ ఉద్భవించిన మార్గకవితా శాఖకు చెందిన ప్రథమగ్రంథం 11వ శతాబ్దానికి చెందిన **ఆంధ్రమహాభారతం.**

కాని అప్పటికే దేశికవిత వ్యాప్తిలో ఉండేది ఇతివృత్త వైవిధ్యంతో, మాత్రాచ్ఛందస్సులో, సులభసరళ శైలిలో ఎన్నో జానపదగీతాలు ప్రజలలో ప్రచారం అవుతూ ఉండేవి. కొన్ని శతాబ్దాలపాటు ఈ విధంగా ఈ రెండు తీరుల కవితలు వెనువెంట వ్యాప్తిలో ఉన్నట్లు తెలుస్తున్నది ఒక వంక విద్వత్కవులు సంస్కృతభాషనుంచి శబ్దాలను, వృత్తాలను గ్రహించి, మార్గపద్ధతిలో పురాణేతిహాసాల వంటి సుదీర్ఘ కథాకథనకావ్యాలను రచిస్తూ ఉండగా, మరొకవంక సామాన్య జనులు దేశిసంప్రదాయంలో, వ్యావహారిక భాషలో సరళసుందర గీతాలను అల్లి, ఆలపిస్తూ ఉండేవారు 13వ శతాబ్దానికి చెందిన శైవకవి పాలకురికి సోమనాథుడు **పండితారాధ్య చరిత్రములో** ఎన్నో పదాలను - తుమ్మెదపదములు, ప్రభాతపదములు, వెన్నెల పదములు, నివాళి పదములు మొదలైన వాటిని - పేర్కొన్నాడు. అవి కేవలం పాడుకోవటానికే ఉద్దేశించిన పాటలు కావటంవల్ల, సమకాలికులెవ్వరూ వాటిని గ్రంథస్థం చేయక పోవటంవల్ల, దురదృష్టం కొద్దీ వ్రాసిన కవుల పేర్లయినా తెలియని ఆ గీతాలు మనకు నేడు లభ్యం కావటం లేదు.

కాగా 15వ శతాబ్దంలో తన ఉదాత్తభావనతో, కావ్యకళాకౌశలంతో పదానికి సునిశ్చితమైన ఆకృతిని కల్పించి, సాహిత్య జగత్తులో దానికి ఆదరణీయమైన స్థానాన్ని సమకూర్చే అవకాశం అన్నమాచార్యులకు లభించింది. అందుచేతనే సమకాలికులు ఆయనకు "పదకవితా పితామహుడు" అనే సార్థక బిరుదాన్ని ప్రసాదించారు. **సంకీర్తన లక్షణమ్** అనే లక్షణ గ్రంథాన్ని రచించి ఆయన సాహిత్యానికి మరొక మహోపకారం కావించాడు తాళ్ళపాక కవుల దృష్టిలో "సంకీర్తన", "పదము" అనే మాటలు పర్యాయపదాలు

రాగ, తాళ, శబ్దార్థ, సందర్భాలకు సంబంధించి, నిర్మాణంలో కొన్ని మార్పులతో "ప్రబంధం" అనే సంగీతప్రక్రియ సంస్కృతంలో చిరకాలంగా వ్యాప్తిలో ఉన్నట్లు ప్రాచీనసంగీత లక్షణ గ్రంథాల వల్ల మనకు తెలుస్తున్నది 'పదం', 'సంకీర్తన', 'కృతి' అని మనం పిలిచే రచనకు ప్రబంధాలు పూర్వరూపాలు అన్నమయ్యకు ఆ ప్రాచీన ప్రక్రియతో సంపూర్ణమైన పరిచయం ఉన్నది కాని, బుద్ధి పూర్వకంగానే

ఆయన రాగతాళాదులలో అనేక వైవిధ్యాలతో కూడిన ఆ ప్రక్రియను చేపట్టలేదు జనరంజక రాగాలతో, అతిసరళమైన ఆకృతితో ఆయన పదాన్ని రూపొందించాడు

తెలుగులో 13వ శతాబ్దం చివర కృష్ణమాచార్యులు అనే వైష్ణవ కవి సింహగిరి నరహరి వచనములు అనే భక్తిరసబంధురమైన కృతులను రచించి, వాటిని "సంకీర్తనములు", "ధ్యాన సంకీర్తనములు" అని వర్ణించాడు. సింహాచల క్షేత్రంలోని నృసింహస్వామిని ఉద్దేశించి, భక్తి పారవశ్యంలో ఆడిన పలుకులవి అవి గానయోగ్యమైనవని కవి భావించినా, శ్రవణ మధురంగా కూర్చిన వచనాలే తప్ప పాటల రూపం వాటికి ఏర్పడలేదు. అందుకే వాటిని "వచన గీతములు" అని వర్గీకరించారు అన్నమాచార్యులకు ఆ వచనాలు పరిచితమే కాని, తాను పదానికి ఒక స్వరూపం ఏర్పరచటంలో అవి ఆయనకు మార్గదర్శకం కాలేదు.

ఐతే అన్నమాచార్యులు తెలుగులో విష్ణుస్తుతిపరమైన సంకీర్తనలను రచించటానికి కర్ణాటక దేశానికి చెందిన దాసకవుల పదాలు కొంతవరకు ప్రేరణను ఇచ్చి ఉండవచ్చును. ఆ ప్రాంతంలో 14వ శతాబ్దంలో ఒక ఉద్యమరూపంలో హరిదాసకూటములు ప్రారంభమైనవి. ఆ సంప్రదాయానికి చెందిన నరహరి తీర్థులు, శ్రీపాదరాయలు రచించిన కీర్తనలు అన్నమాచార్యులకు పరిచితమైనవే గనుక ఆయన హరిదాసుడై జీవించవలెనని సంకల్పించటానికీ, హరిస్తుతి చేసే సంకీర్తనలు రచించటానికీ ఆ కన్నడకవుల ప్రభావం కొంతవరకు కారణం కావచ్చునని ఊహించటం భావ్యమే.

అన్నమాచార్యులు రూపొందించిన కీర్తనలో 'పల్లవి', 'చరణము' అని రెండు విభాగాలు కనిపిస్తాయి. కీర్తనలో చెప్పదలచిన ముఖ్య భావాన్ని పల్లవి ఒకటి, రెండు పంక్తులలో వ్యక్తం చేస్తుంది. గానం చేసినప్పుడు అది చరణం చివర పునరావృతం కూడా అవుతుంది అన్నమయ్య కీర్తనలలో సాధారణంగా ప్రతిచరణంలోనూ నాలుగు పంక్తులుంటాయి. పల్లవిలో సూత్రప్రాయంగా వ్యక్తమైన భావాన్ని చరణాలలో ఉపపత్తులతో, ఉదాహరణాలతో విస్తరించటం కనిపిస్తుంది ఆయన రచించిన అనేక గీతాలలో పల్లవి తరువాత ఇటువంటి చరణాల పరం

పర ఉంటుంది అన్నమాచార్యుల కీర్తనలకు సంబంధించినంతవరకు పల్లవిలోని భావాన్ని విపులీకరించటానికి ఆయనకు తరచుగా మూడు చర ణాలను కూర్చే అభ్యాసం ఉండేది. కొన్ని సందర్భాలలో ప్రధానభావం పల్లవిలో ఒకటి, రెండు పంక్తులలో సంతృప్తికరంగా వ్యక్తం చేయటం సాధ్యం కాకపోవచ్చును అప్పుడు పల్లవికి, చరణానికి నడుమ 'అనుపల్లవి' అనే మరొక విభాగాన్ని కూడా చేర్చే సంప్రదాయం ఉన్నది. ఆ విధంగా అనుపల్లవిని చేర్చినప్పుడు పాటలో మూడు భాగాలుంటాయి త్యాగరాజ కీర్తనలలో బహుళంగా మనకు 'పల్లవి', 'అనుపల్లవి', 'చరణం' అనే త్ర్యంశాత్మక నిర్మాణం గోచరిస్తుంది అన్నమాచార్యులు ఎక్కువగా పల్లవి, చరణాలు ఉండే కీర్తన రూపాన్ని ఆదరించాడు. ఐతే అరుదుగా - "మొదలుండ, కొనలకు మోచి నీళ్ళు వోయనేల?" వంటి కీర్తన లలో - అనుపల్లవికూడా కనిపిస్తుంది

పల్లవి, చరణం అనే రెండు అంశాలతో కూడిన అన్నమాచార్యుల కీర్తనల స్వరూపాన్ని అర్థం చేసుకోవటానికి ఒక కీర్తనను పరిశీలించ వచ్చును

కొలచిన వారి పాలి కొల్ల లివివో,
ఇల నిట్టి దైవమవు, ఇక వేరే కలరా?
ఎట్టైన నభయహస్త[32] మెత్తుక కాచుకున్నాడ,
వట్టె దాసుల గాచే నంటా నీవు,
తొట్టిన పాపాలు పోదోలు నీ నామమంత్రాలు
జట్టిగా లోకాల వెదజల్లినాడవు

తలచినవారి కెల్ల ధనధాన్యా లిత్తునంటా,
వొలసి శ్రీసతి మోచుకున్నాడవు,
ఇల' బావనులగా నిందరి జేసే నంటా,
నెలమి పాదతీర్థ మేరు జేసినాడవు.

పుట్టించ జీవులను భువనముల లోపల,
గట్టిన బ్రహ్మను నాభి గన్నాడవు
రట్టుగ బాలువడి చుట్టి రక్షకత్వానికే
ఇట్టె శ్రీ వేంకటాద్రి ఎక్కినాడవు.

మొదటి రెండు పంక్తులతో పల్లవి రూపొందింది. తరువాత నాలు గేసి పంక్తులతో కూడిన మూడు చరణాలు ఈ పాటలో ఉన్నవి వేంకటేశ్వరస్వామి నిరవధికానుగ్రహాన్ని కీర్తించటం దీని ధ్యేయం తన భక్తులకు కొల్లలుగా శుభాలను సంఘటించటం వల్ల ఆయన సాటిలేని దేవాధిదేవుడని ఆయన ఆధిక్యం వ్యక్తమయింది పల్లవిలో ప్రకటిత మైన ఈ భావాన్ని విశదీకరించటానికి చరణాలలో భక్తుల యోగక్షేమాల పట్ల స్వామి చూపే ఔత్సుక్యం, అపారమైన ఆయన అనుగ్రహం సహే తుకంగా వర్ణించటం జరిగింది. ప్రతి చరణాన్ని రెండుగా విభజిస్తే, రెండేసి పంక్తులకు ఒక్కొక్క నిదర్శనం చొప్పున మూడు చరణా లలో మొత్తం ఆరు నిదర్శనాలు స్వామి భక్తపాలనకళా సంరంభకుడని నిరూపిస్తాయి

(1) శరణాగతులను సంరక్షించటానికి స్వామి సదా సంసిద్ధుడై ఉన్నాడు. అభయహస్తం చూపుతూ ఉండటం అందుకు తార్కాణం. (2) ఆశ్రితుల పాపాలను పరిహరించి, వారికి శాంతిని ప్రసాదించ టానికి పాపనాశకక్షమత గల తన నామ, మంత్రాలను లోకాలన్నిట వ్యాపింపజేస్తున్నాడు. (3) భక్తులకు సిరిసంపదలు ప్రసాదించే సంకల్పంతో సర్వసంపత్ప్రదాత్రి అయిన శ్రీలక్ష్మిని సదా తన వక్షంపై నిలుపుకొ న్నాడు. (4) జీవులు గతజన్మలలో చేసిన పాపాల ఫలం తొలగటానికి వీలుగా త్రిభువనపావని అయిన గంగానదిని తన పాదాలనుండి ప్రవహింప జేస్తున్నాడు. (5) తన లీలలో[33] ఒక అంశంగా లోకాలను జీవులతో నింపటానికి బ్రహ్మను సృష్టించాడు. (6) భక్తులకు ఏ సమయాన ఎట్టి రక్షణ కావలసివస్తుందో అని, నలువంకల చూడటానికి వీలుగా కొండమీద నిలిచి ఉన్నాడు. ఈ చరణాలలో ప్రస్తావితమైన అంశా లన్నీ విష్ణువు దేవతలందరిలోనూ పరమదయాళువని, పరమోదారుడని పల్లవిలో వ్యక్తం చేసిన భావాన్ని ధ్రువపరుస్తున్నవి. ఆయనను ఆశ్రయిం చిన జీవులకు శుభాలు కొల్లలుగా లభిస్తాయి 'కీర్తనం' అనే పదానికి గుణగణాలను కీర్తించటం, యశోగానం చేయటం, అని అర్థం. అన్నమా చార్యుల కీర్తనలు ఆ ధర్మాన్ని నిర్వహించటం వల్ల ఆయన రచనలకు ఆ పేరు సార్థకమయింది. ఆ కారణం చేతనే సమకాలికులు ఆయనను

"హరికీర్తనాచార్యుడు" అని భూషించారు

కవులకు కీర్తి ప్రతిష్ఠలు, సిరిసంపదలు కేవలం మార్గ పద్ధతిలో సంస్కృత కావ్యాలను తెలుగులోనికి అనువదించటమో, అనుసరించటమో చేస్తేనే లభ్యమయ్యే కాలంలో పుట్టిన అన్నమాచార్యులు వ్యావహారిక భాషలో, జానపదగీతాల రీతులలో పదాలు వ్రాస్తే పండితులు, విమర్శకులు చిన్నచూపు చూస్తారని తెలిసికూడా హరిని స్తుతిస్తూ కీర్తనలు వ్రాయటమే తన ధ్యేయంగా ఎంచుకొన్నాడంటే, అందుకు కారణం ఆయన దృష్టిలో హరికీర్తనాచార్యుడు కావటం కంటె మహత్తర భాగ్యం, సత్కారం మరొకటి లేదనే విశ్వాసమే ఐతే ఆ కాలపు విద్వాంసులు పదాలకు సాహిత్యగౌరవం ఇవ్వక పోవటం మాత్రం వారి అభిరుచిలోని లోపాన్ని నిరూపిస్తున్నది. ఈ సందర్భంలో "గ్రామ్యము, వ్యాకరణము" అనే అంశంపై వ్రాస్తూ ఏ గాలటీ అనే బ్రిటిష్ ప్రభుత్వోద్యోగి చేసిన విమర్శ అవశ్యం గమనించదగినది. ఆయన "ఇతర జాతుల ప్రజలలో, అన్య కాలాలలో సాహిత్యంలోని ఉత్కృష్ట యుగాలు పాటలతో ప్రారంభమైనవి ఆంధ్రజాతి ప్రజలకు సంగీతం సదా సహజంగా, మధురంగా వస్తుంది. ... కాని తెలుగు సాహిత్యం తెలుగు పాటను నిర్లక్ష్యం చేసింది. అన్యభాషా సంప్రదాయానికి చెందిన ఛందస్సును అరువు తెచ్చుకొన్నది. ఆ ఛందస్సులో నడక మరొకరి బట్టలను అరువు తెచ్చుకొంటే అవి బిగువై కదలిక అసహజంగా, సుఖం లేకుండా ఉన్నట్లు కృత్రిమంగా సాగుతుంది" అని వ్రాశాడు.

అప్పుడు ఆంధ్రదేశంలో సంస్కృతాధ్యయనానికి అపార గౌరవం ఉండేది కనుక తెలుగు సాహిత్యంలో కూడా సంస్కృత శబ్ద జాలానికి, కావ్య ఫణితులకు అసాధారణమైన ఆదరం లభించేది. తెలుగులో పాటలను పండితులు తృణీకార దృష్టితో చూడటానికి, అవి స్త్రీలకు, పామరులకు వినోదం కలిగించటానికి మాత్రమే తగినవని వారు భావించటానికి నాడు సంస్కృతభాషా సాహిత్యాలకు తెలుగునాట లభిస్తున్న గౌరవమే ప్రధానకారణం ఈ ధోరణి తెలుగు పాటలకు మాత్రమే పరిమితమైనట్లు కనిపిస్తుంది ఇతర భాషలలో పదకర్తలకు మొదటి నుంచి సముచిత గౌరవస్థానం లభిస్తూ ఉండేది తమిళంలో ఆళ్వారులు,

నాయన్మారులు వ్రాసిన పాశురాలను, కన్నడంలో దాసకవుల గీతాలను, మరాఠీలో భక్తకవుల అభంగాలను, బెంగాలీ భాషలో వైష్ణవకవుల పదావళిని, హిందీలో కృష్ణ భక్తి మార్గాన్ని అనుసరించిన సత్కవుల గీతాలను పండితులు ఉత్తమస్థాయి సాహిత్యంగా పరిగణించినట్లు స్పష్టంగా తెలుస్తున్నది

తెలుగులో ఇద్దరు వాగ్గేయకారులు — క్షేత్రయ్య, త్యాగరాజు— రచించిన పాటలు కొంతవరకు గణన కెక్కిన మాట వాస్తవమే, కాని శ్రోతలు సాహిత్య సౌందర్యాన్ని గుర్తించటంవల్ల గాక, ఇతర కారణాల వల్ల వారి గీతాలకు ప్రజాదరణం లభించింది క్షేత్రయ్య వ్రాసిన మువ్వగోపాల పదాలు నాట్యప్రదర్శనంలో అభినయానికి అత్యంతం అనుకూలమైనవి కావటం వల్లనే అవి జనాకర్షకంగా ఉన్నవి ఇక త్యాగరాజ కీర్తనల మాట ఆ కృతులలోని సాహిత్యం అన్నివిధాల ప్రశంసనీయమైనదే ఐనా తమ సంగీత విద్యాప్రావీణ్య ప్రదర్శనానికి ఆ కీర్తనలు గాయకులకు చక్కని అవకాశం ఇస్తాయి గనుక కర్ణాటక సంగీత విద్వాంసులు వాటిని తమ కచేరీలలో తప్పనిసరిగా గానం చేస్తూ, వాటి ప్రచారానికి కారకులవుతున్నారు త్యాగరాజు పరమభక్తుడు రాముడే తన సర్వస్వమని నమ్మి, ఆయన సేవకే తన జీవితాన్ని అంకితం చేసి, ఆయనను కీర్తిస్తూ, చనువుతో గేలి చేస్తూ, ఆపదవేళల అడ్డుకొమ్మని ఆక్రందనం చేస్తూ, తన భక్తిని, ఆర్తిని, దైన్యాన్ని, తృప్తిని, ఆనందాన్ని, వివిధానుభూతులను వర్ణిస్తూ రసవన్మధుర కృతులను రచించిన కవివతంసుడు ఐనా కర్ణాటక సంగీతానికి ఆయన చేకూర్చిన పుష్టికి వచ్చిన గణన ఆయన సాహిత్య మాధురికి ఇంతవరకు రాకపోవటం విచారించదగిన విషయం.

అన్నమాచార్యుల సమకాలికులలో మార్గసంప్రదాయాన్ని అనుసరించిన కవులలో భావనలోనూ, భక్తిలోనూ ఆయనకు అన్నివిధాల సాటి అయిన వాడు **ఆంధ్ర మహాభాగవతం** రచించిన బమ్మెర పోతన అపార భక్తి, ఏమాత్రం అవకాశం లభించినా విష్ణుభక్తిని ప్రబోధించవలెననే ఔత్సుక్యం, శ్రవణమాధుర్యం కోసం అవసరమైతే వ్యాకరణ నిబంధనలను ఉల్లంఘించటానికి వెనుదీయకపోవటం — ఇవి ఈ ఉభయులకు

సమానధర్మాలు సహజంగానే అలవడిన ప్రగాఢభక్తి, రమ్యమైన కథా కథనం, రమణీయమైన శైలి, మృదంగనిస్వనాన్ని తలపించే శబ్దాలంకార ప్రయోగం, అన్నీ ఏకమై ఆయన ఆంధ్రీకరించిన భాగవతం అశేష ప్రజాదరణను పొందటానికి కారణమైనవి ఐనా పండితుల నిరాదరణ ఆయనకు కూడా తప్పలేదు. ముఖ్యంగా వైయాకరణులు ఆయన భాష దోషాలతో కూడినదని, ఆయన ప్రయోగాలు ప్రామాణికం కావని నిరసించారు మార్గరీతిలో **మహాభాగవతం** వంటి సుదీర్ఘకావ్యాన్ని రచించిన పోతన వంటి కవీశ్వరునికే పండితుల చిన్నచూపు తప్పలేదంటే, ఇక వ్యావహారిక భాషలో కీర్తనలు వ్రాయటమే ప్రధానకవితా వ్యాసంగంగా ఎంచుకొన్న అన్నమాచార్యులు వారి కంటికి ఆనకపోవటంలో ఆశ్చర్య పడవలసిన దేమీ లేదు

కాగా సాహితీవేత్తల మన్నన పొందటానికి ఆయన కవిత 300 సంవత్సరాలు నిరీక్షించవలసి వచ్చింది ఆయన రచనలను రాగిరేకుల మీద చెక్కించి, తిరుపతి కొండపై భద్రంచేసి ఉంచిన విషయమే విస్మృతమయింది కొన్ని రేకులను అహోబలంలో దాచి ఉంచారు మరి కొన్ని శ్రీరంగంకూడా చేరినట్లు తెలుస్తున్నది. తంజావూరు ప్రాంతంలో ఆయన కీర్తనలకు తాళపత్ర ప్రతులు కూడా లభిస్తున్నవి ఈ విధంగా దక్షిణదేశంలో అన్ని ప్రాంతాలలో ఆయన కీర్తనలు లిఖితరూపంలో వ్యాప్తమైనా, వాటి ఉనికిని గురించి దాదాపు మూడు శతాబ్దాలపాటు ఎవ్వరికీ తెలియలేదు. ఆ కీర్తనలకు ప్రచారం తిరిగి ఈ శతాబ్దంలోనే ప్రారంభమైనది

పోయినవి పోగా, ఇప్పటికీ లభిస్తున్న అన్నమాచార్యుల రచనలను పరిశీలిస్తేనే, ఆయన చిన్ననాట తండ్రి దగ్గర, గురువుల దగ్గర సంస్కృతాంధ్రాలు, కావ్యాలు, అలంకారశాస్త్రం శ్రద్ధగా అభ్యసించి నట్లు తెలుస్తుంది. జయదేవుని **గీతగోవిందం** ఆయనకు సుపరిచితం. స్వయంగా సంస్కృతంలో కొన్ని కీర్తనలు వ్రాయటమే కాదు, **సంకీర్తన లక్షణమ్** అనే లక్షణశాస్త్రాన్ని కూడా ఆ భాషలో వ్రాశాడు ఆయన 12 శతకాలు రచించినట్లు తెలుస్తున్నది. ఒకటి మాత్రమే మనకు లభ్యమవుతున్నది. ఆ శతకాలను ఆయన వృత్తాలలోనే రచించి

ఉంటాడని ఊహింపవచ్చును వాల్మీకి రామాయణాన్ని తెలుగులో ద్విపదకావ్యంగా రచించాడట. ఆ గ్రంథం ఇప్పుడు మనకు దొరకటం లేదు గాని, **శృంగారమంజరి** అనే కావ్యం ప్రకటిత మయింది ఈ కారణాలను బట్టి, ఆయన సంకల్పిస్తే మార్గపద్ధతిలో సుదీర్ఘ కథన కావ్యాలను రచించి నాటి పండితుల ప్రశంసలను అందుకోగలిగే వాడని స్పష్టమవుతున్నది ఐనా ఆయన దేశిరీతిలో కీర్తనలు రచించటమే తన ప్రధానకర్తవ్యంగా భావించాడంటే, వేంకటేశ్వరస్వామిపై ఆయనకు గల ప్రగాఢభక్తి, సాటిమానవులపై గల కారుణ్యదృష్టి అందుకు కారణాలు వారికి ఆశాపూర్ణమైన ఒక మహత్తర సందేశం అందించవలసిన బాధ్యత తనపై ఉన్నది వెంటనే దానిని నడివీధులలో నలుగురికీ వినిపించవలసిన అవసరం ఉన్నది "అచ్చపు చీకటింబడి, గృహవ్రతులై, విషయప్రవిష్టులై", "మహామోహలతానిబద్ధపదమ్మః విడిపించుకొనంగలేక సందేహము బొందు" జీవులకు సులభతరణోపాయం తెలుపవలసి ఉన్నది అందుకే ఆ లక్ష్యసాధనకు ఆయన పాటనే సాధనంగా చేసుకొన్నాడు అందువల్ల తెలుగులో "పదకవితాపితామహు" డయ్యాడు క్షేత్రయ్య, త్యాగరాజు వంటి వాగ్గేయకారులకు మార్గదర్శకుడయ్యాడు ఆయన ప్రభావం వల్ల వారు గొప్ప భక్తిగీతాలు రచించారు ఐతే భావవిస్తృతిలో మాత్రం ఆయనదే అగ్రపీఠం. అన్నమాచార్యుల ఆధ్యాత్మిక తత్త్వం అనేక యోగాల సమ్మేళనం దానిలో జ్ఞానం, వైరాగ్యం, భక్తి, సఖ్యం, వాత్సల్యం, దాస్యం, శృంగారం, అన్నిటి కలయిక మనకు కనిపిస్తుంది. భక్తునికీ, భగవంతునికీ మధ్య ఇన్నివిధాల అనుబంధాలు ఇంత అధికంగా అన్యత్ర కనిపించటం కష్టం

శ్రీమహావిష్ణువు పట్ల భక్తి ప్రపత్తులను సర్వజనులకు బోధించవలెననే ఉత్సాహంవల్ల ఆయన సమకాలిక జానపద గేయరీతులను ఎన్నిటినో తన కీర్తనలలో ప్రయోగించాడు కాగా ఆయన పాటలవల్ల 15వ శతాబ్దంలో ఆంధ్రదేశంలో ప్రచారంలో ఉన్న జానపదగీతాల స్వరూపం మనకు తెలుస్తున్నది. **బృహద్దేశి, సంగీతచూడామణి, అభిలషితార్థ చింతామణి** వంటి ప్రాచీనగ్రంథాలలో తెలుగునాట వ్యాప్తిలో ఉన్న దేశిసంగీత సంప్రదాయం కూడా కనిపిస్తుంది. 12 - 13 శతాబ్దాలకు చెందిన

శివకవులు, నన్నెచోడుడు, పాలకురికి సోమనాధుడు రచించిన కావ్యాల వల్ల ప్రాచీన జానపదగేయ వాఙ్మయాన్ని గురించి మరికొన్ని వివరాలు తెలుస్తున్నవి. ఇప్పుడు అన్నమాచార్యుల కీర్తనలు ప్రకటితం కావటంతో విద్వాంసులు లక్ష్యలక్షణ సమన్వయం కావించటానికీ, ఇతివృత్తాన్ని బట్టీ, నిర్మాణాన్ని బట్టీ పాటలను వర్గీకరించటానికీ వీలవుతున్నది అన్నమాచార్యుల కీర్తనలలో జోలపాటలు, శోభనాలు, ధవళములు, సువ్విపాటలు, సంవాదపదములు, దోబూచిపదములు వంటి జానపదగేయ స్వరూపాలు కనిపిస్తున్నవి.

ఆయన తెలుగు సాహిత్యానికి చేసిన సేవ ఎంత విశిష్టమో, తెలుగు భాషకు చేసిన సేవ కూడా అంత గణనీయమే ఆయన కీర్తనలలో సువిస్తృతమైన పదజాలం కనిపిస్తుంది వాడుక నుంచి తొలగిపోయి, మరెవ్వరి రచనలలోనూ లేని "పామిడి" వంటి కొన్ని శబ్దాల అర్థాన్ని నిర్ణయించటానికి విద్వాంసులు ప్రయత్నిస్తున్నారు. అన్యకవుల కృతులలో కూడా ప్రయుక్తమైన శబ్దాల అర్థం గ్రహించటానికి కూడా అన్నమాచార్యుల ప్రయోగాలు ఉపకరిస్తున్నవి ఆయన కీర్తనలలో కనిపించే కమనీయ పదబంధాలు అనేకం - "విన్నపాలు వినవలె" వంటివి— నేడు నిత్య వ్యవహారంలో ఉండటం చూస్తున్నాము. చక్కని పలుకుబడులు, నుడులు, సామెతలు అపూర్వమైన ఉపమ, రూపకం వంటి అలంకారాలు ఆయన శైలికి సొంపు ఘటిస్తున్నవి తెలుగు భాషను సంపన్నం చేసిన రచయితల పరిగణనంలో అన్నమాచార్యులకు నిశ్చయంగా అత్యున్నతస్థానం లభిస్తుంది

ఆయన ఉపమానాలు అలంకారశాస్త్రగ్రంథాలనుంచి అరువు తెచ్చుకొన్నవి కావు దైనందిన జీవితం నుంచి, తన పరిసరాల నుంచి ఆయన వాటిని సేకరించాడు. దుక్కి దున్నిన భూమిపై కురిసిన వర్షం వల్ల వెలువడే అపూర్వగంధం, అప్పుడే కోసిన గడ్డి, అడవి పువ్వులు, హోమంలో జ్వలిస్తున్న సమిధలు, సన్నటి సెగకు కరుగుతున్న వెన్న — తెలుగు పల్లెలలో ఒకనాడు సర్వసాధారణంగా ఎదురయ్యే సన్నివేశాలనుంచి ఆయన సాదృశ్యాలను సంతరించాడు. ఈ విధంగా ఆయన దృశ్యమానప్రపంచం నుంచి వలసిన సామ్యాలను గ్రహించటం ఒక కీర్తనలో మనకు స్పష్టంగా

కనిపిస్తుంది.

ఏడ సుజ్ఞాన, మేడ తెలివి నాకు,
బూడిదలో హోమమైపోయె కాలము.

ఇది మే లయ్యేడి నా, కది మేలయ్యేడి నని
కదిసిన యాసచే గడవలేక,
ఎదురుచూచి, చూచి, యెలయించి, యెలయించి,
పొగ చాటు మృగమైపోయె కాలము.

ఇంతట దీరెడి దుఃఖ, మంతట దీరెడినని
వింత వింత వగలచే వేగి, వేగి,
చింతయు, వేదనల చిక్కువడుచు నగ్ని
పొంత నున్న వెన్నయైపోయె కాలము.

ఇక్కడ సుఖము నా, కిక్కడ సుఖంబని
ఎక్కడికైనా నూర కేగి, యేగి,
గ్రక్కన శ్రీ తిరువేంకటపతి గానక
పుక్కిటి పురాణ మైపోయె కాలము

తన కాలం సద్వినియోగం కావటం లేదని, నిరర్థకాన్వేషణలో అది వ్యర్థమైపోతున్నదని కవి తన పరితాపాన్ని నాలుగు ఉపమానాలతో వ్యక్తం చేశాడు. (1) "బూడిదలో హోమమైపోయె కాలము". యజ్ఞం చేసేటప్పుడు నేతిని హోమకుండంలోని అగ్నిలో వేస్తే, కోరిన ఫలం లభిస్తుంది కాని, బూడిదలో వేస్తే కాదు. బూడిదలో హోమం చేసినట్లే తన కాలం వ్యర్థమైపోయింది. (2) "పొద చాటు మృగమైపోయె కాలము". తాను వెన్నాడుతున్న మృగం వేటకానికి ఎదుట కనిపిస్తూనే ఉండాలి, కాని అది కనుమరుగై పొదచాటున దాగితే, అతని ప్రయత్నం విఫల మవుతుంది. కాలం వ్యర్థమవుతుంది. (3) "అగ్ని పొంత నున్న వెన్న యైపోయె కాలము". వెన్నను సెగకు దగ్గరగా ఉంచితే అది కరిగి, కరిగి కానరాకుండా పోతుంది. తన కాలం కూడా ఆ విధం గానే రూపు చెడి, అక్కరకు రాకుండా పోతున్నదని కవి చింతిస్తున్నాడు. (4) "పుక్కిటి పురాణమైపోయె కాలము". పుక్కిటి పురాణం పుక్కిటి

పురాణమే దానిని పరమసత్యమని ఎవ్వరూ భావించరు మాయా మయమైన ఈ జగత్తులో ఉన్న ఏకైకసత్యం శ్రీవేంకటేశ్వరస్వామియే. ఆయనను గుర్తించటంలో గడిపిన కాలమే సార్థకం అన్యత్ర ఆనందం కోసం అన్వేషించటం పుక్కిటి పురాణాన్ని ప్రామాణికసత్యంగా భ్రమించటం వంటిదే.

సాహిత్య జగత్తులో అన్నమాచార్యులు అధిరోహించిన సమున్నత స్థానాన్ని గురించి ఇంతవరకు ప్రస్తావించటం జరిగింది ఆయన ప్రాధాన్యాన్ని ఎవ్వరూ కాదనరు కనుక ఆయన రచనలలో అక్కడక్కడ కనిపించే నెరసులను గురించి కూడా సంగ్రహపరిశీలనకు సంకోచించ నక్కర లేదు పరిపూర్ణత్వం పరమాత్మ లక్షణం. మనుష్యులన్న తరువాత, వారి ప్రయత్నాలలో ఏ మాత్రమో అసమగ్రత ఉండక తప్పదు ఈ మాట అన్నమయ్య రచనకు కూడా వర్తిస్తుంది.

రాశి, వాసి ఎప్పుడూ సమానస్థాయిలోనే ఉండటం అసాధ్యం. ఆయన సంకీర్తనసాహిత్యం అతివిస్తృతమైనది కనుక, అందులో కొంత అసమానత కనిపిస్తే, ఎచ్చుతగ్గులు ఉంటే, ఆశ్చర్యపడనక్కర లేదు. అనేక దశాబ్దాలకు వ్యాప్తమైన ఆయన రచనలో వేనవేల పాటలలో, ఒకే ఇతివృత్తాన్ని వర్ణించే గీతాలు ఒకటి కంటె ఎక్కువగా ఉంటే, వాటిలో ఉపమానాలు, ఉపపత్తులు దాదాపు సమానమే అయితే, అటువంటి సందర్భాలలో ఒకపాట అనర్ఘ రత్నం వలె ప్రకాశించటం, దాని ఎదుట మరొకటి వెలతెలపోతూ ఉండటంలో ఏమీ వింతలేదు.

ఆయన కవిత్వం ప్రధానంగా కీర్తనలరూపంలో వినటానికి ఉద్దేశించినది కావటంవల్ల శ్రవణానందం కోసం ఆయన విధిగా యతి, ప్రాస, అనుప్రాస వంటి ప్రక్రియలను ప్రయోగించవలసి వచ్చేది. కాగా పాటలలో కొన్ని మాటలను అర్థాన్ని బట్టి కాక ధ్వనిని బట్టి వాడవలసి వచ్చేది. ఆయన పాటలలో అటువంటి పడికట్టు మాటలు కొన్ని తప్పని సరిగా కనిపిస్తాయి. సాహిత్య దృష్టితో చూస్తే, అవి కొంతవరకు బిగిని తగ్గించే అవకాశం ఉంది. ఐతే ఈ లక్షణం ఆయన పాటలలో అరుదుగానే కనిపిస్తుంది. హృదయాన్ని స్పందించే దృశ్యం కంటబడినా, మనస్సును కదిలించే భావం స్ఫురించినా, అప్రయత్నంగానే ఆ పాట,

ప్రశస్తమణిహారంలో ప్రతిరత్నం సుందరంగా అమరినట్లు, సందర్భోచిత శబ్దజాలంతో, కమనీయమైన కూర్పుతో అందంగా రూపు దిద్దుకొనేది

సాహిత్యంలో సంయమం కంటె ఉత్సాహం, ఉద్వేగం ప్రధాన లక్షణాలైన కాలంలో అన్నమయ్య జీవించటం వల్ల ఆయన కూడా ఆ ప్రభావానికి లోనయ్యాడు కొన్ని సందర్భాలలో ఆయన భావ వ్యక్తీ కరణంలో కొంత నిగ్రహం చూపి ఉంటే, వెనుదిరిగి తన రచనను కొంత సవరించి ఉంటే, కొన్ని కీర్తనలు మరింత రమణీయంగా ఉండేవని అనిపిస్తుంది.

ఐతే ఇవి తీవ్రంగా పరిగణించవలసిన లోపాలు కావు అన్నమాచార్యుల వంటి ప్రథమశ్రేణికి చెందిన వాగ్గేయకారుని సాహిత్య ప్రాధాన్యానికి భంగం కలిగించేవి కావు. "ఏకో హి దోషో గుణసన్నిపాతే నిమజ్జ తీందోః కిరణే ష్వి వాంకః" అని కాళిదాసమహాకవి **కుమార సంభవం**[34]లో వ్రాసినట్లు, చంద్రునిలోని మచ్చ చంద్రకాంతిని తగ్గించనట్లే, ఇవి కూడా అన్నమయ్య కవితాప్రాశస్త్యానికి లోటు కలిగించవు

సాహిత్య సంస్కృతులకు అన్నమాచార్యులు చేసిన సేవావిశేషాలను చర్చించేటప్పుడు కర్ణాటక సంగీతంగా (కర్ణే అటతీతి కర్ణాటః = చెవిలో ఇంపుగా తిరిగేది, శ్రావ్యమైనది) ప్రసిద్ధి చెందిన దక్షిణభారత సంగీతకళ రూపొందటంలో అన్నమయ్య కృషిని కూడా ప్రస్తావించటం భావ్యం భారతీయ సంగీతానికి రాగమే ప్రాతిపదిక. ఐతే రాగాలాపానికి ఉత్తర భారతీయసంగీతంలో ప్రాధాన్యం ఏర్పడింది. కర్ణాటక సంగీతంలో ఆలాపంకంటె కృతికి అధికతర ప్రాధాన్యం లభించింది రాగం, కృతి — రెండూ విడదీయరానివే. ఐతే దాక్షిణాత్య సంగీతంలో ఆలాపాన్ని కుదించి, కృతిని విస్తరించటం జరిగింది. సంగీతకళావికాసంలో సాహిత్యానికి — కృతులకు — కొంత ప్రాముఖ్యం ఎప్పుడూ ఉన్నది. భక్తకవుల కీర్తనలు దాని ప్రాముఖ్యానికి మరింత పెంపు కలిగించాయి. ఆ విధంగా దాక్షిణాత్య సంగీతానికి నిర్దిష్టరూపరేఖ లేర్పరచటంలో పాత్ర ఉన్న భక్తకవులలో కాలక్రమాన అన్నమాచార్యులే ప్రథముడు. ఆయన రచించిన కీర్తనలూ, **సంకీర్తన లక్షణమ్** అనే లక్షణగ్రంథం కర్ణాటక సంగీతావిర్భావానికి తోడ్పడినవని సంగీతశాస్త్రజ్ఞు లంగీకరిస్తారు[35].

ఆయనకు సమకాలికుడు, వయస్సులో ఆయనకంటె చిన్నవాడు, కర్ణాటకదేశానికి చెందిన భక్తకవి పురందరదాసు వేనవేలు కీర్తనలను రచించి ఆ సంగీతకళను తీర్చిదిద్దటం వలన ఆయనను కర్ణాటక సంగీత పితామహుడని పరిగణిస్తారు. ఈ సంగీత సంప్రదాయంలో మహోన్నత స్థానం త్యాగరాజుకు లభించింది. ఆయన ఆద్యులైన అన్నమాచార్యులు, పురందరదాసు రచించిన కీర్తనలను పరిశీలించి, ఆ కళకు మరింత సౌందర్య సౌష్టవాలను సంఘటించాడు. అంతేకాదు, సంగీతం దైవానుగ్రహ ప్రాప్తికి సర్వోత్కృష్ట సాధనమని కూడా వారి నుంచి గ్రహించాడు. ఒక కృతిలో "సంగీతజ్ఞానము, భక్తి వినా సన్మార్గము గలదే" అని స్పష్టంగా ప్రకటించాడు.

ఇంతవరకు కళాక్షేత్రంలో అన్నమాచార్యులు ప్రదర్శించిన బహుముఖ ప్రజ్ఞను, సాధించిన అపూర్వ విజయాన్ని దిఙ్మాత్రంగా పరిచయం చేసే ప్రయత్నం జరిగింది. ఇక, మనుష్యులు బహునామరూపాలతో భావించినా, ఉన్న దైవం ఒక్కడే గనుక, అందరూ ఆయన బిడ్డలే అని మహత్తర విశ్వమానవ సౌభ్రాత్రసందేశం వినిపించి తోడి మానవులకు ఆయన కావించిన మహోపకారాన్ని గురించి ప్రస్తావించ వలసి ఉన్నది

అన్నమాచార్యులు దైవాన్ని విష్ణుస్వరూపాలలో అత్యాకర్షణీయమైన శ్రీవేంకటేశ్వర రూపంలో దర్శించి, నిరంతరం ప్రపత్తి మార్గాన్ని ప్రచారం చేసిన మాట వాస్తవమే. ఐతే ఆయన శ్రీమహావిష్ణువును వైష్ణవ సంప్రదాయానుయాయులైన పరిమిత జనులకు మాత్రమే ఆరాధ్య దైవమని ఎన్నడూ భావించలేదు. అన్నమయ్య స్తుతించిన విష్ణువు పరబ్రహ్మం; సర్వజీవులకు ఏకైక పిత.

'విష్ణు' శబ్దానికే 'అంతట వ్యాపించిన వాడు' అని అర్థం. "విశతీతి విష్ణుః" "విశ్" ధాతువు 'వ్యాపించటం', 'ప్రవేశించటం' అనే అర్థాలను సూచిస్తుంది. విష్ణువు సర్వవ్యాపి, స్థలకాలావధులకు కట్టుబడని వాడు యావత్ప్రపంచంలో ఆ పరమాత్మ శక్తి వ్యాప్తమైనది కనుక ఆయనను విష్ణువంటారని **విష్ణుపురాణం**[36] తెలుపుతుంది. "నేను దిగంతాలకు వ్యాపించాను గనుక, నా మహిమ సర్వోత్కృష్టమైనది గనుక, [ముల్లోకాలను] నా అడుగులతో కొలిచాను గనుక నన్ను విష్ణువని అంటారు" అని

**మహాభారతం**[37]లో కృష్ణుడు అర్జునునికి చెప్పాడు. ఈ విధంగా విష్ణువును మొదటి నుంచీ రూపంతో కూడిన పరబ్రహ్మమని భావించారు అన్నమాచార్యులు ఆయన సర్వజీవులకు దివ్యజనకుడని, చిరమిత్రుడని, ఏకైకశరణ్యుడని సంభావించాడు.

ఆయన ఒక కీర్తనలో శ్రీవేంకటేశ్వరస్వామి సర్వదేవతా మయ మూర్తి యని, సర్వజనసంసేవ్యుడని నిర్ద్వంద్వంగా ప్రకటించాడు

ఎంతమాత్రమున నెవ్వరు దలచిన అంతమాత్రమే నీవు,
అంతరాంతరము లెంచి చూడ పిండంతే నిప్పటి యన్నట్లు

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని;
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు;
తలతురు మిము శైవులు తగిన భక్తులును శివుడనుచు;
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవు డనుచు

సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు;
దరిశనములు మిము నానావిధులను తలపుల కొలదుల భజింతురు,
సిరుల మిమ్ము నే అల్పబుద్ధి దలచినవారికి అల్పం బవుదువు;
గరిమల మిము నే ఘనమని తలచిన ఘనబుద్ధులకు ఘనుడవు.

నీవలన కొరతే లేదు మరి నీరుకొలది తామెరవు,
ఆవల భాగీరథి దరి బావుల ఆ జలమే ఊరినయట్లు;
శ్రీవేంకటపతి నీవైతే మము చేకొని ఉన్న దైవమని
ఈవల నే నీ శరణనియెదను, ఇదియే పరతత్త్వము నాకు.

తమ అభిప్రాయానికి తగిన ఆధారాలు లేకున్నా, కొంత అజ్ఞత వలన, కొంత మతాభినివేశం వలన కొందరు వేంకటేశ్వరస్వామిని శివుడని, పరాశక్తి యని, కార్తికేయుడని వాదిస్తూ ఉంటారు. ఆయన విష్ణువని నిస్సందేహంగా సుప్రసిద్ధ కావ్యం **శిలప్పదికారం**లో ఇలంగో అడిగళ్ క్రీస్తు శకం 2వ శతాబ్దంలో చాటిచెప్పినా, తరువాత శతాబ్దాల తరబడి ఆళ్వారులు స్పష్టంగా ఆయనను విష్ణువని సంభావించి, కీర్తించినా, ఈ వాదాలు అప్పుడప్పుడు వినిపిస్తూనే ఉంటాయి. అన్యదేవతా

సంబంధమైన చిహ్నాలు స్వామి మూర్తిలో కనిపిస్తున్న సంగతి ఆళ్వారులే తమ గీతాలలో ప్రస్తావించారు. ఐనా వారు ఆయన విష్ణువే అని మనసార విశ్వసించారు. అన్నమాచార్యులు రచించిన ఈ కీర్తన కూడా "ఏకమేవాఽద్వితీయం బ్రహ్మ" అనే పరమసత్యాన్ని ఘోషిస్తూ, అన్ని నామాలూ, అన్ని రూపాలూ ఆ పరమాత్మునివే అని స్పష్టం చేస్తుంది

ఈ సత్యాన్ని వ్యాసమహర్షి ఎన్నడో మహాభారతంలో ఉద్ఘాటించాడు. ఆనుశాసనికపర్వంలో శ్రీ మహావిష్ణునామాలను, గుణాలను కీర్తించటానికి కూర్చిన శ్రీవిష్ణుసహస్ర నామస్తోత్రంలో 'శర్వ', 'శివ', 'స్థాణు', 'శంభు', 'రుద్ర', 'స్కంద', 'ఆదిత్య', 'భాను' ఇత్యాది అన్య దేవతాసూచక శబ్దాలను ఆయన విష్ణునామాలుగా స్తోత్రంలో చేర్చాడు "ఈ స్తోత్రం సమస్తలోకాల సృష్టిస్థితి లయాలకు కారకుడై, సర్వదేహుల జీవితాలను కాంతితో నింపి, జ్ఞానోదయం కలిగించి, భవబంధాలను ఛేదించి ముక్తిని ప్రసాదించే ఏకమాత్రరక్షకుడైన పరమాత్ముని కీర్తిస్తున్నదని శంకర భాష్యం నిరూపిస్తుంది".[38]

విష్ణువు విశ్వవ్యాపియని గ్రహించిన అన్నమాచార్యులు వైష్ణవులను గురించి కూడా అంత ఉదాత్తంగానే భావించాడు. ఆళ్వారులు, ఆచార్యులు తమ రచనలలో వ్యక్తం చేసిన సువిశాలదృక్పథాన్ని అలవరచుకొన్న ఆయన కులము, పదవి అనే సంకుచిత విచక్షణను అతిక్రమించి, భజనపరుడైనవాడే వైష్ణవుడని ఘోషించాడు. ఈ అంశాన్ని ప్రకటిస్తూ ఆయన పలుగీతాలు రచించాడు "జాతి భేదములు శరీరగుణములు, జాతి శరీరము తోడనే చెడు" ననీ, "ఆత్మ పరిశుద్ధం బెప్పుడును" అనీ అన్నాడు అట్టి భేదాలు పాటించటం నిరర్థకం అని ఆయన భావం. ఎందుకంటే, అజామిళుడు బ్రాహ్మణుడై జన్మించాడు, తక్కువ కులానికి చెందిన స్త్రీతో జీవించాడు, చివరకు విష్ణువు అతనిని ఉద్ధరించాడు, కనుక అజామిళుని వంటి వ్యక్తుల కులం, జాతి నిర్ణయించటం అసాధ్యం అని ఆయన భావించాడు. శ్రీమహావిష్ణు సేవనమే జీవన పరమావధి యని గుర్తించిన వ్యక్తియే "సుజాతి"లో జన్మమెత్తినవాడని కంఠోక్తిగా తెలిపాడు.

జన్మించిన కులం కాదు, ఆచరణలో కనిపించే గుణం ప్రధానమని

ఒక కీర్తనలో ఆయన ప్రకటించాడు [39]

ఏ కులజుడైన నేమి? ఎవ్వడైన నేమి?
ఆ కడ నాతడే హరి నెఱిగిన వాడు

పరగి సత్యసంపన్నుడైన వాడే,
పరనింద సేయ తత్పరుడు కానివాడు,
అరుదైన భూతదయానిధి యగువాడే,
పరులు తానే యని భావించువాడు.

నిర్మలుడై ఆత్మనియతి గలుగువాడే
ధర్మతత్పరబుద్ధి దగిలినవాడు,
కర్మమార్గములు గడవనివాడే
మర్మమై హరిభక్తి మఱవని వాడు

జగతిపై హితముగా చరియించువాడే
పగ లేక మతిలోనే బ్రతికినవాడు,
తెగ సకలము నాత్మ దెలిసినవాడే
తగిలి వేంకటేశదాసు డయిన వాడు.

కులభేదాల విషయంలో వైష్ణవమతం సదా ఉదారవైఖరి ప్రదర్శిస్తూ వచ్చింది ఏ కులంలో జన్మించా డన్నది ప్రధానం కాదు. పరమ దయామయుడైన శ్రీమహావిష్ణువు చరణాలపై భక్తి ప్రపత్తులు ఎంత గాఢంగా ఉన్నవన్నది ముఖ్యమని భావించింది. ఆళ్వారులు అనేక జాతులకు చెందినవారు వారిలో కనీసం ఒకరు — తిరుప్పాణాళ్వారు — అంటరానివారని భావించే పంచమజాతితో జన్మించినవాడు ఆ మహాయోగి జీవితంలో జరిగిన ఒక సంఘటన కులం కంటె భక్తి ప్రధానమని వైష్ణవమతం ప్రబోధిస్తుందని స్పష్టంచేస్తుంది. ఆయన కావేరీ తీరంలో శ్రీరంగక్షేత్రం దగ్గర వసించేవాడు ఆ కులానికి చెందినవారు సమీపిస్తే బ్రాహ్మణులు మైలపడతారనే సాంప్రదాయిక విశ్వాసాన్ని పురస్కరించుకొని, నదిలో స్నానం చేసేటప్పుడు కూడా ఇతరులకు దూరంగా ఉండేవాడు ఐనా ఒకనాడు పొరపాటున ఆయన రంగనాథస్వామి అర్చకుడైన లోకసారంగముని త్రోవకు అడ్డువచ్చాడు. ఆ అపరాధానికి ఆగ్రహించి ఆ

బ్రాహ్మణుడు తిరుప్పాణాళ్వారుపై రాళ్ళు రువ్వి, తాను పరిశుద్ధుడు కావటానికి తిరిగి కావేరిలో స్నానమాడి, స్వామి పూజకోసం కలశంతో నీరు తీసుకొని ఆలయానికి వెళ్ళాడు. కాని జాత్యహంకారదోషదూషితుడైన ఆ అర్చకుని స్వామి ఆలయంలో అడుగుపెట్టనీయలేదు. ఒక మహాత్ముని రాళ్ళతో నొప్పించిన నేరానికి పరిహారంగా ఆయనను తన భుజాలపై ఎక్కించుకొని సప్తప్రాకార పరివృతమైన శ్రీరంగదేవాలయం చుట్టు పరిభ్రమించాలని, అది అతని పాపానికి తగిన ప్రాయశ్చిత్తమని స్వామి స్పష్టం చేశాడు. అప్పుడు తిరుప్పాణాళ్వారు తనను తాకవద్దని ఎంత మొరపెట్టుకొన్నా వినక, లోకసారంగముని ఆయనను తన భుజాలపై ఎక్కించుకొని ఆలయానికి ప్రదక్షిణం చేశాడు

మరొక సంగతి. విశిష్టాద్వైత మతప్రవర్తకులలో ప్రథమగణ్యుడైన రామానుజాచార్యులు ఒక సందర్భంలో తోడిజీవుల దయనీయస్థితికి జాలిపడి, శ్రీరంగానికి కొంత దూరంలో ఉన్న తిరుక్కొట్టియూర్ (గోష్ఠీపురం)లోని సౌమ్యనారాయణస్వామి ఆలయగోపురం అధిరోహించి, కులమతప్రసక్తి లేకుండా అక్కడికి చేరిన జీవులందరికీ భవబంధాలను ఛేదించి మోక్షం ప్రసాదించే "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరీ మహా మంత్రాన్ని ఉపదేశించాడు.

ఈ విశాలదృష్టితోనే, దైవకృప పొందటానికి అందరికీ అర్హత ఉన్నదని, అన్నమాచార్యులు తన కీర్తనలలో అతిస్పష్టంగా ప్రకటించాడు.

బ్రహ్మ మొకటే, పరబ్రహ్మ మొకటె, పర
బ్రహ్మ మొకటే, పరబ్రహ్మ మొకటే.
కందువగు హీనాధికము లిందు లేవు,
అందరికీ శ్రీహరే అంతరాత్మ;
ఇందులో జంతుకుల మింతా నొకటే,
అందరికీ శ్రీహరే అంతరాత్మ.

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే,
అండనే బంటు నిద్ర అదియు నొకటే;
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే,
చండాలు డుండేటి సరి భూమి యొకటే.

అనుగుదేవతలకు అల కామసుఖ మొకటే,
ఘనకీటపశువులకు కామసుఖ మొకటే;
దిన మహోరాత్రములు తెగి ధనాఢ్యున కొకటే,
ఒనర నిరుపేదకును ఒక్కటే అవియు.

కొరలి శిష్టాన్నములు కొను నాక లొకటే,
తిరుగు దుష్టాన్నములు తిను నాక లొకటే;
పరగ దుర్గంధములపై వాయు వొకటే;
వరుస పరిమళముపై వాయు వొకటే.

కడిగి ఏనుగు మీద కాయు ఎం డొకటే,
పుడమి శునకము మీద పొలయు నెం డొకటే;
కడు పుణ్యులను, పాపకర్ములను సరిగావ
జడియు శ్రీ వేంకటేశ్వరు నామ మొకటే

మత దురభిమానం, సిద్ధాంతపరమైన వివాదాలు, మతశాఖలకు సంబంధించిన పట్టుదలలు, అనుమానాలు, అసహిష్ణుత మనుష్యుల మధ్య చీలికలు తెస్తున్న సాంఘిక వ్యవస్థలో అన్నమాచార్యులవలె సఖ్యం, సామరస్యం, సౌమనస్యం వ్యాప్తి చెందాలని ప్రబోధించేవారు అరుదుగా కనిపిస్తారు దేశం, భాష, జాతి, మతం, కులం, తెగ అనే బాహ్యమైన అంతరాలతో ప్రమేయం లేకుండా, సమస్త జీవులను సృష్టించి, పోషించే పరమాత్ముడు ఒక్కడే అయితే, ఆయన అద్వితీయుడే అయితే, ఏ మతానికి చెందినవారైనా, ఏ పూజావిధానం అవలంబించేవారైనా, అందరూ ఆయన కృపకు అర్హులే అని స్పష్టమవుతుంది

"ఆకాశాత్ పతితం తోయం
యథా గచ్ఛతి సాగరమ్,
సర్వ దేవనమస్కారః
కేశవం ప్రతిగచ్ఛతి"

అని ఒక ప్రసిద్ధమైన సూక్తి ఉంది. ఆకాశం నుంచి కురిసే నీరు సముద్రం చేరినట్లే సర్వదేవతలకు చేసే నమస్కారం కేశవునికి — కృష్ణునికి — చేరుతుందని భావం. కృష్ణుడు కూడా భగవద్గీతలో "శ్రద్ధతో

ఇతరదేవతలను ఆరాధించేవారు కూడా నన్నే ఆరాధిస్తున్నారు"[40] అని ఈ భావమే వ్యక్తంచేశాడు.

ఆధ్యాత్మిక జగత్తులో ఇట్టి విశాల దృష్టిని ప్రకటిస్తూ, విశ్వం విష్ణు మయమే కనుక, తెలిసినా, తెలియకున్నా మనుష్యులందరూ వైష్ణవులే అని ఒక గీతంలో తన ఔదార్యాన్ని వ్యక్తం చేశాడు

వైష్ణవులు కాని వార లెవ్వరు లేరు,
విష్ణుప్రభావ మీ విశ్వ మంతయు గాన.

అంతయు విష్ణుమయం బటు, మరి దేవ
తాంతరములు కల వన నేలా?
భ్రాంతి బొంది యే భావము భావించి
నంతనే పుణ్యులౌట తప్పదు గాన

ఎవ్వరి గొలిచిన నేమి కొరత, మరి
యెవ్వరి దలచిన నేమీ?
అవ్వ లివ్వల శ్రీహరి రూపుగానివా
రెవ్వరు లేరని యెఱుక దోచిన జాలు.

అతి చంచలంబైన యాతుమ గలిగించు
కతమున బహు చిత్త గతులై
యితరుల గొలిచిన, ఎడయక అనాథ
పతి తిరువేంకటపతి చేకొను గాక.

ఈవిధంగా అన్నమాచార్యులు 'విష్ణు' శబ్దాన్ని సంకుచితమత శాఖా పరంగా గాక, సమస్త జీవులకు తండ్రి, విశ్వమంతటికీ ప్రభువు అయిన పరమాత్ముని సూచించటానికి ఉద్దేశించాడు. ఆ తండ్రి బిడ్డలం గనుక వసుధైక కుటుంబానికి చెందిన అందరం పరస్పరం సహజమమతాబంధా లతో కట్టుపడి ఉన్నాము. ఇక్కడ అనుమానాలకు, విద్వేషాలకు తావు లేదు; తావున్నది అవగాహనకు, అనురాగానికి మాత్రమే. ఏ కాలానికీ పరిమితం కాక, ఏకాలంలోనైనా అవశ్యం పాటించవలసిన ఈ ప్రశస్త సందేశం నిశ్చయంగా ఆ పరమభాగవతుడు మానవజాతికి ప్రసాదించిన మహితోపహారం.

# జ్ఞాపికలు

సూచన సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన ఈ పుస్తకం ఇంగ్లీషు మూలంలో దీనిలో పేర్కొన్న ఇంగ్లీషు పుస్తకాల శీర్షికలు, ఉపశీర్షికలు, ప్రచురణ వివరాలు సమగ్రంగా ఉన్నవి. ఆ పుస్తకాలను సంప్రతింపదలచిన పాఠకులు పూర్తి వివరాలకు ఇంగ్లీషు మూలాన్ని చూడవలసినదని మనవి.

1 I 22. 20.

తద్విష్ణోః పరమం పదం
సదా పశ్యన్తి సూరయః
దివీవ చక్షు రాతతమ్

2 I 15 3.

3 దర్శన్, సీయింగ్ ది డివైన్ ఇమేజ్ ఇన్ ఇండియా అనే పుస్తకంలో డయానా ఎక్.

4 ది థియాలజీ ఆఫ్ రామానుజ అనే పుస్తకంలో జాన్ కార్మన్

5 భగవద్గీతలో కృష్ణుడు అర్జునునికి చేసిన చివరి ఉపదేశం (18 : 66).

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః

విశిష్టాద్వైత మతస్థులు దీనిని చరమశ్లోకమని వ్యవహరిస్తారు. అష్టాక్షరీ, ద్వయమంత్రాలతోపాటు చరమశ్లోకాన్ని కూడా వారు మంత్రంగా పరిగణిస్తారు.

6 మిస్టిసిజమ్ అనే పుస్తకంలో ఈవ్‌లిన్ అండర్‌హిల్.

7 "ది విశిష్టాద్వైత ఆఫ్ రామానుజ" అనే వ్యాసంలో పి.యన్. శ్రీనివాసాచారి.

8 వేదాంతదేశికుల దయాశతకమ్‌లో మొదటి శ్లోకం.

ప్రపద్యే తం గిరిం ప్రాయః శ్రీనివాసానుకంపయా,
ఇక్షుసారస్రవంత్యేవ యన్మూర్త్యా శర్కరాయితమ్.

9 స్వర్గంలో అప్సరసల పొత్తు పట్ల కూడా తన విముఖత్వాన్ని కులశేఖరులు ముకుందమాలలోని ఒక శ్లోకంలో వ్యక్తం చేశారు.

నాఽహం వన్దే తవ చరణయో ర్ద్వంద్వ మద్వంద్వహేతోః,
కుంభీపాకం గురు మపి హరే నారకం నాఽవనేతుమ్,
రమ్యా రామా మృదుతనులతా నన్దనేనాఽపి రంతుమ్,
భావే భావే హృదయభవనే భావయేఽయం భవన్తమ్.

10 హిమ్స్ ఫర్ ది డ్రౌనింగ్ అనే పుస్తకంలో ఏ.కే. రామానుజన్.

11 విష్ణువు సర్వప్రహరణాయుధుడు. ఆయన ఆయుధాలలో అతిముఖ్యమైన పంచమహాయుధాలు : సుదర్శనం (చక్రం), పాంచజన్యం (శంఖం), కౌమోదకి (గద), నందకం (ఖడ్గం), శార్ఙ్గం (ధనుస్సు).

12 త్యాగరాజును గురించి కూడా ఇటువంటి కథ ఒకటి ప్రచారంలో ఉన్నది. ఆయన తీర్థయాత్ర చేస్తూ తిరుపతి క్షేత్రంచేరి, స్వామి వారి ఆలయంలోనికి వెళ్ళినప్పుడు, లోపల తెరవేసి ఉండటంవల్ల మూలవిరాట్టు దర్శనం కాలేదట. వెంటనే ఆయన ఆశువుగా "తెరతీయగరాదా! తిరుపతి వేంకటరమణ! నాలోని మత్సరమను తెర తీయగరాదా!" అనే పాట పాడగానే తెర తొలగిపోయి స్వామి దివ్యమంగళ విగ్రహ దర్శనమైనదట. ఆ ఆనందాతిరేకంలో ఆయన "వేంకటేశ! నిను సేవింపను పదివేల కనులు కావలెనయ్యా!" అని మరొక కీర్తనను ఆశువుగా స్వామి సన్నిధిలో గానం చేశాడట.

13 విశిష్టాద్వైతమతంలో పంచసంస్కారాలు : 1. తాపం : శంఖ, చక్రముద్రలను నిప్పులో వేడిచేసి భక్తుని భుజాలపై వేయటం.

2. పుండ్రం: తిరుమణి, తిరుచూర్ణాలను నుదుటిపై ధరించటం 3. నామం : విష్ణుదాసుడని సూచించే పేరును గురువు శిష్యునికి ప్రసాదించటం. 4. మంత్రం : గురువు మూలమంత్రమైన అష్టాక్షరిని, ఇతర మంత్రాలను ఉపదేశించటం 5 యాగం : శరణాగతి దీనిని సాధారణంగా శిష్యుని పక్షాన గురువు చేస్తాడు

14 కణికణ్ణన్ అనే విష్ణుభక్తుడు కాంచీపురాన్ని పాలించే రాజును కీర్తిస్తూ కవిత చెప్పటానికి నిరాకరించగా, కోపంతో రాజు అతనిని, అతని గురువైన తిరుమళిశై ఆళ్వారును ఊరివిడిచి పొండని ఆజ్ఞాపించాడు ఆ సందర్భంలో తిరుమళిశై ఆళ్వారు దివ్య ప్రబంధం 'నాన్ముగన్ తిరువందాది' లో 11వ పాశురంలో

"నా నాలుకతో
నరులను
నుతించను"

అని ఉద్ఘాటించాడు.

15 ఇటువంటి అనుభవమే త్యాగరాజుకు కూడా తటస్థించింది ఆయన నిత్యం అర్చించే శ్రీరాముని విగ్రహం ఒకప్పుడు పోయింది తమ్మునితో తగవుపడి ఆయన అన్నయే విగ్రహాన్ని కావేరీనదిలో విసిరి వేశాడని కొందరంటారు రామానుగ్రహం వల్ల కొన్నాళ్ళకు ఆ విగ్రహం త్యాగరాజుకు తిరిగి లభించింది. విగ్రహం తనకు దూరమైనప్పుడు ఆర్తితో ఆయన "ఎందు దాగినాడో", "నే నెందు వెదకుదురా" వంటి కృతులలో తన పరితాపాన్ని దైవానికి చెప్పుకొన్నాడు.

16 ప్రపంచాన్ని రంగస్థలంగా, జీవితాన్ని నాటకప్రదర్శనంగా భావించటం అనేక జాతులలో మనకు కనిపిస్తుంది. శ్రీరంగక్షేత్రంలో వేంచేసి ఉన్న విష్ణుమూర్తి పేరైన 'రంగనాథ' శబ్దం ఆయన జగన్నాటకాన్ని నిర్వహించే సూత్రధారుడనే అర్థాన్ని సూచిస్తుంది

17 భగవద్గీత 10 · 12

18 7. 5 3.

19 12 3. 51.

20 తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు ఆంధ్రీకరించిన శ్రీ భగవద్గీత గ్రంథపీఠికలో సంపాదకుడు జి. యస్ రెడ్డి వ్యక్తంచేసిన అభిప్రాయం

21 ఆ పీఠికలోనే

22 ఆ పుస్తకంలోనే పుట VI

23 ది ఫౌండేషన్స్ ఆఫ్ ఇండియన్ కల్చర్ అనే పుస్తకంలో

24 రూపగోస్వామి రచించిన పద్యావళి గ్రంథపీఠికలో

25 అన్నమాచార్యుల సంకీర్తన లక్షణమ్ గ్రంథంలో జయదేవుని గీత గోవిందమ్ ప్రస్తావన ఉన్నది.

26 విష్ణువును తామరరేకుల వంటి కనులు గలవాడు (పుండరీకాక్షుడు) అని వర్ణిస్తారు. ఆయన నేత్రాలు కమలదళాలవలె దీర్ఘంగా, విశాలంగా, సుందరంగా ఉంటాయని భావం. మన్మధుని పంచబాణాలలో ఒకటి తామరపువ్వు.

27 అన్నమాచార్యుల కాలంలో "చీర" అనేమాటకు "వస్త్రం" అని అర్థం స్త్రీలు ధరించే వస్త్రమైనా, పురుషులు ధరించే వస్త్రమైనా, "చీర" అనే పేరుతోనే వ్యవహరించేవారు.

28 మన పురాణాలలో తులసీమాహాత్మ్యం విపులంగా వర్ణితమయింది విష్ణుప్రీతికరమైన పత్రం కనుక తులసిని ఆయన అర్చనకు, అలంకారానికి ఎక్కువగా ఉపయోగిస్తారు.

29 కొంతవరకు ఇటువంటి భావం పురందరదాసు రచించిన ఒక గీతంలో కనిపిస్తుంది

> చెరువులోని నీటిని
> తిరిగి చెరువులోనే పోసి

వరాలను పొందిన
భక్తుల వలె కనిపించండి.
హరి కరుణ వలన
కలిగిన సంపదను
హరికే సమర్పించి,
ఆనందంగా జీవించండి

శ్రీ పురందర విఠలరాయని
చరణ పద్మాలను
తిలకిస్తూ జీవించండి
హరి కరుణ వలన
కలిగిన సంపదను
హరికే సమర్పించి
ఆనందంగా జీవించండి

మహారాష్ట్రంలోని పండరీపుర క్షేత్రంలో వెలిసిన విష్ణువును 'విఠల రాయ'డని పిలుస్తారు

30 శ్రీరంగ గద్యంలో.

31 వేంకటేశ్వరస్వామి ఆలయం దగ్గర ఉన్న కోనేరు - "స్వామి పుష్కరిణి" - భక్తుల పాపాలను తొలగించే మహిమ గలదని కీర్తి పొందింది స్వామిని తెలుగువారు "కోనేటిరాయడు" అని పిలుస్తారు. కొండలమీద వెలసిన దైవం గనుక "కొండలరాయడు" అంటారు ఈ రెండు పేరులు అన్నమాచార్యుల కీర్తనలలో తరచుగా కనిపిస్తాయి

32 పైకి ఎత్తిన అరచేతిని "అభయహస్తం" అంటారు. రక్షించటానికి సంసిద్ధంగా ఉన్నానని, భక్తులు భయపడనక్కరలేదని ధైర్యం చెప్పే ముద్ర అది. వేంకటేశ్వరస్వామి కుడిచేయి అభయముద్రలో గాక, వరదముద్రలో ఉన్నది. అందువల్లను, ఈ కీర్తనలో బ్రహ్మను గురించి, గంగానదిని గురించి ప్రస్తావన ఉండటం వల్లను ఈ

సందర్భంలో అన్నమాచార్యులు వేంకటేశ్వరస్వామి మూర్తినిగాక, శ్రీ మహావిష్ణువును దృష్టిలో ఉంచుకొన్నట్లు కనిపిస్తుంది

33 రామానుజాచార్యులు బ్రహ్మసూత్రాలకు వ్రాసిన శ్రీభాష్యమ్ మంగళ శ్లోకంలో శ్రీనివాసుని ప్రస్తుతిస్తూ, "అఖిలభువన జన్మస్థేమభంగాదిలీలే" అని వర్ణించాడు.

34 **కుమారసంభవమ్** 1.3.

35 **త్యాగరాజ** అనే పుస్తకంలో వి. రాఘవన్.

36. 3. 1. 45.

37 శాన్తిపర్వమ్. 328. 37.

38 భారతీయ విద్యాభవన్ వారు ప్రచురించిన **శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రమ్** పీఠికలో యన్. రఘునాథన్.

39 ఈ కీర్తనలో వ్యక్తమైన భావాలు గుజరాతీ భక్తకవి నరసింహ మెహతా రచించిన "వైష్ణవజనతో తేనే కహియే జో పీడ పరాయా జాణేరే" అనే గీతంలోని భావాలతో పోల్చదగినవి.

40 9. 23.

యేఽప్యన్య దేవతాభక్తా
యజన్తే శ్రద్ధయాన్వితాః
తేఽపి మా మేవ కౌన్తేయ
యజ న్త్యవిధి పూర్వకమ్.

# ఉపయుక్త పుస్తకసూచిక

తాళ్ళపాక అన్నమాచార్యులు **శృంగారకీర్తనలు, అధ్యాత్మ కీర్తనలు.** పరంపరగా సంపుటాలు వెలువడుతున్నవి. ఇంకా పూర్తి కాలేదు తిరుపతి · తిరుమల - తిరుపతి దేవస్థానములు, 1936 —.

తాళ్ళపాక చినతిరువేంగళనాథుడు (చిన్నన్న) **అన్నమాచార్య చరిత్రము.** ద్విపద కావ్యము పరిష్కర్త : వేటూరి ప్రభాకరశాస్త్రి తిరుపతి · తిరుమల - తిరుపతి దేవస్థానములు, 1949

తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు **శ్రీ భగవద్గీత.** పరిష్కర్త : జి యన్. రెడ్డి తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థ, 1978.

రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ "అన్నమాచార్యుని కవిత". **వాణి,** VII 5, 1955

వేటూరి ఆనందమూర్తి. **తాళ్ళపాక కవుల కృతులు.** హైదరాబాద్, 1974.

**తాళ్ళపాక కవుల పదకవితలు.** హైదరాబాద్, 1976

ముట్నూరి సంగమేశం. **అన్నమాచార్య సాహితీ కౌముది.** తిరుపతి : తిరుమల - తిరుపతి దేవస్థానములు, 1981.

బాలాంత్రపు రజనీకాంతరావు. **ఆంధ్రవాగ్గేయకార చరిత్రము.** విజయవాడ · విశాలాంధ్ర ప్రచురణాలయం, 1975